# కడప జిల్లాలో

# పాలెగాళ్ళ రాజ్యం



ఆంధ్ర ప్రదేశ్ పౌర హక్కుల సంఘం

కడప జిల్లా

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
కడపజిల్లా

తేది : 1-1-1996

ప్రతులు : 3000

వెల : రూ. 10.00

ప్రతులకు : కె. జయశ్రీ, న్యాయవాది
9/351, మనోజీరావు వీధి
ప్రొద్దుటూరు - 516 360.

మరియు

# కడప పాలెగాళ్ళ సాయుధ దౌర్జన్యాలపైన నివేదిక


ఉపోద్ఘాతం ........................................ 1

పాలెగాళ్ళ వ్యవస్థ – గ్రామీణ ముఠా కక్షలు ........................ 4

కొన్ని కథా చిత్రాలు ........................................ 11

రాజకీయ ముఠాల ఆవిర్భావం ........................................ 25

మూడు తాలూకాల కథ ........................................ 34

ప్రజలు, ప్రజావసరాలు, ప్రజాస్వామ్యం ........................ 64

ముగింపు ........................................ 78



ఆంధ్ర ప్రదేశ్ పౌర హక్కుల సంఘం



కవర్ ఫోటో : బక్కోట్ల లోని బంగినపల్లి మామిడి పండ్ల కావు కడప పాలెగాళ్ళ బాంబులు

V. Krishnakumari

# ఉపోద్ఘాతం

రెండు సంవత్సరాల క్రింద ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం 'కర్నూలు పాలెగాళ్లు' అనే ప్రచురణ తీసుకొచ్చింది. కర్నూలు జిల్లాలో గ్రామీణ ముఠాకక్షల సంప్రదాయం రాజకీయ ఆర్థిక రంగాలలోకి ప్రవేశించి, ఒకవైపు జిల్లాలో ప్రజాస్వామిక సంస్కృతినీ, ఆర్థిక సామాజిక ప్రగతినీ నాశనం చేస్తూ, ఇంకొక వైపు కొద్దిమంది పెత్తందార్లకు ఆర్థిక రాజకీయ రంగాలలో బలపడడానికి (నాయకులు కోటీశ్వరులు కావడానికి) ఉపయోగపడిన వైనాన్ని ఆ నివేదికలో క్లుప్తంగా వివరించాము.

కేవలం పరిపాలనా యంత్రాంగంలోనేకాక సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలన్నిటిలోనూ ప్రజాస్వామ్య విలువలు వ్యవస్థలో నెలకొనాలనీ, అప్పుడే ప్రజలకు నిండుగా జీవించడానికీ, జీవితాన్ని మెరుగుపరచుకోవడానికీ అవకాశం ఉంటుందనీ పౌరహక్కుల సంఘం నమ్ముతుంది. రాయలసీమ జిల్లాలలో అనేక ప్రాంతాలలో ప్రబలంగా ఉన్న గ్రామీణ ముఠాకక్షల సంప్రదాయం స్వభావరీత్యానే ప్రజాస్వామ్యానికీ ప్రగతికీ నష్టకరం. కాగా, 1980 తరువాత అది గ్రామం ఎల్లలు దాటి జిల్లా స్థాయిలోనూ రాష్ట్రస్థాయిలోనూ సాధారణ రాజకీయ ఆర్థిక జీవితంలోకి వ్యాపించడం వల్ల దాని దుష్ఫలితాలు కేవలం రాశిలో పెరగడమేకాక గుణాత్మకంగా కూడా చాలా నష్టకరంగా పరిణమించాయి. బ్రిటిష్ పాలకులచేత 'ఫాక్షన్లు' అని పిలవబడిన గ్రామీణ ముఠాలు పరిణామం చెంది రాజకీయ ఫాక్షన్లు, సారాయి ఫాక్షన్లు, సివిల్ కాంట్రాక్టుల ఫాక్షన్లు, నాపరాయిగనుల ఫాక్షన్లు, పుట్టుకొచ్చి సామాజిక జీవితం యావత్తు బాంబుల మోతకు దద్దరిల్లసాగింది. ప్రజాస్వామ్య విలువలు, ప్రజాప్రయోజనాలు, ప్రజాభీష్టం అనేవి పక్కకుపోయి బలప్రయోగ సామర్థ్యానికి రాజకీయాలలో పెద్దపీట దక్కింది. 1989 అసెంబ్లీ ఎన్నికల అనంతరం స్వయంగా ముఠానాయకులు, లేక ముఠాల పోషకులు అయిన విజయభాస్కర రెడ్డి, రాజశేఖర రెడ్డి, దివాకర్ రెడ్డి, మైసూరా రెడ్డి తదితర రాయలసీమ ఘనుల రాజకీయ కక్షలే రాష్ట్ర రాజకీయాల స్వరూపాన్ని నిర్దేశించే పరిస్థితి ఏర్పడడంతో జమ్మలమడుగు, ఆళ్ళగడ్డ, పులివెందుల, నందికొట్కూరు, ప్రొద్దుటూరు, పత్తికొండ, తాడిపత్రి మొదలయిన ఊర్ల పేర్లు, వాటి ఘనచరిత్ర రాష్ట్రమంతటా ప్రజల దృష్టిని ఆకర్షించసాగాయి. రాయలసీమను బాంబులసీమ అనీ, ఆళ్లగడ్డను బాంబుల గడ్డ అనీ దినపత్రికలు వ్యవహరించసాగాయి. ముఠా సంస్కృతి గురించి, హత్యలు ప్రతిహత్యల గురించి పత్రికలు రాయసాగాయి. ఇది ఒకమేరకు మంచి పరిణామమే.

అయితే మనదేశంలో ప్రజాస్వామ్య విధ్వంసానికి సంబంధించిన అన్ని విషయాలలాగే ఈ విషయంలోకూడ పత్రికలద్వారా ప్రచారం అయ్యే సంచలనాత్మక వార్తల ప్రాతిపదికన జరిగే చర్చ ప్రజాస్వామ్య విలువల పునరుద్ధరణకు పరిరక్షణకూ ఏ మాత్రం దోహదం చేస్తుందనేది ప్రశ్నార్థకమే. దౌర్జన్యాలు చేసి, చేయించి అధికారాన్ని ఆస్తినీ సంపాదించుకునే వారిని నేరగాళ్ళుగా చూసేబదులు హీరోలుగా భావించే ప్రమాదం ఉంది. ఎక్కువగా అదే జరుగుతూఉంది కూడ. దౌర్జన్యం చేసి అధికారం నిలబెట్టుకునే వారిని పెద్ద మనుషులుగా భావించే పాలెగాళ్ళ సంస్కృతికి రాయలసీమలో ముందునుండి బీజాలు ఉన్నాయి. పైగా వాళ్ల తమ దౌర్జన్యాలను నిరాటంకంగా సాగించుకోగలుగుతున్నారు. దీనికి పత్రికా వార్తల 'సెన్సేషనలిజం' తోడయితే ఇంక ప్రతీ పాలెగాడూ ఒక హీరోగానే కనిపిస్తాడు.

అందువల్ల ఈ విషయాన్ని కేవలం సంచలనాత్మక వార్తల దృష్టితోకాక ప్రజాస్వామిక దృక్పథంతో చూడవలసిన అవసరం ఉందని పౌరహక్కుల సంఘం భావిస్తున్నది. ముఠాతత్వంనుండి రాయలసీమకు విముక్తి ఏ విధంగా లభిస్తుందన్న ప్రశ్నకు సులభమైన సమాధానం లేకపోవచ్చు. కానీ ఒకటి మాత్రం సత్యం. ఆ సంస్కృతిని ఆసరా చేసుకొని ఇతరుల ప్రాణాలనూ రక్తాన్నీ పణంగాపెట్టి తాము అధినాయకులూ కోటీశ్వరులూ అవుతున్న పెద్ద మనుషులను ప్రజలు బందిపోట్ల కంటె హీనమయిన నేరస్తులుగాచూసి అసహ్యించుకోవడం నేర్చుకోవాలి. ఇప్పుడు వాళ్లను ప్రజలంతా గుడ్డిగా అభిమానిస్తున్నారని కాదు. వాళ్లంటే కొంత కోపం ఉంది, అసహ్యమూ లేకపోలేదు. కానీ 'సాగించుకోగలవారి' దౌర్జన్యాలకు సాధారణంగా సమాజంలో ఉండే చలామణి కూడా ఉంది. ప్రజలు వాళ్లను ఆశ్రయించి తమ అవసరాలను, స్వార్థప్రయోజనాలను సాధించుకునే దురాచారం ఉంది. తాము తీర్చుకోలేని కక్షలు వాళ్ల ద్వారా తీర్చుకునే బలహీనత సహితం ఉంది. ఎంతటి దౌర్జన్యమయినా సమాజానికి అలవాటయిపోయినట్లయితే అదొక మామూలు విషయంగా కనిపించే ప్రమాదం ఉంటుంది. దానికి తగిన సంస్కృతి సామాజిక వ్యవస్థలో ముందునుండీ ఉన్నట్లయితే అది మరీ సులభం అవుతుంది. అది ఆ దౌర్జన్యానికి బలం చేకూరుస్తుంది.

ఈ దృష్టితోనే 'కర్నూలు పాలెగాళ్ళు' అన్న ప్రచురణ 1993లో తీసుకరావడం జరిగింది. ఇప్పుడు కడప జిల్లాలోని ఆధునిక పాలెగాళ్ళ పుట్టుకనూ నిర్వాకాన్నీ వివరించే ఈ ప్రచురణ చేపట్టాము. అనంతపురం జిల్లాలో ముఠాదౌర్జన్యాల గురించి త్వరలో ఇంకొక నివేదిక ప్రచురిస్తాము. అందులో కడప రాజకీయాల ప్రస్తావన మళ్ళీ అవసరం అవుతుంది.

ఎందుకంటే అనంతపురం జిల్లా రాజకీయాలను హింసాత్మకం చెయడంలో 'పులివెందులహస్తం' పాత్ర చాలా ఉంది. అయినప్పటికి అది వేరే చరిత్ర.

ఎన్ని హత్యలు, ఏ పాటిదౌర్జన్యం, ఏ మాత్రం హింస అనేది ప్రమాణంగా పెట్టుకుంటే ముఠాకక్షకు కడపను ముందు చెప్పుకోవాలా కర్నూలును ముందు చెప్పుకోవాలా అంటే తీర్పు చెప్పడం కష్టం. ఆళ్ళగడ్డ (కర్నూలు జిల్లా)లో ఉన్నంత ప్రత్యక్ష దౌర్జన్యం, భయ వాతావరణం వేరే ఎక్కడా లేదని ఉభయ జిల్లాల్లో అంటారు. అది నిజమే కావచ్చు. కాని సామాజిక జీవితంలో ముఠాసంస్కృతి ఎక్కడ ఎక్కువ బలంగా ఉందనేది ప్రమాణంగా తీసుకొంటే కర్నూలుకంటే కడప జిల్లా ముఠాకక్షలకు ప్రతీకగా నిలుస్తుంది. కడప జిల్లా సామాజిక జీవితంలో అది ఆద్యంతం అలుముకొని ఉంది. ఈ జిల్లాలో భిక్షగాళ్ళు ఒక సంఘం పెట్టుకున్నారో లేదో తెలియదుగాని పెట్టుకోవడం అంటూ జరిగితే అది అనతి కాలంలోనే రెండుగా చీలి ఒక ముఠా ఒక పాలెగాడికి అనుకూలం, ఇంకొకటి మరొకడికి అనుకూలం అవుతుంది అనడంలో సందేహం లేదు. వేరే ఏకారణంగా చీలకపోతే ఆ పాలెగాళ్ళ అవసరాలకోసమే చీలుతుంది. వాళ్ళకు భిక్షగాళ్ళతో అవసరం ఏముంటుందా అని సందేహించవలసిన అవసరంలేదు. వేరేదేనికి కాకపోయిన దొంగ ఓట్లకు పనికివస్తారు.

పాతకాలపు పాలెగాళ్ళ వ్యవస్థ, తర్వాత కాలపు గ్రామీణ ముఠాకక్షల సంప్రదాయం, 1978 తర్వాత జిల్లా రాజకీయార్థిక జీవితాన్ని శాసించే స్థాయికి ఎదిగిన రాజకీయ ముఠాలు – వీటి ఆవిర్భావాన్ని గురించి, స్వభావాన్ని గురించి, పర్యవసానాలను గురించి ఈ నివేదికలో మాకు సాధ్యమైన మేరకు వివరిస్తాము. అయితే డిటెక్టివ్ నవలలాగా దోషులెవరని తెలుసుకోవడానికి చివరిదాకా ఆగనవసరం లేకుండా ఇప్పుడే తెలుసుకోవచ్చు. కడప జిల్లాలోని ముఠా కక్షల సంస్కృతిని తమ రాజకీయ పురోగమనం కోసం నిస్సిగ్గుగా వాడుకొని జిల్లా రాజకీయాలను రక్తసిక్తం చేసిన ఘనులు ముగ్గురు. పులివెందులలో వై. యస్. రాజశేఖర్ రెడ్డి, ప్రొద్దుటూరులో ఎమ్. వి. రమణా రెడ్డి, జమ్మల మడుగులో గుండ్లకుంట శివారెడ్డి. వీరి ముగ్గురిని పేర్కొంటున్నామంటే మిగిలిన వాళ్ళంతా పరిశుద్ధులు కాదు. కాని ఆద్యులు మాత్రం వీరే. వరవడి వేసింది, దారిచూపింది వీరే.

✤ ✤ ✤

# పాలెగాళ్ళ వ్యవస్థ – గ్రామీణ ముఠాకక్షలు

ఈ రాజకీయ నాయకులను పాలెగాళ్ళు అంటున్నామంటే ఒకప్పటి పాలెగాళ్ళ వ్యవస్థకు వీళ్ళు ప్రత్యక్ష వారసులని (అంటే పాలెగాళ్ళ వంశాలకు చెందిన వాళ్ళని) మా ఉద్దేశ్యం కాదు. కొద్దిమంది అయి ఉండవచ్చును, కాని అధిక భాగం కాదు. నిజానికి 18వ శతాబ్దం చివరి భాగాన రాయలసీమలో బలమైవ పాలెగాళ్ళు పెద్ద సంఖ్యలో ఉన్న ప్రాంతం పులివెందుల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు తాలూకాలు కాదు. ప్రస్తుత చిత్తురు జిల్లాలోని (పాత) మదనపల్లి, వాయల్పాడు తాలుకాలు, ప్రస్తుత అనంతపురం జిల్లాలోని (పాత) కదిరి తాలూకా, ప్రస్తుత కడప జిల్లా లోని (పాత) రాయచోటి తాలూకాలు ఆనాడు పాలెగాళ్ళకు ప్రధాన కేంద్రాలు. రాయలసీమ బ్రిటిషు అధిపత్యంలోకి వచ్చిన తొలి రోజులలో (అంటే 19వ శతాబ్దపు తొలి సంవత్సరాలలో) ఈ నాలుగు తాలూకాలు కడప జిల్లాలోనే ఉండేవి. (అప్పట్లో రాయలసీమలో బళ్ళారి, కడప అన్న రెండు జిల్లాలు మాత్రమే ఉండేవి). కదిరి తాలూకా 1910లో అనంతపురం జిల్లాలో కలిసింది. మదవపల్లి, వాయల్పాడు 1911లో చిత్తూరు జిల్లాలో కలిసాయి. ఒకదానికి ఒకటి ఆనుకొని ఉన్న ఈ తాలూకాలు పాలకొండలు విస్తరించిన పీఠభూమి ప్రాంతంలో ఉన్నాయి. ఆ కొండలలోని దుర్గాలు, పాలెగాళ్ళ కేంద్రాలుగా ఉండేవి. రాయచోటి నుండి మదనపల్లి వెళ్ళే రహదారిలో ఉన్న గుర్రంకొండ దుర్గం పాలెగాళ్ళను అణచడానికి కడప నవాబులు నెలకొల్పిన కోట అయి ఉండాలని బ్రిటిష్ వాళ్ళు 19వ శాతాబ్దం చివరిభాగంలో ప్రచురించిన కడప మాన్యువల్ లో పేర్కొన్నారు. ఈ నాలుగు తాలూకాల్లో అధిక భాగం ఎగుడు దిగుడుగా ఉన్న సార విహీవమయిన నేలలు ఉన్నాయి. ఇక్కడి గ్రామాలు సగటున చాలా చిన్నవి. ఒక్కొక్క రెవెన్యూ గ్రామంలో 10 నుండి 12 దాకా ఊర్లు ఉంటాయి. ఈ నైసర్గిక స్వరూపం పాలెగాళ్ళ ఆధిపత్యానికి సరిపోయింది.

రాయలసీమ మొదటి కలెక్టర్ థామస్ మన్రో క్రీ.శ. 1800లో గుర్తించిన 80 మంది పాలెగాళ్ళలో 37 మంది ఈ నాలుగు తాలూకాలకు చెందిన వారే. కాని నేడు రాయచోటిని మినహాయిస్తే మిగిలిన ప్రాంతం పెద్దగా ఫాక్షన్ ప్రభావం ఉన్న ప్రాంతం కాదు. సాధారణ భూస్వామ్య పెత్తనం ఉన్న ప్రాంతం. ఫాక్షన్ ప్రాబల్యం రాయచోటిలో కొంత ఉన్నప్పటికి ఈ రోజు కడప జిల్లాలో ముఠాల ప్రాబల్యం ఎక్కువగా ఉన్నది పాలకొండల పీఠభుమి ప్రాంతంలో కాదు. ఆ కొండలకు దిగువన ఉత్తరాన ఉన్న పెన్నా నదీ లోయలోని నల్లరేగడి నేలలలో. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల తాలూకాల్లో అధిక భాగం ఈ లోయలోనే ఉన్నాయి. (పులివెందుల తాలూకాలోని పడమటిభాగం మాత్రం కొంతమేరకు పీఠభూమి ప్రాంతంలో ఉంది). 18వ శతాబ్దంలో దక్షిణాన ఉన్న పీఠభూమి ప్రాంతం పాలెగాళ్ళకు ప్రధాన కేంద్రంకాగా, 19వ శాతాబ్దం చివరిభాగం నుండి ఈ లోయప్రాంతమే గ్రామముఠా కక్షలకు

కేంద్రంగా ఉంది. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వ రికార్డులు నల్లరేగడి నేలలు ఉన్న ఈ నదీలోయప్రాంతాన్ని గ్రామీణ ముఠాకక్షలకు పేరుపడిన ప్రాంతంగా పేర్కొన్నాయి. 1978 తర్వాత రాజశేఖర రెడ్డి, రమణా రెడ్డి, శివారెడ్డి రాజకీయ దౌర్జన్యానికి లోయప్రాంతంలోని ఈ మూడు ప్రాంతాలే కేంద్రం అయ్యాయి. పీఠభూమి నుండి నదీలోయలోకి పాలెగాళ్ళ సంస్కృతి ఎంతగా స్థలభ్రంశం చెందిందంటే, ఈ రోజు ముఠాకక్షలకు మూల కారణం ఏమిటని కడప జిల్లాలో ఎవరినైనా అడిగితే 'పెన్నానది నీళ్ళే అటువంటివి' అని, 'నల్లరేగడి నేలలున్నచోటే ముఠా కక్షలు ఎక్కువగా ఉంటాయి' అని సమాధానం చెబుతారు.

అయినప్పటికి ఈ గ్రామీణ ముఠాకక్షలను ఆసరాగా చేసుకొని ఎదిగిన ఆధునిక ఫాక్షన్ రాజకీయాలకూ పాతకాలపు పాలెగాళ్ళ వ్యవస్థకూ పోలికలు చాలా ఉన్నాయి. అప్పటి ప్రతి పాలెగాడు కొన్ని గ్రామాలపైన ఎదురులేని ఆధిపత్యం చెలాయించేవాడు. సాయుధసైన్యాన్ని పోషించి 'శాంతి భద్రతలు' నెలకొల్పేవాడు. ప్రజలనుండి తన ఇష్టం వచ్చినంత పన్ను వసూలు చేసేవాడు. తనకు తోచిన న్యాయం చెప్పేవాడు, అమలు చేసేవాడు. యుద్ధం వచ్చినప్పుడు తన సాయుధ బలగాన్ని రాజాగారికి అండగా పంపించేవాడు.

ఈనాటి కడప జిల్లా రాజకీయ నాయకులకు ఈ లక్షణాలు చాలా ఉన్నాయి. ఇప్పటి రాజ్యంలో పాత పద్ధతిలో ఆధిపత్యం సాగించడం అన్ని విషయాలలోను సాధ్యంకాదు. కాని వీళ్ళు మౌలికంగా అవే లక్షణాలు కల ఆధిపత్యం చెలాయిస్తున్నారు. బాంబులు, తుపాకులు పెట్టుకొని తమ స్వంత సాయుధ బలగాలను పోషిస్తున్నారు. తమ స్వంత కోర్టులలో తమ స్వంత చట్టాలు అమలుచేస్తున్నారు. వాటి అమలుకు అడ్డం వచ్చినవారిపైన దౌర్జన్యం చేస్తున్నారు. ప్రజలందరి దగ్గర శిస్తు వసూలు చేయలేకపోవచ్చుగాని, తమ ఎన్నికల ఖర్చులకోసం, ఫాక్షన్ ఖర్చుల కోసం, స్వంత ఆస్తులకోసం వ్యాపారస్తుల నుండి సారాయి – సివిల్ కాంట్రాక్టర్లదాకా అందరి దగ్గర బలవంతపు మామూళ్ళు, కమీషన్లు వసూలు చేసుకొంటున్నారు. వీధి రౌడీలు వసూలుచేస్తే దాన్ని రౌడీ మామూళ్ళు అంటారు. ఈ వసూలుకు అధికార శిస్తు వసూలుకు ఉన్న చట్టబద్ధత లేదు కానీ, దానికంటే దీన్ని తప్పించుకోవడం కష్టం. కేవలం వడ్డీలతో జుర్మానాలతోకాదు, ప్రాణంతోనే జవాబు చెప్పవలసి ఉంటుంది. పాతకాలపు పాలెగాడికి తన ప్రాంతంలో ఎంతటి ఎదురులేని రాజకీయ ఆధిపత్యం ఉండిందో వీళ్ళకు తమ ప్రాంతంలో (ఒక తాలూకా కావచ్చు, మండలం కావచ్చు, కొన్ని గ్రామాలు కావచ్చు) అంతటి ఎదురులేని ఆధిపత్యం ఉంది. రెండింటి మూలము ఒక్కటే. సాయుధ పెత్తందారీ దౌర్జన్యం.

సామాజిక రాజకీయ వ్యవస్థద్వారా సంక్రమించిన ఈ పోలికల రీత్యా ఈ రోజు రాయిలసీమలో సాయుధపెత్తనం చెలాయిస్తున్న దౌర్జన్యకారులను అలనాటి పాలెగాళ్ళకు చారిత్రక వారసులుగా భావించవచ్చు. అందువల్ల వీళ్ళ గురించి తెలుసుకొనేముందు పాత

పాలెగాళ్ళ వ్యవస్థ గురించి తెలుసుకోవడం ఉచితంగా ఉంటుంది. తెలుగులో పాలెగాడు, తమిళంలో పాలయక్కారన్ అని పిలిచిన ఈ వ్యవస్థ విజయనగర రాజుల కాలంనుండి చరిత్రలో కనబడుతుంది. విజయనగర రాజ్య నిర్మాణంలోని ప్రధాన వ్యవస్థ నాయంకర (లేక అమరనాయంకర) వ్యవస్థ. పాలెగాళ్ళ వ్యవస్థ దీనికి అనుబంధమైనది. విజయనగర రాజ్యంలో సైనిక వికేంద్రీకరణ ఈ నాయంకర వ్యవస్థ ద్వారా జరిగింది. ఈ వ్యవస్థలో 'నాయకులు' అనే సైనిక ప్రభువులు ఉండేవారు. ఒక్కొక్క నాయకునికి రాజ్యంలో ఒక ప్రాంతంలో శిస్తు వసూలుచేసి, కేంద్ర అధికారానికి లోబడి పరిపాలన నిర్వహించే అధికారం ఉండేది. శిస్తులో కొంత భాగాన్ని తాము ఉంచుకొని మిగిలినది రాజుకు చెల్లించేవారు. ఆ భూభాగం అతని జాగీరు, లేక 'అమరం'. ఈ నాయకులు తమ ప్రాంతంలో పరిపాలన నిర్వహించడంతోపాటు కొంతసైన్యాన్ని పోషించేవారు. రాజు యుద్ధానికి పోయినప్పుడు ప్రతి యొక్క నాయకుడు తన సైన్యాన్ని రాజుకు అండగా పంపించేవాడు. ఈ నాయంకర వ్యవస్థను సైనిక జాగీరు వ్యవస్థగా (మిలిటరీ టెన్యూర్) పరిగణించవచ్చును. ఢిల్లీ సుల్తానుల రాజ్యంలోని 'ఇక్తా వ్యవస్థ ఇటువంటిదే. ఇది విజయనగర రాజులు ఉద్దేశ్య పూర్వకంగా సృష్టించిన వ్యవస్థకాదు. విజయనగర రాజ్యానికి పూర్వం ఆంధ్ర ప్రాంతాన్ని ఏలిన చిన్నరాజులు తమనుతాము నాయకులు అని పిలుచుకున్నారు. ప్రోలయ నాయకుడు, కాపయ నాయకుడు మొదలయిన పేర్లు చరిత్రకు పరిచితమయినవే. ఈ నాయకులను జయించి విస్తరించిన విజయనగర రాజ్యం వారి స్వతంత్రాన్ని లోబరుచుకున్నప్పటికి వారి ఆధిపత్యాన్ని పూర్తిగా తొలగించకుండా నాయంకర వ్యవస్థద్వారా వారి అధికారాన్ని తన అవసరాలకు తగిన రీతిలో కొనసాగించింది.

ఈ నాయకులకంటే ఇంకా చిన్నస్థాయికి చెందినవాళ్ళు పాలెగాళ్ళు. మొదట్లో వీళ్ళను కేవలం సరిహద్దు ప్రాంతాలలోను, అడవి ప్రాంతాలలోను శాంతిభద్రతల నిర్వహణకోసం ఉద్దేశించినట్లున్నారు. ఈ పోలీసు డ్యూటీకోసం వీళ్ళు ఒక సాయుధ బలగాన్ని పోషించేవారు. దాని పోషణ నిమిత్తం వీళ్ళకు కొన్ని గ్రామాలు ఇవ్వబడేవి. ఆ గ్రామాలలో శిస్తు వసూలుచేసి అందులో కొంత భాగాన్ని రాజుకు చెల్లించి మిగిలినది తమ ఖర్చులకోసం ఉంచుకొనేవారు. వీళ్ళకు శిస్తువసూలు చేసే అధికారంతోపాటు ఆ గ్రామాలపైన సంపూర్ణ పరిపాలనాధికారం ఉండేది. నియమబద్ధంగా శిస్తు వసూలు చేయడంతో ఆగిపోకుండా వీళ్ళు ప్రజల ఆస్తిపాస్తులను లూటీ చేసేవారు. కాలక్రమంలో ఈ అధికారిక పోలీసు డ్యూటీతో సంబంధం లేకుండా కొన్ని గ్రామాలను తమ సాయుధ బల ప్రయోగంతో లోబరచుకొని హింసాత్మకంగా పరిపాలించిన పాలెగాళ్ళు విజయనగర రాజ్యవ్యాప్తంగా నెలకొన్నట్టున్నారు. 1564లో దక్కను సుల్తానుల చేతిలో విజయనగర రాజులు ఓడిపోయిన తర్వాత ఈ పాలెగాళ్ళ పెత్తనం పెరిగింది. ఎవరికి వారు స్వతంత్రం ప్రకటించుకొని చిన్నచిన్న సంస్థానాలను నెలకొల్పారు. ఆ తర్వాత రాయలసీమను అదుపులోకి తీసుకోవాలని ప్రయత్నించిన దక్కను సుల్తానులు, స్థానిక నవాబులు, మరాఠాలు, మైసూరు సుల్తానులు, బ్రిటిషువాళ్ళు, ఈ పాలెగాళ్ళను అణచడం

మీద ప్రధానంగా దృష్టి కేంద్రీకరించవలసి వచ్చింది. ఆ పని విజయవంతంగా చేసిన వాడిగా బ్రిటిషురాజా నియమించిన మొదటి కలెక్టర్ థామస్ మన్రో పేరు తెచ్చుకొన్నాడు.

క్రీ.శ. 1792 లో మైసూరు సుల్తానులనుండి రాయలసీమను చేజిక్కించుకొన్న హైదరాబాద్ నిజామ్ క్రీ.శ. 1800లో దానిని బ్రిటీషువారికి దత్తత చేశాడు. రాయలసీమ దత్త మండలమై బ్రిటిషు ఇండియాలో భాగమైంది. పైన చెప్పినట్టు దత్త మండలం బ్రిటిషువాళ్ళ చేతిలోకి పోయేనాటికి ఆ ప్రాంతంలో ఉన్న 80 మంది పాలెగాళ్ళలో 37 మంది మదనపల్లి, వాయల్పాడు, రాయచోటి, కదిరి తాలూకాలలో ఉన్నారు. 1564లో తళ్లికోట యుద్ధంలో గెలిచిన తర్వాత విజయనగర రాజ్యాన్ని పూర్తిగా ఆక్రమించుకొన్న దక్కను సుల్తానుల సైన్యాలు కడప నుండి తిరుపతి మీదుగా తమిళ దేశానికి వెళ్ళాయని, దారిలో ఎదురైన పాలెగాళ్ళను వారు అణచివేసారని, ఆ దారికి పడమట ఉన్న కర్నూలు జిల్లాలోను, దక్షిణాన ఎత్తైన పీఠభూమిపైన ఉన్న ఈ నాలుగు తాలూకాలలోను క్రీ.శ. 1800 దాకా పాలెగాళ్ళు నిలదొక్కుకోగలిగారని బ్రిటిషు అధికారులు విశ్లేషించారు.

పాలెగాళ్ళ వ్యవస్థను తర్వాతి కాలంలో బ్రిటిషు ప్రభుత్వం ప్రచురించిన కడప మాన్యువల్‌లో ఈ విధంగా వర్ణించారు. ''చిన్న చిన్న పాలెగాళ్ళంతా ఏదో ఒక పెద్ద పాలెగాడిని ఆశ్రయించి ఉంటారు. అతను రాజుకు లోబడి ఉన్నట్టు వీళ్ళు అతనికి లోబడి ఉంటారు. ఎంత చిన్న పాలెగాడికైనా ఒక రాజాస్థానం ఉండడం విచిత్రమైన విషయం. పెద్ద రాజుల ఆస్థానాలలో ఉన్నట్టు ఇక్కడగూడ అవే పేర్లతో అధికారులుంటారు. ఒక స్థిర సైన్యం కూడా ఉంటుంది. ఈ సైనికులకు జీతాలు ఉండవు. యుద్ధాలప్పుడు ప్రజలపైనపడి లూటీచేసి సంపాదించుకొనేదే వాళ్ళ ఆదాయం. శాంతి సమయాలలో కూడా పొరుగు గ్రామాలను దోచుకొని సంపద తెచ్చుకొంటారు. పాలెగాళ్ళ జాగీర్లు చిన్న చిన్నవి కాబట్టి దాదాపు ప్రతీగ్రామం ఒక పొరుగు పాలెగాడి సైనికుల దౌర్జన్యాలకు గురి అవుతూ ఉంటుంది. వాటినుండి తమనుతాము రక్షించుకోవడానికి గ్రామ ప్రజలంతా అప్రమత్తంగా ఉంటారు. ప్రతీ పాత గ్రామంలోను రాతితో కట్టిన బురుజు ఒకటి ఇప్పటికీ కనిపిస్తుంది. కొంచెం సంపన్న గ్రామం అయితే కోటగోడలు కూడా కనిపిస్తాయి. పాలెగాడి దౌర్జన్యాలనుండి తననుతాను రక్షించుకొనే సామర్థ్యం ఒక గ్రామం సంపాదించుకున్నట్లయితే, త్వరలోనే అది ఆత్మరక్షణ వదిలిపెట్టి దాడులు చేయనారంభిస్తుంది. ఆ ఊరిపెద్ద దీనికి నాయకుడౌతాడు. అప్పటివరకు తమ ఆస్తులను కాపాడుకోవడానికి గ్రామస్తులు నియమించుకున్న వ్యక్తులు గ్రామ పెద్ద అజమాయిషీలోకి పోతారు. త్వరలో ఆ గ్రామ పెద్ద తానే ఒక పాలెగాడయి కూర్చుంటాడు. కొన్ని ఏండ్లు ఇలా గడిస్తే, తాను ప్రతిఘటించిన పాలెగాళ్ళ లక్షణాలన్నీ సంతరించుకొని, అతను కూడా ఒక రాజాస్థానాన్ని నెలకొల్పి, అధికారులను నియమించి ప్రజలను దోచుకొని బ్రతకడం మొదలుపెడ్తాడు.

మన్రో ఈ పాలెగాళ్లందర్నీ అణచివేసాడు. కొందరు బ్రిటిషు సైన్యంతో యుద్ధంచేసే క్రమంలో చనిపోయినారు. కొందరిని మన్రో పట్టుకొని ఉరితీసినాడు. మిగిలిన వాళ్ళను లోబర్చుకొని ఆయుధాలూ అధికారం తొలగించి పెన్షన్ ఇచ్చాడు. అయితే ఆ తర్వాత కూడా పాలెగాళ్ళు తిరగుబాటు చేస్తూ వచ్చారు. వీటిలో ప్రఖ్యాతిగాంచినది 1846లో ఉయ్యాలవాడ నర్సింహా రెడ్డి లేవదీసిన తిరుగుబాటు. బ్రిటిషు రికార్డుల ప్రకారము ఆ తిరుగుబాటు కథ ఇది.

ఉయ్యాలవాడ, నొస్సం అనే ఊర్లు కర్నూలు జిల్లా కోవెలకుంట్ల తాలూకాలో కడప జిల్లా సరిహద్దుకు సమీపంలో ఉన్నాయి. ఈ రెండు ఊర్లలో ఇద్దరు పాలెగాళ్ళు ఉండేవారు. మన్రో 1801లోనే ఇద్దరిని లోబరుచుకొని పెన్షన్‌లు ఇచ్చాడు. నొస్సం పాలెగాడి చెల్లెల్నిద్దర్నీ ఉయ్యాలవాడ పాలెగాడు పెండ్లి చేసుకున్నాడు. అందువల్ల నొస్సం పాలెగాడు చనిపోయిన తర్వాత అతని పెన్షన్‌లో కొంతభాగాన్ని ఉయ్యాలవాడ పాలెగాడు, అతని సంతతి అనుభవించసాగారు. అయితే నొస్సం పాలెగాడి భార్య కూడా చనిపోయిన తర్వాత ఆ పెన్షన్ అంతరించిపోయింది. ఉయ్యాలవాడ పాలెగాడి పెన్షన్ తక్కువకావడం వల్ల ఆ కుటుంబ ఆర్థికస్థితి దిగజారింది. అతను చనిపోయిన తర్వాత అతని ముగ్గురు కొడుకులు దానిని పంచుకోవలసివచ్చింది. ఆ ముగ్గురిలో చిన్నవాడయిన నర్సింహా రెడ్డి తన వాటా తీసుకొని అన్నలనుండి వేరుపడిపోయి బ్రిటిషు ప్రభుత్వంపైన 1846లో తిరుగుబాటు లేవదీశాడు. అతనిని పట్టుకోవడానికి కోవెలకుంట్ల తహసిల్‌దారు పంపించిన మనుషులు అతనివైపే చేరిపోగా 300 మంది అనుచరులతో అతను కోవెలకుంట్లపై దాడిచేసి ట్రెజరీని దోచుకున్నాడు. ఆ తర్వాత అనుచరుల సంఖ్య 5000కు పెరిగింది. ఈ సైన్యంతో అతడు నల్లమల కొండలు దాటి నేటి ప్రకాశం జిల్లాలో ఉన్న కంభంపైన దాడి చేయడానికి బయలుదేరాడు. (కంభం అప్పట్లో కడప జిల్లాలో ఉండింది. 1858లో కొత్తగా ఏర్పడిన కర్నూలు జిల్లాలో భాగమై, ఇప్పుడు ప్రకాశం జిల్లాలో ఉంది). అయితే గిద్దలూరు సమీపంలోనే బ్రిటిషు సేనలు అతనికి ఎదురయ్యాయి. ఇద్దరి మధ్య జరిగిన పోరాటంలో నర్సింహా రెడ్డి మనుషులు 200 మంది చనిపోగా, అవతలివైపు కంభం తహసీలుదారు చనిపోయాడు. ఆ తర్వాత కొన్నాళ్ళు కనుమరుగయిపోయిన నర్సింహా రెడ్డి తిరిగి కోవెలకుంట్ల ప్రాంతంలో జనాన్ని ప్రోగుచేసి కడప మీద దాడిచేయడానికి బయలుదేరాడు. ఈ సంగతి గ్రహించిన బ్రిటిషు ప్రభుత్వం తన సేనలను అతనికి ఎదురు పంపించి దాడి చేసింది. నర్సింహా రెడ్డి అనుచరులు 50 మంది చనిపోగా, నర్సింహా రెడ్డి సజీవంగా దొరికాడు. అతనిని బ్రిటిషు ప్రభుత్వం కోవెలకుంట్లలో ఉరి తీసింది.

పాలెగాళ్ళను మన్రో లోబరచుకోవడంతో బ్రిటిషు ప్రభుత్వం తననుతాను తొందరపడి అభినందించుకుంది. ''అరాచక దోపిడీదారులుగా ఉన్న ఈ ప్రజలు ఈ రోజు అత్యంతనాగరీకులుగా తయారైనారు. చట్టాలను, మేజిస్ట్రేట్ ఆదేశాలను గౌరవిస్తున్నారు. శిస్తు

ప్రశాంతంగా వసూలు అవుతూఉంది. అందరూ చాలా తృప్తిగా ఉన్నారు.'' అని మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం 1807లో బ్రిటన్‌కు తిరిగి వెళ్ళిపోతున్న మన్రోకు వీడుకోలు తెల్పుతూ అన్నది.

కాని పాలెగాళ్ళు పోయినా పాలెగాళ్ళ సంస్కృతి కడపను వదిలిపెట్టలేదు. బలప్రయోగంతో ఊళ్ళు ఏలడానికి బ్రిటిషువారి 'లా అండ్ ఆర్డర్' అడ్డం వచ్చిందిగాని గ్రామస్థాయిలో ముఖ్యులు పెత్తనం కోసం ఒకరితో ఒకరు పోటీపడి ముఠాలు కట్టి హత్యలకూ, దౌర్జన్యాలకూ పాల్పడి ఆధిపత్యం నెలకొల్పే అలవాటు కొనసాగింది. కొండ ప్రాంతాల కంటే దిగువన ఉన్న ఉత్తర (లేక వాయువ్య) తాలూకాలలో ఈ గ్రామకక్షలు ఎక్కువగా ఉన్నాయని 19వ శతాబ్దం చివరిభాగంలో ప్రకటించిన బ్రిటీషు నివేదికలు తెలుపుతాయని పైన చూసాము. జమ్మలమడుగు తాలూకా ఈ విషయంలో అన్నిటికంటే ఎక్కువగా చెడ్డపేరు పొందింది. జమ్మలమడుగును ఆనుకొని ఉన్న కర్నూలు జిల్లాలోని కోవెలకుంట్ల తాలూకా కూడా జమ్మలమడుగుతో సమానంగా ముఠా కక్షలకు పేరు పొందింది. ఈ రెండు తాలూకాలు పెన్నానదికి ఉపనది అయిన కుందూ (కుందేరు) పరీవాహక ప్రాంతంలో ఉన్నాయి. అందువలన 'కుందేరు నీళ్ళలోనే దౌర్జన్యం ఉంది' అని కొంతమంది నిష్కారణంగా ఆ నదిమీద తప్పు మోపుతుంటారు.

ప్రతిగ్రామంలోనూ గ్రామ ముఖ్యుడయిన 'రెడ్డి' ఒకడు ఉంటాడు. (ఈ హోదాను కోస్తా జిల్లాలలో మునసబు అనీ తెలంగాణలో పటేల్ అనీ అంటారు). ఇది రెవెన్యూ యంత్రాంగానికి చెందిన పదవి. కులంరీత్యా ఈ రెడ్లు కడప జిల్లాలో అధికభాగం రెడ్డికులస్తులే అయినప్పటికీ, అందరూ రెడ్డి కులస్తులే కానవసరంలేదు. ఏ కులం వారయినా ఆ పదవి 'రెడ్డితన' మే. పాలనాయంత్రాంగం నుండి అధికారికంగా పెత్తనం సంక్రమించిన ఈ రెడ్డికి వ్యతిరేకంగా పెత్తనంలో పోటీపడే గ్రామస్తుడు ఇంకొకడు తయారయితే కక్షలకు పునాది ఏర్పడుతుంది. ఆతను కూడ తరచుగా రెడ్డి కులస్తుడే కావచ్చు. ఇద్దరూ సాధారణంగా మంచి ఆస్తిపరులే అయివుంటారుగానీ, కక్షలకు ప్రధానకారణం ఆస్తితగాదాలు కావని పరిశీలకులు అందరూ అంటారు. పెత్తనం, పరువు, ప్రతిష్ఠ ముఖ్యకారణాలు. గ్రామ సమస్యలలో పెద్దరికం, గ్రామవ్యవహారాలలో ప్రాముఖ్యం, ప్రభుత్వంవద్ద ప్రాతినిధ్యం, కుటుంబప్రతిష్ఠ- ఇవేవయినా ఘర్షణకూ, పరస్పర దౌర్జన్యాలకూ వంశపారంపర్యమయిన కక్షలకూ కారణం కాగలవు. సమాజంలో మగవాడి ప్రతిష్ఠకు వాడి ఇంటిలోని స్త్రీల అణకువ ఒక ముఖ్య ప్రాతిపదిక కాబట్టి చాలా సందర్భాలలో కక్షలకు లైంగిక సంబంధాలు కారణంగా ఉంటాయి. అయితే అన్ని కారణాల కంటే వీటిగురించి వివరాలు తెలుసుకోవడం కష్టం.

ఒకసారి మొదలయిన కక్ష సులభంగా ఆగదు. సందర్భం వచ్చినప్పుడంతా మళ్లీ మళ్లీ రగులుకుంటూనే ఉంటుంది. హత్యకు సమాధానం హత్యే. ఇంటికి ఇల్లు కూల్చవలసిందే,

పొలానికి పొలం ధ్వంసం కావలసిందే, ప్రతీదాడికీ ప్రతిదాడి జరగవలసిందే. ఒక తరానికి చెందిన వాళ్ళు కొన్నాళ్లకు విసిగిపోయి రాజీపడినా రెండవతరంలో కక్షలు మళ్లీ రాజుకోవచ్చు.

ఘర్షణలకోసం ఇరుపక్షాలూ గ్రామంలో గుంపును సమీకరించుకుంటారు. ఈ రెడ్డి మనుషులు, ఆ రెడ్డి మనుషులు అంటూ గ్రామంలో రెండు ముఠాలు ఏర్పడతాయి. ఈ విధంగా ఫాక్షనిస్టుల వెనుక గుంపుకంటే వారిలో అన్ని కులాలవారూ అన్ని వర్గాలవారూ ఉంటారు. బలవంతుడి గుంపులో చేరడంవల్ల తమకు వచ్చే ప్రయోజనాల వల్ల జనం వీరివెంట చేరుతారు. లేదా, వాళ్లతో తమకు ఉండే ఆర్థిక సామాజిక సంబంధాల దృష్ట్యా వాళ్ల గుంపులో చేరడం కొందరికి అనివార్యం కావచ్చు. ఈ విధంగా ముఠాలు తయారయిన తర్వాత రెండు ముఠాలలోని మనుషుల మధ్య ఉత్పన్న మయ్యే కక్షలు కూడా ఫాక్షన్‌కు తోడవుతాయి. ఫాక్షన్‌ను పెంచుతాయి.

ఫాక్షన్‌ల జోలికి పోకుండా తమపాటికి తాము బ్రతికే జనం గ్రామంలో ఎప్పుడూ ఉంటారు. అయితే వాళ్ల బ్రతుకులపైన ముఠాకక్షల ప్రభావం చాలా ఉంటుంది. ముఠా కక్షలున్న గ్రామము ఒక భయవాతావరణంలో ఉంటుంది. ఇరుపక్షాలకూ చెడుకాకుండా బ్రతకడం ఉత్తమం అని ఇతర జనం అనుకుంటారు. లేదా ఒకరితో ఘర్షణ పెట్టుకుంటే రెండవ పక్షాన్ని ఆశ్రయించవలసి ఉంటుంది. మామూలు గ్రామాలలో కూడా పెత్తందార్లతో గొడవ పెట్టుకోకుండా బ్రతకడమే మేలన్న అప్రజాస్వామిక వాతావరణం ఎప్పుడూ ఉంటుంది. ఆ పెత్తందార్లు పెత్తనంకోసం ముఠాలుకట్టి దౌర్జన్యాలకు పాల్పడే అలవాటున్న వాళ్లయితే ఈ భయం ద్విగుణీకృతమవుతుంది. ఇది గ్రామంలో ప్రజాస్వామిక వాతావరణాన్ని ధ్వంసం చేస్తుంది. న్యాయంకోసం ధైర్యంగా నిలబడగలగడం, సామాజిక రాజకీయరంగాలలో ఎవరికివారు తమ అభిప్రాయాలను అనుసరించి స్వేచ్ఛగా వ్యవహరించగలగడం, ఒకరికి భయపడకుండా సంవాదం పెట్టుకోగలగడం, ప్రజాస్వామ్యానికి అత్యవసరమయిన లక్షణాలు. సాంఘిక ఆర్థిక అసమానతలు, ఆధిపత్యం ఉన్న ఏ సమాజంలోనయినా ప్రజాస్వామిక స్వేచ్ఛకు పరిమితులుంటాయి. అయితే ఆ ఆధిపత్యం హింసాత్మక ముఠాసంస్కృతి రూపం తీసుకున్నచోట ప్రజాస్వామ్యం మరింత కరువవుతుంది. ప్రజల ఆకాంక్షలు అవసరాలూ హక్కులూ మూగబోవాలి. లేకపోతే అవి కూడ ముఠాకొట్లాటలలో తమ అస్తిత్వాన్ని వెతుక్కోవాలి. ప్రజలు తమ ప్రయోజనాలను ముఠా దౌర్జన్యాల ద్వారా సాధించుకోవాలి. ఇవి రెండూ ప్రజాస్వామ్య సంస్కృతికి నష్టకరమే. రెండూ నిత్యం జరుగుతుంటాయి. ఇందులో రెండవ మార్గం ఎంచుకోవడం వల్ల తాత్కాలికంగా ప్రయోజనాలు ఒనగూడుతుంటాయి. అందువల్ల అవి ప్రజాస్వామ్య జీవనానికి నష్టకరం అని గుర్తించడం సహితం కష్టం కావచ్చు.

# కొన్ని కథాచిత్రాలు

పేరుపొందిన కొన్ని ఫాక్షన్‌గ్రామాల ముఖచిత్రాలు చూస్తే ముఠాకక్షలు ప్రబలంగా ఉన్న గ్రామాలలో సామాజిక వాతావరణం ఏవిధంగా ఉంటుందో అర్థమవుతుంది. ఈతరం రాజకీయ నాయకులు ముఠా కక్షలను ఆధారం చేసుకొని ఏవిధంగా ఎదగ గలిగారో గ్రహించడానికి ఇది అవసరం.

## టి. కోడూరు :

జమ్మలమడుగు నియోజకవర్గంలోని టి.కోడూరు పాత ఫాక్షన్ గ్రామం. ఫాక్షన్లు మీ ఊరిలో ఎప్పటి నుండి ఉన్నాయంటే '100 సంవత్సరాల నుండి' అని ఒక ప్రస్తుత ముఠానాయకుడు అంటాడు. స్వాతంత్ర్యానికి పూర్వమే ఆ ఊరిలో ఆరుగురికి ద్వీపాంతరవాస శిక్ష పడింది.

టి.కోడూరు ఘర్షణలలో జరిగిన కొట్లాటల గురించి ఆ ఊరివాళ్ళు వర్ణించిన ఈక్రింది చిత్రం దాదాపుగా అన్ని ఫాక్షన్ గ్రామాలకూ వర్తిస్తుంది. గ్రామాలకు బాంబులు రాకముందు గ్రామంలోని ముఠాల మధ్య గొడవలు జరిగితే ఇరుపక్షాలూ తమ ఇళ్లెక్కి ఎదుటివారిపైన రాళ్ల వర్షం కురిపించేవారు. మిద్దె మీద రాళ్లు పోగుచేసుకుంటున్నారంటే కొట్లాటకు సిద్ధమవుతున్నారని అర్థం. ఒకరు మొదలు పెట్టగానే ఎదుటి పక్షం కూడ మిద్దెలెక్కి రాళ్లు వేయడం ప్రారంభిస్తారు. ఈరాళ్ల వర్షం కురిసినంతసేపు గ్రామంలోని మిగిలిన జనం ఇండ్లలో దూరి తలుపులు మూసుకుంటారు. ఘర్షణ ముదిరితే ఇరుపక్షాలూ గుంపులుగా రోడ్లలోకి వచ్చి గొడ్డళ్లతో, వేట కొడవళ్ళతో, బరిసెలతో నరుక్కుంటారు, తలకాయలు పగలగొట్టుకుంటారు. 1950 తరువాత ముఠాకొట్లాటలలోకి బాంబులు ప్రవేశించడంతో, రాళ్ల బదులు బాంబులు వేసుకోసాగారు. బిందెలలో, బక్కెట్లలో బాంబులు ఇంటి మిద్దె మీదికి తీసుకుపోయి ఎదుటి పక్షం ఇండ్లమీదికి, వాడలలోకి వేస్తారు. తుపాకులతో వారి ఇండ్ల పైకి కాల్పులు జరుపుతారు. కొన్ని గంటలసేపు గ్రామం మొత్తం బాంబుల మోతతో దద్దరిల్లుతుంది.

ఇటువంటి బాంబు దాడుల ఘటనలు టి.కోడూరులో ఇప్పటికి ఎన్ని జరిగి ఉంటాయని ఒక ప్రస్తుత ముఠానాయకుడిని అడిగితే, 'మీకుబుద్ధి పుట్టినన్ని రాసుకోండి' అని జవాబు ఇస్తాడు. తుపాకి లైసెన్సులు ఈ ఊరిలో 8 ఉన్నాయి. (ప్రస్తుతం రాయలసీమలోని తుపాకీ లైసెన్స్‌లన్నీ సస్పెండ్ అయి ఉన్నాయి.) నాటు తుపాకులు ఎన్ని ఉన్నాయో చెప్పేవారు లేరు.

ప్రస్తుతం గ్రామంలో కక్షలున్నది ఎర్ర బాలిరెడ్డికి, తిరుమల రెడ్డికి. వీరి కక్షలు 1958 గ్రామపంచాయితీ ఎన్నికలతో ప్రారంభం అయ్యాయి. అంతకు ముందు ఈ ఊరిలో ఓబుల్‌రెడ్డికి, మహానందిగారి నారాయణరెడ్డికి కక్ష ఉండింది. (అంత కంటె ముందు ఎవరెవరికి ఉండిందో తెలియదు.) ఎర్ర బాలిరెడ్డి చెల్లెలు ఓబుల్ రెడ్డి ఇంటికి కోడలయింది. ఇటు తిరుమల రెడ్డి నారాయణ రెడ్డికి అల్లుడయ్యాడు. ఈ బంధుత్వాలతో పాటు రాజకీయాలు తోడయి 1958 తరువాత టి.కోడూరు ఫాక్షన్ ఎర్ర బాలిరెడ్డి వెర్సస్ తిరుమల రెడ్డి అయింది. మొదటి పంచాయితీ ఎన్నికలో ఎర్రబాలిరెడ్డి సర్పంచ్‌గా గెలిచాడు. వీరిద్దరికీ సారాయి కాంట్రాక్టులు, సివిల్ కాంట్రాక్టులే కాక వ్యవసాయం కూడ సమృద్ధిగా ఉంది. వాళ్ల చెప్పే లెక్కలు ప్రకారమే ఎర్రబాలిరెడ్డికి 70 ఎకరాలు, తిరుమల రెడ్డికి 130 ఎకరాలు ఉన్నాయి.

రాజకీయ ఘర్షణతో పాటు సారాయి వ్యాపార ఘర్షణ కూడ ఈగ్రామంలో ముఠాకక్షలు పెరగడానికీ కొనసాగడానికీ తోడ్పడింది. ఇది కేవలం ఈ ఒక్క గ్రామం ప్రత్యేకత కాదు. రాయలసీమలో ముఠాకక్షలున్న అన్ని ప్రాంతాలలోనూ ఫాక్షన్ల ఎదుగుదలలో సారాయి వ్యాపారానికి ఒక ముఖ్యపాత్ర ఉంది. మన రాష్ట్రంలో ప్రభుత్వాలు సారాయి వ్యాపారాన్ని బడ్జెట్ వనరుల సేకరణకు ఒక ముఖ్య సాధనంగా వాడుకోవడం మొదలు పెట్టింది 1980 తరువాత. దానితో పెట్టుబడులు పెద్దఎత్తున సారాయి వ్యాపారంలోకి ప్రవేశించాయి. కాంట్రాక్టర్లు అసాధారణమయిన లాభాలు గడించారు. డబ్బున్న చోట రాజకీయం కూడ వచ్చి చేరుతుంది కాబట్టి సారా వ్యాపారస్తులు రాజకీయవేత్తలయ్యారు, రాజకీయ నాయకులు సారా కాంట్రాక్టర్లయ్యారు. 'సారాయి అమ్ముకునేవాడు' అనేది సాంఘికంగా అగౌరవ పూర్వకమైన హోదాగా ఉండింది. -ఇప్పుడు అసెంబ్లీ నిండా సారాయి అమ్ముకునే వాళ్లు వచ్చి చేరారు. అయితే వీళ్ల రోడ్డు ప్రక్కన ప్రభుత్వ సారాయి దుకాణం పెట్టుకున్న మామూలు మద్యం విక్రేతలుకారు. కోట్ల పెట్టుబడి పెట్టి కోట్లు సంపాదించే పెద్ద వ్యాపారులు. ఇది రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలోనూ జరిగిన పరిణామం కాగా, రాయలసీమ జిల్లాలలో ఇది అదనంగా ముఠా కక్షలతో ముడిపడింది. గ్రామం మీద పెత్తనంలాగే సారాయి వ్యాపారం మీద పెత్తనం కూడ ఫాక్షనిస్టుల పాలయింది. దౌర్జన్యం చేసి సారాకాంట్రాక్టు పొందినవాడు లక్షలు, కోట్లు సంపాదించుకోవచ్చును. బాంబులతో భయపెట్టి ఇతరులను పోటీకి రాకుండాచేసి కాంట్రాక్టు చవకగా తీసుకొని ఆపైన ప్రభుత్వ సారాయికి శిస్తు చెల్లించనవసరంలేని సొంత తయారీని కూడ జోడించి విక్రయిస్తే మామూలు లాభాల కంటె ఎన్నో రెట్లు ఎక్కువ సంపాదించవచ్చు. ఈ ఆశ ముఠా కక్షలను ప్రోత్సహించింది, పెంచింది. ముఠాకక్షలకు కావలసిన వనరులు కూడ సారాయి వ్యాపారం నుండే రాసాగాయి. ముఠానాయకుడు సారాకాంట్రాక్టు తీసుకుంటే

అతని అనుచరులు ఆ వ్యాపారాన్ని నిర్వహించి, రక్షించి, ఆదాయం పొందుతారు. దాదాపుగా ఈ దశలోనే రాళ్ళు, గొడ్డళ్లు, వేటకొడవళ్ళకు తోడు బాంబులు కూడ ముఠాల ఆయుధ సంపత్తిలో భాగం అయ్యాయి. దానితో బీభత్స వాతావరణం పెరిగింది. అంతకు ముందు ఒక ఫాక్షనిస్టు వెనుక గుంపు కట్టేవాళ్లు సామాన్య రైతులు, లేక ఇతర వృత్తులు చేసుకొని బ్రతికే జనం. కొద్దిమంది ఫాక్షనిస్టులు మాత్రమే దౌర్జన్యాలకోసం ప్రత్యేకంగా జనాన్ని పోషించేవారు. అయితే సారాయి వ్యాపార లాభాలు పెరిగిన తరువాత సారాయి అమ్ముకోవడం, రౌడీయిజం చేయడం తప్పవేరే వృత్తి ఏదీ లేనివారి సంఖ్య ముఠాలలో పెరిగింది. ఇది గ్రామీణ ఫాక్షన్ల కంటె ప్రొద్దుటూరు వంటి పట్టణ ఫాక్షన్లలో ఎక్కువ జరిగినప్పటికీ మొత్తంమీద సారాయి వ్యాపారం ఈ మార్పు తీసుకొచ్చింది. దీనితో ముఠాకక్షలున్న చోట క్రిమినల్ వాతావరణం బాగా పెరిగింది.

టి. కోడూరులో (చాలా గ్రామాలలాగే) సారాయి వ్యాపారం విషయంలో ఒక అంగీకారం కుదిరింది. కాంట్రాక్టు కోసం గ్రామస్తులు పోటీపడి ప్రభుత్వ ఖజానాకు సేవచేసే బదులు ఎవరో ఒకరే పాడుకొని చవగ్గా తెచ్చుకుంటారు. వారు గ్రామ అవసరాల కోసం ఏర్పాటు చేసిన కమిటీకి కొంత మొత్తం చెల్లిస్తారు. అది గ్రామ అవసరాల కోసం ఉపయోగపడుతుంది. ఈ కమిటీకి ఇచ్చే మొత్తాన్ని నిర్ణయించడానికి మొదట గ్రామంలో వేలం పాట జరుగుతుంది. ఎక్కువ మొత్తానికి పాడుకున్న వాడు ప్రభుత్వం దగ్గర పోటీలేకుండా చవగ్గా కాంట్రాక్టు తెచ్చుకునే హక్కు పొందుతాడు. (ఈ డబ్బును ఏ గ్రామ అవసరాలకు ఉపయోగించాలి అనే విషయాన్ని మళ్లీ ఊరి పెత్తందార్లు నిర్ణయించకపోతే ఇది నిజానికి మంచి ఏర్పాటే) ఈ నిర్ణయాన్ని అనుసరించి ఎర్రబాలిరెడ్డి, తిరుమల రెడ్డి మార్చి మార్చి సారాకాంట్రాక్టు తెచ్చుకున్నారు. అయితే 1990లో ఘర్షణ జరిగింది. 1989లో తాము కాంట్రాక్టు తీసుకొని గ్రామానికి 40 వేలు చెల్లించామనీ 1990లో కాంట్రాక్టు తెచ్చుకున్న ఎర్రబాలిరెడ్డి ఒప్పుకున్న మొత్తం గ్రామానికి ఇవ్వకపోవడంతో తాము అతనికి బుద్ధి చెప్పడానికి కావాలని దొంగసారాయి అమ్మించామనీ తిరుమల రెడ్డి మనుషులు అంటారు. అది అబద్ధమనీ, వాళ్లు కావాలనే తమ వ్యాపారానికి గండి కొట్టడానికి దొంగసారాయి అమ్మారనీ ఎర్రబాలి రెడ్డి అంటాడు. రాష్ట్రంలోమధ్యపాన నిషేధం వచ్చిన తరువాత తిరుమల రెడ్డి దొంగ సారాయి, దొంగ విస్కీ అమ్ముతున్నాడని కూడ ఎర్ర బాలిరెడ్డి అంటాడు. ఫాక్షన్ ప్రాబల్యం ఎక్కువగా ఉన్న గ్రామాలలో ముఠా ప్రయోజనాలే తప్ప 'సత్యం' అనేదానికి అర్థం లేదు. కాబట్టి పరస్పర ఆరోపణలలోని సత్యాసత్యాలు నిర్ధారించడం కష్టం. ఏమయితేనేం, ఈ సారాయి కొట్లాటతో ఘర్షణలు మళ్లీ రాజుకున్నాయి. ఎర్ర బాలిరెడ్డి మనుషులు తిరుమల రెడ్డి మద్దతుదారుడయిన నాగిరెడ్డి సపోటా తోటపైన దాడిచేసి 75 చెట్లు నరికారు.

ఇది వరుసగా హత్యలకు దారితీసింది. 1990లో తిరుమల రెడ్డి మనుషులు ఎర్రబాలిరెడ్డి కొడుకు శివరామి రెడ్డిని తాడిపత్రి బస్‌స్టాండ్‌లో హతమార్చారు. తన కొడుకును చంపినందుకు ప్రతీకారంగా ప్రత్యర్థి కొడుకునే చంపాలనే కక్షతో ఎక్కడో ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న తిరుమల రెడ్డి కొడుకు దివాకర రెడ్డిని ఎర్రబాలిరెడ్డి 1992 లో కిరాయి హంతకుల చేత చంపించాడు. (ఒకవేళ అతను దొరకకపోతే, ఢిల్లీలో ఉన్న అతని సోదరుడిని సహితం చంపించడానికి ఎర్రబాలిరెడ్డి తయారయ్యాడంటారు.) ఈకిరాయి హంతకులు పులివెందుల నుండి ఏర్పాటు చేయడానికి సహకరించాడన్న అనుమానంతో సిద్ధయ్య అనే టీచర్‌ను తిరుమల రెడ్డి మనుషులు 1992 లోనే చంపించారు.

సారాయి వ్యాపారంలో లాభాలు, దాని కోసం ఘర్షణ, హత్యలూ ప్రతిహత్యలూ పెరిగిన ఈ దశలోనే ఎర్ర బాలిరెడ్డి వర్గానికి వై.ఎస్. రాజశేఖర రెడ్డి మద్దతు లభించింది. (పులివెందుల కిరాయి హంతకులు బహుశా ఈ రూపకంగానే సమకూరి ఉంటారు.) అంతకుముందు వాళ్లు కొండాపురం మండలస్థాయి నాయకుడయిన మాజీ ఎంఎల్ఏ రాంనాథరెడ్డి అనుచరులు. అవతల తిరుమల రెడ్డికి రాష్ట్ర క్యాబినెట్‌లో మంత్రిపదవులు వెలగబెట్టిన గుండ్లకుంట శివారెడ్డి (జమ్మలమడుగు), జె.సి. దివాకర రెడ్ల (తాడిపత్రి) మద్దతు దొరికింది. వీరిలో ఒకరు తెలుగుదేశం, ఒకరు కాంగ్రెస్. అయితే ముఠా రాజకీయాలలో పార్టీలు ముఖ్యం కాదు. వీరిద్దరూ రాజశేఖర రెడ్డికి ప్రత్యర్థి ముఠానాయకులు.

గ్రామీణ ముఠాదారులకు పై స్థాయి రాజకీయ నాయకులు ఇచ్చే మద్దతు ఉభయ పక్షాలకూ ప్రయోజనకరంగా ఉంటుంది. ముఠాదారుల ప్రాబల్యం వల్ల నాయకుల రాజకీయ అవసరాలు తీరుతాయి. ఎన్నికలొచ్చినప్పుడు గ్రామీణ ఫాక్షనిస్టులు తమ గుప్పిట్లో ఉన్న ప్రజలను తమనాయకుడి వైపు ఉంచుతారు. తమ వల్లనయిన దౌర్జన్యమంతా ప్రయోగించి తమ నాయకుడి అభ్యర్థిని గెలిపించడానికి కృషి చేస్తారు. ప్రత్యర్థికి ఎవ్వరినీ ప్రచారం చేయనివ్వరు. ఏజెంట్లను కూర్చోనివ్వరు. ప్రత్యర్థి వోటర్లను బూత్ దగ్గరికి రానివ్వరు. వస్తే బాంబులు వేసి తరిమేస్తారు. దొంగ వోట్లు వేస్తారు. వోట్ల పెట్టెలు ఎత్తుకుపోతారు. అడ్డం వచ్చిన పోలింగ్ అధికార్లను బెదిరిస్తారు. చంపేస్తారు కూడ.

ఎర్ర బాలిరెడ్డి తిరుమల రెడ్ల ముఠాకక్షల ప్రభావం టి.కోడూరుకే పరిమితం కాదు. సిరిగేపల్లి, సంకేపల్లి, కొత్తపల్లి, మురగంపల్లి, సోములూరు, ఎర్రగుడి తదితర గ్రామాలకు కూడ ఆ ప్రభావం విస్తరించి ఉంది. కాబట్టి ఆ ముఠాదారులకు మద్దతు ఇవ్వడం వల్ల రాజకీయ నాయకులకు ఉండే ప్రయోజనం స్వల్పం కాదు.

ఇటు గ్రామీణ ఫాక్షనిస్టులకు తమ స్థానిక పెత్తనం నిలబెట్టుకోవడానికి పైస్థాయి రాజకీయ నాయకుల మద్దతు చాలా రకాలుగా ఉపయోగపడుతుంది. నాయకులు కొందరు డబ్బులు ఇస్తారు, కొందరు బాంబులు సరఫరా చేస్తారు, తుపాకీ లైసెన్సులు ఇప్పిస్తారు. అరెస్టయితే పోలీస్ ఆఫీసర్లతో మాట్లాడి ఇబ్బందులు లేకుండ చూస్తారు. సమితి (ఇప్పుడు మండల) స్థాయిలో పదవులకు టిక్కెట్లు ఇప్పిస్తారు. సారాయి లేక సివిల్ కాంట్రాక్టులు పొందడానికి సహాయపడతారు. క్రిమినల్ కేసులను సమయం వచ్చి నప్పుడు రాజీచేస్తారు. ఉభయతారకమయిన ఈ ఏర్పాటు వల్ల నష్టపోయేది మాత్రం సామాన్య ప్రజలు, సమాజ పురోగతి. సామాజిక జీవితంలో బీభత్స వాతావరణం, ఆధిపత్య హింస ప్రబలి ప్రజాతంత్ర సంస్కృతి, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు మృగ్యమవుతాయి. ప్రజలందరూ వీరి ముఠాలలో భాగం కాకపోవచ్చు. కానీ రాజకీయంగా ఊరు రెండుగా చీలి కొందరు ఒక ముఠానాయకుడి పక్షం, కొందరు రెండవ ముఠానాయకుడి పక్షం ఉంటారు. ఎన్నికలప్పుడు, ఇతర రాజకీయ సందర్భాలప్పుడు, నాయకుడి ఆదేశాల అనుసారం నడుచుకుంటారు.

టి. కోడూరులో వెనుకబడిన కులాలలో కొన్ని మొత్తంగా తిరుమల రెడ్డి వైపు ఉండగా, దళితులంతా ఎర్రబాలిరెడ్డి అనుచరులు. దళితుల చేత తిరుమల రెడ్డి కుటుంబం తక్కువ కూలికి పనిచేయించుకుంటారనీ, అందువల్ల దళితులు తనతో ఉంటారనీ ఎర్రబాలిరెడ్డి అంటాడు. అదేం నిజం కాదనీ, దళితుల ఇండ్లు ఎర్రబాలిరెడ్డి ఇంటికి ఆవలకుండడంవల్ల వాళ్లు రావాలన్నా పోవాలన్నా అతని ఇలాఖాలో నడవాలనీ అందువల్ల భయానికి అతనితోనే ఉంటారనీ తిరుమల రెడ్డి అంటాడు. రెండు ఆరోపణలూ సత్యమయినా ఆశ్చర్యపోవలసిన పనిలేదు.

ఈ రెండు ఆరోపణలు (వాటి సత్యాసత్యాల నిర్ధారణ అటుంచి) రెండు విషయాలు తెలియజేస్తాయి. ఒక ముఠా దౌర్జన్యాలను ఎదుర్కోవాలంటే ఇంకొక ముఠాను ఆశ్రయించడం తప్ప ప్రజలకు ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయం లేదు. రెండు, తమ నిత్య జీవిత అవసరాలకు ప్రజలు ఒక ముఠానాయకుడి దయాదాక్షిణ్యాలపైన ఆధారపడి ఉన్నట్లయితే అతనికి లొంగి పడివుండటం తప్ప గత్యంతరం లేదు. ఈ స్థితిని భరించలేక చాలా కుటుంబాలు టి.కోడూరు విడిచిపెట్టి వలసపోయాయి. అవన్నీ బెస్త, వడ్డెర, దళిత కుటుంబాలు.

సమాజ పురోగతి కూడ ఈ దౌర్జన్యకర ముఠా సంస్కృతి వల్ల దెబ్బ తింటుందని అన్నాము. ప్రజాతంత్ర సంస్కృతి పురోగమనంలో భాగమే కాబట్టి దానికి జరిగే హాని పురోగమనానికి దెబ్బే. అయితే దానితో బాటు భౌతిక పురోగతి కూడ దెబ్బతింటుంది. ఇంతటి దౌర్జన్యకారులు గ్రామాలను ఏలే చోట గ్రామజీవన వసతులు బాగుంటాయనీ అభివృద్ధి

పథకాలు బాగా అమలవుతాయనీ అనుకుంటే పొరబాటే. దేశంలో చాలా చోట్ల అభివృద్ధి ఎందుకు కుంటుపడిందని ప్రజలను అడిగితే 'మా నాయకులు అసమర్థులు, చేతకాని వాళ్లు' అంటారు. కడప జిల్లాలో గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి దాకా సమాజాన్ని ఏలే నాయకులు ఎంత మాత్రం చేతకానివారు కారు. దౌర్జన్యంచేసి తమకు కావలసింది సాధించుకోవడంలో అత్యంత సమర్థులు. దాని కోసం ఎన్ని హత్యలయినా చేయించగలరు. ఎందరి కొంపలయినా ఆర్పగలరు. అయితే అదంతా తమ పెత్తనం కోసమే, తమ ఆధిపత్యం కోసమే. అతి ప్రాచీన ఫాక్షన్ గ్రామమయిన టి. కోడూరునే ఉదాహరణగా తీసుకుంటే, ఆ ఊరికి ఈనాటికీ సరయిన రోడ్డులేదు. జీపులు సహితం కష్టం మీదనే పోగలవు. ఆ ఊరు ఉండేది కొండాపురం మండలంలో. అయితే టి. కోడూరు నుండి కొండాపురం పోవాలంటే పెన్నా నది దాటాలి. పెన్నా నది మీద ఆ మండలంలో ఎక్కడా బ్రిడ్జి లేదు. కాబట్టి టి. కోడూరు వాసులు మండల కేంద్రానికి పోవాలంటే, పక్కనే ఉన్న అనంతపురం జిల్లా సరిహద్దు దాటి తాడిపత్రి పట్టణం దగ్గర పెన్న నది దాటి, తిరిగి కడప జిల్లాలోకి ప్రవేశించాలి.

## కొమ్మద్ది :

బసిరెడ్డిపల్లి, కొమ్మద్ది ఒకే పంచాయితీలోని రెండు గ్రామాలు. మండలం వీరపనాయనిపల్లి, నియోజకవర్గం కమలాపురం. బసిరెడ్డిపల్లి ఒకప్పుడు కమ్యూనిస్టు ప్రభావం బలంగా ఉన్న గ్రామం. కొమ్మద్ది చాలా కాలంగా ముఠాకక్షలున్న గ్రామం. అది పాత కాలపు పాలెగాడి గ్రామం. 1947 కు పూర్వం దొరవారి సుబ్బన్న అనే పాలెగాళ్ల వంశానికి చెందిన పెత్తందారు కొమ్మద్దిలో ఆధిపత్యం చలాయించేవాడు. అతను పట్ర కులానికి చెందినవాడు. గ్రామంలోని రెడ్డి కులస్తులయిన వ్యవసాయదారులు అతనికి వ్యతిరేకం. బలిజ తదితర వెనుకబడిన కులాల రైతులు అతనికి అనుకూలం. ఈ ఘర్షణలో పట్ర సుబ్బన్న హత్య జరిగింది. ఆ తరువాత గ్రామంలో రెడ్లదే పైచేయి అయి, అనతి కాలంలో రెడ్లలోనే ముఠాలు పుట్టాయి. ఇప్పటికి 15 మంది హతం అయ్యారు.

గ్రామ పంచాయితీలు ఈ పరిణామానికి చాలా దోహదం చేసాయి. 1958 పంచాయితీ ఎన్నికలతో కక్షలు రాజుకున్నాయి. ఇది ఈ ఒక్క గ్రామం ప్రత్యేకత కాదు. గ్రామీణ ముఠా కక్షల సంస్కృతి రాజకీయాలలోకి ప్రవేశించి రాజకీయ ముఠాకక్షలుగా మారిన పరిణామం గ్రామ పంచాయితీలతోనే ప్రారంభం అయింది. ప్రజాస్వామ్యానికి సంబంధించిన ఒక వ్యవస్థగా ఉనికిలోకి వచ్చిన పంచాయితీ వ్యవస్థ ఫాక్షనిస్టుల చేతిలోకి పోయి ముఠాకొట్లాటలకు కొత్త వేదిక కల్పించింది. పంచాయితీలపైన ఆధిపత్యం సాధించడానికి ముఠాలు, ముఠా దౌర్జన్యాలు ఒక సాధనం అయ్యాయి. పాత కక్షలులేని చోట కూడ

పంచాయితీ ఎన్నికలతోనే కక్షలు, ముఠాలు మొదలయ్యాయి. కాలక్రమంలో ఫాక్షన్ రాజకీయాలు సమితి స్థాయికి, అసెంబ్లీ స్థాయికి ఎదిగాయి. ఆ వైనం తరువాత చూద్దాం.

1959 ఎన్నికలలో కొమ్మద్ది రెడ్లు బసిరెడ్డిపల్లికి చెందిన శింగం మునిరెడ్డిని సర్పంచ్ పోటీకి అభ్యర్థిగా నిలబెట్టారు. బసిరెడ్డిపల్లిలో బలం ఉన్న సిపిఐ వాళ్లు వేరే అభ్యర్థిని నిలబెట్టారు. కమ్యూనిస్టులు అంతకు ముందు నుండి ఈ ప్రాంతంలో ప్రజలలో పనిచేసి కొంత పట్టు సంపాదించుకొని వున్నారు. అయితే ఘర్షణ నివారించే ఉద్దేశ్యంతో సర్పంచ్ ఎన్నికకు ముందు రోజు ఇరువర్గాలూ రాజీ పడ్డారు. రెండున్నర సంవత్సరాలు శింగం మునిరెడ్డి సర్పంచ్‌గా ఉండేటట్లు, ఆ తరువాత రెండున్నర సంవత్సరాలు కమ్యూ ్యనిస్టుల అభ్యర్థి సర్పంచ్‌గా ఉండేటట్లు ఒప్పందం కుదిరింది. అయితే రెండున్నర సంవత్సరాల తరువాత మునిరెడ్డి మద్దతు ధారులు రాజీకి కట్టుబడి ఉండడానికి ఒప్పుకోలేదు. వార్డు మెంబర్లలో మెజారిటీ వాళ్లకే ఉండడం వల్ల వాళ్లను రాజీ సూత్రానికి కట్టిపడేయుడం కమ్యూనిస్టులకు సాధ్యం కాలేదు. దీనితో ఘర్షణ పెరిగి గ్రామపంచాయితీలోని అన్ని గ్రామాలలోనూ చీలికలు వచ్చి కొట్లాటలు జరిగాయి. 1960 లో సిపిఐ అనుచరులు శింగం మునిరెడ్డిని కమలాపురంలో హత్యచేసారు. కమ్యూనిస్టు పార్టీ ఈ హత్యను ఆమోదించలేదు. హత్యచేసినవారిని సిపిఐ పార్టీ నుండి బహిష్కరించింది. (కానీ తిరిగి మళ్లీ చేర్చుకుంది) ఈ హత్య కేసులో ఆరు మందికి శిక్ష పడింది.

1962 తరువాత మళ్లీ ఘర్షణలు పెరిగాయి. బసిరెడ్డిపల్లి కమ్యూనిస్టులు 1964లో సిపిఐ(ఎం) లోకి పోయారు. వాళ్లకూ కొమ్మద్ది రెడ్లకూ ఉన్న ఘర్షణ రాజకీయ ఘర్షణగా కాక ఫాక్షన్ రూపంలో సాగింది. దానిని అణచడానికి ప్రభుత్వం ప్యూనిటివ్ పోలీస్ క్యాంప్ పెడతానని బెదిరించింది. గ్రామంలో ప్యూ ్యనిటివ్ పోలీస్ క్యాంప్ దానికి అయ్యే ఖర్చు ఇరువర్గాలూ భరించవలసి ఉంటుంది. ఆ హెచ్చరికతో ఘర్షణ కొంత తగ్గింది.

1970 లో మళ్లీ గ్రామపంచాయితీ ఎన్నికలు వచ్చినప్పుడు కమ్యూనిస్టులు నిమ్మకాయల గంగిరెడ్డిని నిలబెట్టారు. మళ్లీ ఘర్షణ వాతావరణం పెరిగింది. కానీ కాలక్రమంలో ఈ ఘర్షణ నిమ్మకాయల గంగిరెడ్డికీ అవతలివైపు నాగెళ్ల నాగిరెడ్డికీ మధ్య ముఠాకొట్లాటగా మారిపోవడంతో కమ్యూనిస్టులు అధికారికంగా దూరం అయ్యారు. గంగిరెడ్డి – నాగిరెడ్డి ఫాక్షన్ మాత్రం కొనసాగింది. జనం మీది నుండి కింది దాకా రెండుగా చీలారు (కమ్యూనిస్టు పార్టీ అనుచరులతో సహా). ఈ రోజు ఆ గ్రామాలలో ఏ కమ్యూనిస్టు పార్టీ ప్రభావమూ పెద్దగా లేదనే చెప్పాలి.

ఈ ముఠా కొట్లాటలలో వరుసబెట్టి హత్యలు జరిగాయి. 1975-85 కాలంలో గ్రామంలో ప్యూనిటివ్ పోలీస్ క్యాంప్ ఉండింది. నాగిరెడ్డి పక్షాన ఉన్న తలారి మల్యాల గురప్పను, రంగారెడ్డి అనే బసిరెడ్డిపల్లి నివాసినీ 1978 నవంబర్ 9న గంగిరెడ్డి మనుషులు చంపారు. ఈ కేసులో గంగిరెడ్డి జైలులో ఉండగా, నాగిరెడ్డి మనుషులు 1979 మార్చి 19 నాడు అయ్యవారిపల్లి దగ్గర బస్ ఆపి 'కొమ్మద్ది వాళ్ళు తప్ప అందరూ దిగండి' అంటూ జనాన్ని బలవంతంగా దింపి గంగిరెడ్డి వర్గానికి చెందిన అయిదుగురు రెడ్లను నరికి చంపారు. రంగారెడ్డి హత్యలో ఆరుగురికి శిక్షపడింది. అయ్యవారిపల్లి హత్య కేసులో 29 మందికి శిక్షలు పడ్డాయి. అందులో అయిదుగురికి మరణదండన పడింది. కానీ హైకోర్టులో అందరూ విడుదల అయ్యారు.

1980లో గంగిరెడ్డి మనుషులు పుష్పరాజ్ అనే దళితుడిని చంపారు. 1984లో పెరోల్ మీద జైలు నుండి బయటికి వచ్చిన గంగిరెడ్డి ఒకే రాత్రి తన ప్రత్యర్థులపైన దాడిచేసి కత్తులు, గొడ్డళ్ళు,బాంబులతో ఆరుగురిని హతమార్చాడు. అప్పటికి నిజానికి గ్రామంలో రాజీ వాతావరణం ఏర్పడింది. అందువల్లనే అతను ప్రత్యర్థులను మభ్యపెట్టి చంపగలిగాడు. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే ఈ హత్యలన్నీ గ్రామంలో ప్యూనిటివ్ పోలీస్ క్యాంప్ ఉండగానే జరిగాయి.

గ్రామంలో అందరూ తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా పనిచేసేటట్టయితే ప్యూనిటివ్ పోలీస్ క్యాంప్ ఎత్తేస్తామని తెలుగుదేశం పాలకులు 1985 ఎన్నికలప్పుడు ఆశ చూపించగా, కొమ్మద్ది గ్రామం మొత్తం ఒకటయి తెలుగుదేశం అభ్యర్థికి అనుకూలంగా రిగ్గింగ్ చేయడానికి పూనుకున్నారు. బసిరెడ్డిపల్లి వాళ్లకు కూడ పోలీస్ క్యాంపు తీసివేయడం వల్ల మేలే అయినప్పటికీ, కొమ్మద్ది వాళ్ల పెత్తనం ఏమిటనే ముఠాతత్వంతో ఆ గ్రామవాసులు దానిని తమ 'ప్రెస్టీజ్' సమస్యగా తీసుకొని అడ్డుకోవడానికి సిద్ధపడ్డారు. ఒకప్పటి కమ్యూనిస్టు పార్టీ మద్దతుదారులు, వాళ్లచేతిలో చనిపోయిన శింగం మునిరెడ్డి అనుచరులు ఒకటయ్యారు. కొమ్మద్ది వాళ్లు రాజీకి వచ్చారు. 400 వోట్లు బసిరెడ్డిపల్లి వాళ్ల ఇష్టం ప్రకారం వేసేటట్టు, మిగిలిన వోట్లు కొమ్మద్ది వాళ్ల ఇష్టం ప్రకారం తెలుగుదేశం పార్టీకి వేసేటట్టు ఇరుపక్షాలూ రాజీపడ్డారు.

కొమ్మద్ది - బసిరెడ్డిపల్లిల కథలో గమనించదగ్గ విషయాలు రెండున్నాయి. ఒకటి, కమ్యూనిస్టులకూ ఫాక్షనిస్టులకు ఘర్షణగా మొదలయినది చివరికి ముఠాకొట్లాటగా మిగిలిపోయిన వైనం. సిపిఐ కి కడప జిల్లాలో ఒకప్పుడు కొంత బలం ఉండింది. 1952 అసెంబ్లీ ఎన్నికలలో కమలాపురం, రాజంపేటలలో సిపిఐ అభ్యర్థులు గెలిచారు. 1955 మధ్యంతర ఎన్నికలో వీరిద్దరూ ఓడిపోయారు. కానీ కడప ఎంపిగా సిపిఐ నాయకుడు

ఈశ్వరరెడ్డి (కాంగ్రెసులోని అసమ్మతివాదుల సాయంతోనే కావచ్చు) నాలుగు సార్లు గెలిచాడు. సిపిఐ కి గ్రామీణ ముఠాకక్షల పట్ల వ్యతిరేక భావం ఉండిందని పాతతరం నాయకులు అంటారు. ఫాక్షన్ల జోలికి పోకూడదన్న అభిప్రాయం ఉండింది. అయితే ముఠాతత్వాన్నీ వ్యతిరేకించే కార్యక్రమంగానీ, రాయలసీమ ప్రజాజీవిత ప్రజాస్వామీకరణలో అదొక ముఖ్య కర్తవ్యం అన్న అవగాహనగానీ సిపిఐకి లేదు. అందువల్ల స్థానిక సంస్కృతిలో భాగమైన కార్యకర్తలు స్థానికంగా అలవాటయిన పద్ధతిలోనే తమ పోరాటాలు నడిపారు. భూస్వాములకు వ్యతిరేకంగా తాము నడిపిన ఉద్యమాలను ఫాక్షన్ పద్ధతిలో నడపడం, లేదా పెత్తందారుకు వ్యతిరేకంగా ముఠాపద్ధతిలో పోరాడుతున్న వ్యక్తికి ఎత్తుగడల రీత్యా మద్దతు ఇవ్వడం తరుచుగా జరిగింది. జమ్మలమడుగులో శివారెడ్డి, పులివెందులలో వై.ఎస్. కుటుంబం, ప్రొద్దుటూరులో ఎం.వి. రమణారెడ్డి ఫాక్షనిస్టులుగా ఎదగడంలో కమ్యూనిస్టు రాజకీయాల పాత్ర కొంత ఉందన్న సంగతి తరువాత చూద్దాం. వీరు మొదటి ఇద్దరు పాతతరం భూస్వాములపైన తిరగబడి తమ ఆధిపత్యం నెలకొల్పడంలో కమ్యూనిస్టుల సహాయ సహకారాలు పొందారు. పాతతరం నాయకుల పెత్తనాన్ని తుదముట్టించడానికి వీళ్ల 'జోరు' పనికొస్తుందని కమ్యూనిస్టులు వీళ్లకు సహకరించారు. రమణారెడ్డయితే విప్లవ రాజకీయాల పేరు మీదనే తన ముఠాను ప్రారంభించాడు. ఆ తరువాత మూడు ప్రాంతాలలోను, ఆ ముగ్గురి ముఠా దౌర్జన్యాలు భరించరాని స్థాయికిచేరి కూర్చున్నాయి.

రెండవ విషయం ఫాక్షన్ గ్రామాలలో వోటు హక్కుకు ఏం గతిపట్టింది అనేది. ఊరిలో వోట్లన్నీ తెలుగుదేశం పార్టీకో కాంగ్రెస్ పార్టీకో పడతాయని ఒక ముఠానాయకుడు హామీ ఇవ్వగలడు. వ్యక్తులుగా ఎవ్వరూ దానిని వ్యతిరేకించలేరు. అతని ముఠా నిర్ణయానికి అనుకూలంగా వోటు వేస్తారన్న నమ్మకం ఉన్నవాళ్లు మాత్రమే పోలింగ్ బూత్ దగ్గరికి పోగలుగుతారు. మిగిలిన వాళ్లను వాళ్లు పోనివ్వరు. ఎవరికి వోటువేసేదీ వాళ్ల ఏజంటుకు చూపించి డబ్బాలో వేయాలంటే చూపించి వేయవలసిందే. అంత శ్రమకూడ వద్దను కుంటే ముఠాకు చెందిన మనుషులే అన్ని వోట్లు గుద్దేసుకోవచ్చు. ఒక్కొక్కసారి బ్యాలెట్ పేపర్లన్నీ పోలింగ్ బూత్ నుండి బయటకు తీసుకొచ్చి రచ్చబండ దగ్గర గుద్ది డబ్బాలో వేయడం కద్దు. ఆ ముఠా నిర్ణయాన్ని ఇంకొక ముఠా మాత్రమే వ్యతిరేకించగలదు. అప్పుడు ఇద్దరికీ ఘర్షణ జరుగుతుంది. బాంబులు పడతాయి, హత్యలు జరుగుతాయి, లేదా వాళ్లిద్దరూ రాజీపడి చెరికొన్ని వోట్లు పంచుకొని వేసుకోవచ్చు. ఇక్కడ ఒక్కొక్క వోటరు తన ఇష్టం ప్రకారం తన వోటు హక్కు వినియోగించుకోవడం అనే ప్రజాస్వామిక సూత్రానికి తావులేదు. (శేషన్ నియమాలు ఈ పద్ధతులను కొంతవరకు తగ్గించాయి. కాబట్టే రాయలసీమ జిల్లాలలో శేషన్ అంటే ప్రజలకు గౌరవం ఉంది.)

రాజకీయ నాయకులు గ్రామీణ ఫాక్షన్లను ఎందుకు పోషిస్తారో ఇప్పుడు సులభంగా అర్థం అవుతుంది. ఒక ఊరిలోని బలమయిన ఫాక్షనిస్టు 'మనవాడు' అయితే ఆ ఊరిలో వోట్లు సులభంగా పొందవచ్చు. ఇంటింటికీ తిరిగి అడుక్కోనక్కర లేదు. బావులు తవ్విస్తామనీ, రోడ్లు వేయిస్తామనీ హామీలు ఇయ్యనవసరం లేదు. అసలు ప్రజల కోసం ఏమీ ఎన్నడూ చేయనవసరం లేదు. ఒక ఊరిలో ప్రాబల్యం ఉన్న వ్యక్తి 'తమవాడు' కాకపోతే అతనికి ఆ ఊరిలో వ్యతిరేకంగా నిలబడగలవాడు ఎవడా అని వెతికి ఫాక్షన్ పెట్టిస్తారు నాయకులు. పెత్తనం కోసం పోటీపడమని ప్రోత్సహిస్తారు, రెచ్చగొడతారు, అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తారు. ఆపైన ఆ ఊరిలో బాంబులు పడతాయి, హత్యలు జరుగుతాయి, ఇళ్లు తగలబడతాయి, తోటలు నాశనం అవుతాయి, పొలాలు బీడుపడతాయి. కానీ రాజకీయ నాయకుల ప్రయోజనాలు నెరవేరుతాయి.

అందుకే వీళ్లను బందిపోట్లకంటె హీనమయిన నేరస్తులుగా చూడాలంటున్నాము.

## రాయచోటి :

రాయచోటి కడప జిల్లాలోని ఒక పాత కాలపు తాలూకా కేంద్రం. రెండవ అధ్యాయంలో వివరించినట్టు 18వ శతాబ్దంలో రాయలసీమలో పాలెగాళ్లు అధికంగా ఉన్న నాలుగు తాలూకాలలో రాయచోటి ఒకటి. కానీ 19వ శతాబ్దం చివరికి వచ్చేసరికి గ్రామీణ ఫాక్షన్లు రాయచోటిలో ఎక్కువగా లేవు. ఉత్తర (లేక వాయువ్య) తాలూకాలయిన జమ్మలమడుగు, పులివెందుల, ప్రొద్దుటూరులలోనే ఆ వాతావరణం అధికంగా ఉండింది.

1978 తరువాత జిల్లా రాజకీయాలను శాసించసాగిన సాయుధ రాజకీయ ముఠాల ప్రాబల్యం కూడ ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు నియోజక వర్గాలలో ఉన్నంతగా రాయచోటిలో లేకపోయినప్పటికీ, ఎన్నికల హింసకు రాయచోటి పేర్గాంచింది. ఎన్నికలలో ఓడిపోతామని భయపడే వాళ్లు బలహీనుడయిన ఒక స్వతంత్ర అభ్యర్థిని ముందు రాత్రి హతమార్చి ఎన్నిక వాయిదా వేయించే ఘోరమయిన సంప్రదాయానికి వరవడి వేసింది రాయచోటి. 1985 పార్లమెంటు ఎన్నికలలో, 1989 అసెంబ్లీ ఎన్నికలలో రెండుసార్లు అభ్యర్థులు ఈనీచానికి ఒడిగట్టారు. 1989 లో అభ్యర్థి చనిపోవడం వల్ల అసెంబ్లీ ఎన్నిక వాయిదా పడగా పార్లమెంటు ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో వోటర్ల మీద దౌర్జన్యమేకాక ( అది మామూలు సంగతే) రాయచోటిలో ఒక పోలింగ్ అధికారిని బూత్ నుండి బయటకు లాగి నరికి చంపారు. ఈ దుష్ట చరిత్ర కారణంగా ఎన్నికలొస్తున్నాయంటేనే రాయచోటిలో ప్రజలు భయభ్రాంతులవుతారు. ఎన్నికలలో ప్రజాభీష్టం వ్యక్తం కావడానికి అవసరం అయిన స్వేచ్ఛాయుత వాతావరణం అక్కడ పూర్తిగా ధ్వంసం అయింది.

ఈ హింసకు మూలం రాయచోటి నియోజక వర్గంలో ఆధిపత్యం కోసం ఘర్షణ. ఒక వైపు ఉన్నది పాలకొండరాయుడు, మరొకవైపు ఉన్నది వైఎస్ రాజశేఖరరెడ్డి మద్దతు ఉన్న స్థానిక నాయకులు (సాయిప్రతాప్, నాగిరెడ్డి, నారాయణరెడ్డి). పాలకొండ రాయుడికి జిల్లా రాజకీయాలలో ప్రొద్దుటూరు పాలెగాడు ఎం.వి. రమణారెడ్డి మద్దతు ఉంది. అతను 1985 నుండి తెలుగుదేశం పార్టీలో ఉన్నాడు కాబట్టి ఈ ఘర్షణకు కొంతమేరకు తెలుగుదేశం – కాంగ్రెస్ ఘర్షణగా భావించవచ్చు. అయితే అది ప్రధాన విషయం కాదు. పాలకొండ రాయుడు 1978లో జనతా పార్టీ, ఆ తరువాత కాంగ్రెస్‌లో వై.ఎస్ రాజశేఖరరెడ్డి వర్గం, ఆ తరువాత స్వతంత్రం, ఆ తరువాత తెలుగుదేశం. అప్పటినుండి వై.ఎస్ కు వ్యతిరేకం. అతను రేపో ఎల్లుండో కాంగ్రెస్‌లో చేరడన్న నమ్మకం లేదు. చేరినా చేరకున్నా వైఎస్ కు అనుకూలం కాడన్న నమ్మకం లేదు. (వైఎస్‌కు అనుకూలం కావడానికి కాంగ్రెస్‌లోనే చేరవలసిన అవసరం లేదు) ఇక్కడ ప్రధాన విషయం నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం జరిగే ఘర్షణ. తాను వెనుకబడిన బలిజ కులం ప్రతినిధిననీ రెడ్ల ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తున్నాననీ పాలకొండరాయుడు చెప్పుకుంటాడు. ఇందులో కొంత నిజం ఉన్నప్పటికీ ప్రజలను భయభ్రాంతులుచేసి ఆధిపత్యం నిలబెట్టుకోవడంలోనూ దౌర్జన్యంచేసి ఆస్తులు సంపాదించడంలోనూ ఇతను రెడ్డి కులస్తులయిన ఫాక్షనిస్టుల కెంత మాత్రం తీసిపోడు.

ఈ ఘర్షణ వివరాలు మరికొన్ని తరువాత చూద్దాము. కానీ ఈ 'కథాచిత్రాల' అధ్యాయంలో ప్రస్తావించవలసిన విషయం ఒకటి ఉంది. అది, రాయచోటి పట్టణంలో రెండు ముస్లిం కుటుంబాల మధ్యన ఉన్న ముఠాకక్షను ఈరెండు వర్గాలూ తమ ప్రయోజనాల కోసం ఉపయోగించుకొని, పెంచి పోషించినవైనం. రాయచోటి పట్టణంలో ముస్లిం జనాభా చాలా ఉంది. వారిలో మంచి వ్యాపారాలలో ఉన్నవాళ్లు ఉన్నారు. చదువుకొన్న వాళ్లు, ఉద్యోగస్తులు ఉన్నారు. అటువంటి విద్యాధికుడయిన రిటైర్డ్ ఆర్‌డివో అల్లీసాహెబ్ కుమారులయిన 'సలీం బ్రదర్స్' కు, కొలిమి పని చేసుకునే ఇంకొక ముస్లిం కుటుంబానికీ ముఠాకక్షలున్నాయి. ఈ కుటుంబాన్ని ప్రాసకోసం 'కొలిమి బ్రదర్స్' అని వ్యవహరిస్తారు. వీళ్లు 12 మంది అన్నదమ్ములు. కొలిమిపని, ఇతర వ్యాపారాలు చేసుకుంటారు. రాయచోటిలో పాతతరం ముస్లిం నాయకుడు హబీబుల్లా 1982లో చనిపోయిన తరువాత, ముస్లింలలో నాయకత్వం కోసం పోటీ మొదలయింది. ఆ పోటీలో 'సలీంబ్రదర్స్' దూకుడుగా ముందుకు రాగా 'కొలిమి బ్రదర్స్' వాళ్లను వ్యతిరేకించారు. దీనితో ఆ రెండు కుటుంబాలకు ఫాక్షన్ మొదలయింది. ఇది రాయచోటి పట్టణానికి పరిమితమయిన ముఠాకక్ష. ఒక దశాబ్దంలో 10 మందికి పైగా పరస్పర దాడులలో మృతి చెందారు. పెద్ద ఎత్తున హింస చెలరేగింది. వీరి ఘర్షణను ఒక వైపు పాలకొండరాయుడు, మరొక వైపు వై.యస్ రాజశేఖర రెడ్డి

అనుయాయులయిన అతని ప్రత్యర్థులు, తమ అవసరాల కోసం వాడుకున్నారు. ఒక్కొక్కరు ఒక కుటుంబాన్ని చేరదీసి, వారి దౌర్జన్యాలను తమ ఎన్నికల ప్రయోజనాల కోసం, ప్రజలను భయభ్రాంతులు చేయడం కోసం, వినియోగించుకున్నారు. పాలకొండ రాయుడు వైఎస్ మనిషిగా ఉన్న రోజులలో సలీంబ్రదర్స్ పాలకొండ రాయుడుతోనే ఉన్నారు. పెద్ద మనిషిగా, సంస్కారవంతుడిగా పేరున్న హబీబుల్లాకు వ్యతిరేకంగా పాలకొండరాయుడు సలీంబ్రదర్స్ రౌడీయిజాన్ని ఉపయోగించుకున్నాడని అతని ప్రత్యర్థులంటారు. అప్పటికి కొలిమి బ్రదర్స్ రంగంలో లేరు.

కానీ తరువాతి కాలంలో పాలకొండ రాయుడు వైఎస్‌కు దూరం అయినప్పుడు సలీం బ్రదర్స్ వైఎస్ అనుచరుడైన నాగిరెడ్డి మద్దతుదార్లయ్యారు. 1985 నాటికి వాళ్లు రాయచోటిలో రౌడీయిజం చేయడం, బెదిరించి డబ్బులు వసూలు చేయడం, ఆధిపత్యం చలాయించడం ఎక్కువయింది. కొలిమిబ్రదర్స్ వాళ్లను వ్యతిరేకించారు. వీళ్ల ఘర్షణలో మొదటి హత్య 'కొలిమి' వాళ్ళే చేసారని ఒక రిటైర్డ్ పోలీస్ అధికారి అంటాడు. వాళ్లు, మరికొందరు కలిసి సలీం పెద్దన్నను చంపారు. అప్పటి నుండి రెండు కుటుంబాల మధ్య హింసాత్మక ఘర్షణ పెరిగింది. 'కొలిమి' వాళ్లు ఎక్కువగా నష్టపోయారు. 1985 నుండి 1993 దాకా సలీం బ్రదర్స్‌ను కాంగ్రెస్ ఎంఎల్ఏ నాగిరెడ్డి, కొలిమి బ్రదర్స్‌ను పాలకొండరాయుడు చేరదీయడంతో వాళ్ల కుటుంబ కక్షలు రాజకీయ కక్షలుగా మారి రాయచోటి రాజకీయ ముఠాకక్షలలో భాగం అయ్యాయి.

1985 పార్లమెంట్ ఎన్నిక రేపు ఉందనగా స్వతంత్ర అభ్యర్థి గువ్వల సుబ్బరాయుడును పాలకొండరాయుడు చంపించి ఎన్నిక వాయిదా వేయించాడు. ఉపఎన్నికలో సలీంబ్రదర్స్, కొలిమి బ్రదర్స్ చెరి ఒక వైపు పనిచేసి హింసకు, రిగ్గింగ్‌కు తోడ్పడ్డారు. పాలకొండరాయుడు గెలిచాడు. తరువాత మండల ప్రజాపరిషత్ ఎన్నికలో కాంగ్రెస్ వాళ్లు సలీంకు టిక్కెట్ ఇవ్వగా, తెలుగుదేశం వాళ్లు బర్కతుల్లా అనే వ్యక్తికి ఇచ్చారు. కొలిమి బ్రదర్స్ బర్కతుల్లాకు మద్దతు ఇచ్చారు. పెద్ద ఎత్తున బాంబుల ప్రయోగం, కాల్పులు జరిగాయి. అరవీడుకు చెందిన మాబుపీరా చనిపోయాడు. సలీం ఓడిపోయాడు. 1989 ఎన్నికలలో, పోలింగ్ అధికారిగా ఉన్న 'కొలిమి' వాళ్ల బంధువు అహ్మదుల్లాను కాంగ్రెసు వాళ్లు పోలింగ్ బూత్ నుండి బయటకు లాగి నరికి చంపారు. 1989 లో అసెంబ్లీకి, పార్లమెంటుకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. రాయచోటిలో పాలకొండ రాయుడు, నాగిరెడ్డి అసెంబ్లీకి పోటీ చేసారు. నాగిరెడ్డి వాళ్లు తమ వర్గానికి చెందిన ఆవుల సుబ్బారెడ్డి అనే అర్భకుడిని స్వతంత్ర అభ్యర్థిగా నిలబెట్టి, పోలింగ్‌కు ముందురోజు రాత్రి అతన్ని హతమార్చి ఎన్నికను వాయిదా వేయించారు. అదే సమయంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికలో రాయచోటి అసెంబ్లీ సెగ్మెంట్‌లో తెలుగుదేశం

పార్టీకి ఆధిక్యత వచ్చిందనీ, కాబట్టి అసెంబ్లీ ఎన్నిక జరిగితే నాగిరెడ్డి ఓడిపోయి ఉండేవాడనీ, ఈ సంగతి ముందే గ్రహించిన నాగిరెడ్డి తానే నిలబెట్టించిన ఆవుల సుబ్బారెడ్డిని చంపించాడనీ పాలకొండ రాయుడు అంటాడు. కానీ పోలింగ్‌కు ముందు రోజు రాత్రే పాలకొండ రాయుడు పోలింగ్ డబ్బాలలో వోట్లు నింపుకున్నాడనీ, అది తెలిసి కాంగ్రెస్ వాళ్ళ ఈ దుర్మార్గానికి ఒడిగట్టారనీ ఒక రాయచోటి నివాసి అంటాడు. (పోలింగ్ మొదలు కాకముందే డబ్బాలలో వోట్లు నిండిపోవడం కడప ప్రజాస్వామ్యం ప్రత్యేకత. తమకు బలం ఉన్నచోట ముందు రాత్రే డబ్బాలు నింపేసి పోలింగ్ రోజున వేరే ఊర్లకు రిగ్గింగుకు పోతారు.) ఈ హత్య తరువాత అసెంబ్లీ ఎన్నిక రద్దయింది. కానీ పార్లమెంట్ ఎన్నిక జరిగింది. పోలింగ్ నాడు విపరీతమయిన హింస చెలరేగింది. పోలింగ్ మొదలయిన గంటలోనే పోలింగ్ అధికారి అహ్మదుల్లాతో సహా అయిదు మంది రాయచోటి పట్టణంలో హతమయ్యారు. దిగువగొట్టివీడులో ఒకరు, అరవీడులో ఒకరు హతం అయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలిచాడు. మరుసటి సంవత్సరం అసెంబ్లీకి జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నాగిరెడ్డి గెలిచాడు.

అప్పటికే సలీంబ్రదర్స్ రాయచోటి వదిలిపెట్టి కడపలో ఉంటున్నారు. ముఠాకొట్లాటలలో ఈ ప్రవాసం మామూలే. ఒక్కొక్కసారి చంపిన వాళ్ళు, ఒక్కొక్కసారి చచ్చిన వాళ్ళు ఊరు విడిచిపెట్టి వెళ్ళిపోతుంటారు. అంతుకుముందు సంవత్సరం ఎన్నికలప్పుడు చెలరేగిన హింస పట్ల ప్రజలలో ఏర్పడిన అసహ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఉపఎన్నిక సమయంలో నాగిరెడ్డి సలీంబ్రదర్స్‌ను తిరిగి ఊరిలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేయలేదు. కానీ 1991 పార్లమెంట్ ఎన్నికలు వచ్చేసరికి సలీం వాళ్ళు లేకపోతే గడవదని భావించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మనుషులు వాళ్లను స్వయంగా వెంటబెట్టుకొని ఊరిలోకి తీసుకొచ్చాడు. వచ్చిన తరువాత వాళ్ళు కొలిమి బ్రదర్స్‌లో ఇద్దరిని (ఇనాయతుల్లా, నియామతుల్లా), ఆ వర్గానికి చెందిన ఇంకొక వ్యక్తిని 1991-92 సంవత్సరాలలో చంపారు. ఈ క్రమంలో రెండు కుటుంబాలూ ఊరువిడిచి వెళ్ళిపోయారు. సలీంబ్రదర్స్ కడపకూ, కొలిమిబ్రదర్స్ మద్రాసుకు పోయారు. అయితే ఇంతలో ఎంఎల్ఏ నాగిరెడ్డి కారుప్రమాదంలో చనిపోగా 1993లో రాయచోటి అసెంబ్లీకి ఉపఎన్నిక వచ్చింది. మళ్ళీ రెండు కుటుంబాల అవసరం తెలుగుదేశం వారికీ, కాంగ్రెస్ వారికీ వచ్చింది. ఎటొచ్చీ, నాగిరెడ్డి బ్రతికి ఉండగానే అతనికి సలీంబ్రదర్స్‌తో తేడాలు రావడం వల్ల ఇప్పుడు సంబంధాలు తలక్రిందులయ్యాయి. ఈసారి పాలకొండరాయుడు మనుషులు సలీంబ్రదర్స్‌ను, వైఎస్ మనుషులు కొలిమిబ్రదర్స్‌ను వెనక్కి తీసుకొచ్చారు. చాలా రిగ్గింగ్, దొంగ వోటింగ్ జరిగిన ఈ ఎన్నికలో వైఎస్ అనుచరుడు (కాంగ్రెస్ అభ్యర్థి) నారాయణ రెడ్డి గెలిచాడు.

క్లుప్తంగా చెప్పిన ఈకథ నుండి స్థానిక ముఠాకక్షలను ఏవిధంగా వాడుకుంటారో స్పష్టంగా అర్థం అవుతుంది. రెండు కుటుంబాల మధ్యనున్న ముఠాకక్ష రాజకీయ కక్షగామారితే, ప్రజలను భయభ్రాంతులుచేసి, బీభత్సం సృష్టించి, అ ముఠాల పోషకులయిన రాజకీయ నాయకులు తమ ఆధిపత్యం నిలబెట్టుకోవచ్చు. ఇది కేవలం ఎన్నికలలో గెలుపు ఓటములకు సంబంధించిన విషయం కాదు. 'ఫలాన ముఠావాళ్ళ నా మనుషులు జాగ్రత్త' అనే బెదిరింపు అన్ని రూపాలలోనూ రాజకీయ పెత్తనాన్ని నిలబెట్టుకోవడానికి ఉపయోగపడుతుంది. ఇతరుల ఆస్తులు కాజేయడానికి, కమీషన్ల పేరిట రౌడీ మామూలు వసూలు చేసుకోవడానికీ పనికొస్తుంది. సారా కాంట్రాక్టులూ సివిల్ కాంట్రాక్టులూ బెదిరించి చవగ్గా కొట్టేయడానికి పనికొస్తుంది. అటు ఆ కుటుంబాలకు కూడ సమాజంలో ప్రాబల్యం పెరుగుతుంది. ముఠాకొట్లాటకు రాజకీయ రంగు అంటుకుంటే అప్పటి వరకు అల్లరిమూకగా పరిగణించబడిన ముఠాలకు జెండాల అండ దొరకుతుంది. జిల్లా కేంద్రం నుండి రాష్ట్ర రాజధాని దాకా వాళ్లను కాపాడే వాళ్ళ తయారవుతారు. అసెంబ్లీకి కాకపోయినా అడపాదడపా మండలానికో మునిసిపాలిటీకో టిక్కెట్లు దొరుకుతాయి. తాము ఏ నాయకుడికయితే ఉపయోగపడతారో అతని నుండి పెద్ద మొత్తము డబ్బునుపొందవచ్చును. సలీం బ్రదర్స్‌కు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చాలా డబ్బులు ముట్టజెప్పాడు.

వాడుకునే వాడికీ, వాడుకోబడే వాడికీ ప్రయోజనాలున్నా, వాడుకోబడేవాడు చాలా నష్టపోతాడు. పాలకొండరాయుడు, నాగిరెడ్డి రెచ్చగొట్టి పెంచకపోతే రాయచోటిలో ఈరెండు ముస్లిం కుటుంబాల మధ్య ఘర్షణ ఇంతగా పెరిగేది కాదేమో. వాళ్ళ ఇంత పెద్ద సంఖ్యలో చనిపోయేవారు కాదేమో. పాలకొండ రాయుడు, నాగిరెడ్డి, నారాయణరెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ ముఠాకొట్లాటను పెంచి చాలా ప్రయోజనం పొందారు. చచ్చిపోయిన ఆ ముస్లిం యువకుల శవాల మీద తమ రాజకీయ సౌధాలు నిర్మించుకున్నారు. ఆ కుటుంబాలు మాత్రం కొంత ప్రయోజనంతోపాటు చాలా నష్టం చవిచూసాయి. సలీం వర్గానికి చెందిన 9 మందికి ఈ మధ్యనే కోర్టు జీవిత ఖైదు వేసింది. కానీ పూర్తిగా నష్టపోయేది ప్రజలు, ప్రజాస్వామ్య ప్రమాణాలు, సమాజం, సమాజపురోగతి. అందుకోసమే ఈ ఆవేదన .

# రాజకీయ ముఠాల ఆవిర్భావం

కడప జిల్లాలో ఈనాటి పాలెగాళ్ల పుట్టుక గురించి క్లుప్తంగా చెప్పాలంటే కొన్ని వాక్యాలలో చెప్పవచ్చు. స్వాతంత్రం వచ్చిన తరువాత కడప జిల్లా రాజకీయాలను శాసించిన మొదటి తరం రాజకీయ నాయకులను వెనక్కినెట్టి, 1970-80 మధ్య కాలంలో ఒక కొత్తతరం ముందుకొచ్చింది. వీళ్ల ముందు తరాన్ని ఓడించడానికి పెద్ద ఎత్తున ధనప్రయోగానికీ బలప్రయోగానికీ పాల్పడ్డారు. కడప జిల్లాలో ముందు నుండి నెలకొని ఉన్న ముఠా సంస్కృతిని తమ అవసరాలకు అనుగుణంగా వాడుకున్నారు. ముఠాకక్షలను పోషించారు, లేనిచోట కల్పించారు. తమ రాజకీయ అధిరోహణకోసం వాడుకున్నారు. వాళ్ల వాడుకున్న కొద్దీ ముఠాకక్షల సంస్కృతి పెరిగింది. వాళ్ల అధికారం చేజిక్కించుకున్న మేరకు అది అధికార సంస్కృతి అయి వర్ధిల్లింది. అధికార యంత్రాంగాన్ని తనకు లోబరచుకుంది.

ఈ క్రమానికి కొన్ని ఉదాహరణలు గత అధ్యాయంలో చూసాము. ఇక్కడ ఇంకొకటి చూసి, రాజకీయ ముఠా దౌర్జన్యాలకు ప్రధాన కేంద్రాలయిన ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల తాలూకాల కథలు తరువాతి అధ్యాయంలో వివరంగా చూద్దాం.

మైదుకూరు నియోజకవర్గం ఫాక్షన్ల ప్రభావం అంతగాలేని ప్రాంతం. అది కె.సి.కెనాల్ ఆయకట్టు ప్రాంతం కావడం దీనికి కారణం అని కొంతమంది అంటారు. ప్రధానంగా వేరుశెనగ పండించే మెట్ట తాలూకాలలో సంవత్సరంలో 9 నెలలు వ్యవసాయ పనులు ఉండవు. పని ఉన్న 3 నెలలు కూడ రైతు చేని దగ్గరే ఉండవలసిన అవసరం ఉండదు. కొట్లాటలు పెట్టుకునే తీరిక ఉంటుంది. నీటిపారుదల వసతులు వచ్చి భూములు మాగాణులయితే కొట్లాడుకునే తీరిక ఉండదు. కాబట్టి ముఠాకొట్లాటలు ఉండవంటారు. ఇది ఆకర్షణీయమయిన వాదనే గానీ సందేహాస్పదమయింది. కేవలం తీరుబడి ఎక్కువ ఉండడం వల్లనే ముఠాకొట్లాటల సంస్కృతి పుట్టి ఉంటే ఈ వివరణ సమంజసమైనదే. కానీ అదే కారణమయితే రైతులకు, కూలీలకు చాలా తీరిక ఉండే మెట్ట ప్రాంతాలు దేశంలో అన్ని చోట్లా ఉన్నాయి. అయితే అవన్నీ పులివెందులలూ, కోవెల కుంట్లలూ కాలేదు.

కారణం ఏమయితేనేం. మైదుకూరు నియోజక వర్గం పెద్దగా ముఠాకొట్లాటల ప్రాబల్యం ఉన్నప్రాంతం కాదు. పాత కాలంలో కొద్ది గ్రామాలలో మాత్రం ముఠా ఘర్షణలుండేవి. అయితే 1983 నుండి మైదుకూరు అసెంబ్లీకి మార్చి మార్చి గెలుస్తున్న డి.ఎల్. రవీంద్రరెడ్డి, రఘురామిరెడ్ల రాజకీయవైరం పుణ్యాన గత దశాబ్దకాలంలో అక్కడ ఫాక్షన్ వాతావరణం పెరిగింది. ఖాజీపేట, బ్రహ్మంగారి మఠం, దువ్వూరు మండలాలలోఫాక్షన్లు పెరిగాయి. బాంబుదాడులు, హత్యలు జరిగాయి.

డాక్టర్ రవీంద్రారెడ్డి స్వగ్రామం సుంకేసుల (ఖాజీపేట మండలం). అతని తండ్రి అప్పన్నపల్లి గ్రామానికి 'రెడ్డి'. ఆయనకు అప్పన్నపల్లి కరణం సత్యనారాయణరావుతో ఘర్షణ ఉండింది. రఘురామిరెడ్డి రవీంద్రరెడ్డితో రాజకీయాలలో పోటీకి దిగిన తరువాత సత్యనారాయణరావును ప్రోత్సహించసాగాడు.ఈ క్రమంలో రవీంద్రరెడ్డి అన్నకొడుకు లోకేంద్రరెడ్డి హతమయ్యాడు. రెడ్డి-కరణంల ఫాక్షన్ ఈవిధంగా నియోజకవర్గ రాజకీయాలలోకి ప్రవేశించింది. మరికొన్ని గ్రామాల ముఠాకొట్లాటలలో కూడ వీరిద్దరూ చెరొక పక్షం తీసుకొని ప్రోత్సహించడం వల్ల ఆ ఫాక్షన్‌లు కూడ పెరిగి విజృంభించి నియోజకవర్గ రాజకీయాలలో భాగమయ్యాయి. ఆ నాయకులిద్దరి ఎదుగుదలకు కావలసిన బీభత్స ప్రాతిపదిక ఏర్పడింది.

అటువంటి గ్రామాలలో సోమయాజులపల్లి ఒకటి. ఆ ఊరిలో శీర్ల నాగయ్య, శీర్ల నాగసుబ్బయ్య అనే ఇద్దరు యాదవ (గొల్ల) కులస్తులకు ముఠాకొట్లాటలున్నాయి. ఇద్దరూ కొద్దిపాటి మాగాణి ఉన్న మధ్యతరగతి రైతులే. వివరాలు స్పష్టంగా తెలుసుకోనడం సాధ్యం కాని లైంగిక ఘర్షణలేవో వీరికొట్లాటకు మూలం. 1985 నవంబర్ 19న నాగసుబ్బయ్య తమ్ముడు వెంకట సుబ్బయ్యను నాగయ్య మనుషులు చంపారు. దీనితో ఇరువర్గాలకు ఫాక్షన్ ప్రారంభం అయింది. నాగయ్యను రఘురామిరెడ్డి, నాగసుబ్బయ్యను రవీంద్రారెడ్డి చేరదీసారు. వెంకటసుబ్బయ్య హత్యకు ప్రతీకార యత్నం 1987 ఫిబ్రవరి 20న జరిగింది. హత్య కేసులో ముద్దాయిలు ప్రొద్దుటూరు కోర్టుకు పోవలసిన ఆరోజున నాగసుబ్బయ్య వర్గంవారు గడ్డంవారి సత్రం దగ్గర వంకలో దాక్కొని దాడి చేయడానికి సిద్ధమయ్యారు. అయితే వాళ్ళు నియమించిన సెంట్రీ సకాలంలోనే ఈల వేసినప్పటికీ శ్రీరామచంద్రుని గుడి మైక్ శబ్దంలో అది వినబడలేదు. కేసు ముద్దాయిలు సురక్షితంగా గడ్డంవారి సత్రం బస్‌స్టేషన్ చేరుకున్నారు. ఈ విషయం వంకలో దాక్కున్న వాళ్ళు ఆలస్యంగా గ్రహించి స్టేజి దగ్గరికి వచ్చి బాంబులతో, తుపాకులతో దాడిచేసారు. అసలు మనుషులు తప్పించుకున్నారు కానీ గడ్డంవారి సత్రానికి చెందిన కచ్చెట్టి చంద్రఓబుల్ రెడ్డి (20), చంద్రావతి(6) చనిపోయారు. పట్టువదలని నాగసుబ్బయ్య మనుషులు 1988 అక్టోబరు 10న పెద్ద గుంపుగా పోయి సోమయాజులపల్లి పైన దాడిచేసి బాంబుల వర్షం కురిపించి నాగయ్య వర్గానికి చెందిన అయిదుగురు యాదవులను చంపారు. 1989 లో రవీంద్రరెడ్డి ఎంఎల్ఏ అయిన తరువాత అతని ప్రోత్సాహంతో ఇరువర్గాలకూ రాజీ అయింది. నాగసుబ్బయ్య వర్గం నాగయ్య వర్గానికి 1 లక్ష 25 వేలు చెల్లించి ఇరుపక్షాలూ కోర్టుకేసులలో సాక్ష్యం చెప్పకూడదని ఒప్పందం చేసుకున్నారు. అయినప్పటికీ భయంపోక ఇరు ముఠాల ముఖ్యులూ ఊరు విడిచిపెట్టి వెళ్లిపోయారు. నాగసుబ్బయ్య కడపలో, నాగయ్య మైదుకూరులో స్థిరపడ్డారు. వాళ్లిద్దరి జీవితాలు నాశనం అయ్యాయి. కానీ వాళ్ల పోషకుల రాజకీయాలు వర్ధిల్లుతున్నాయి.

గ్రామీణ ముఠా కక్షలు ప్రబలంగా ఉండిన జమ్మలమడుగు, పులివెందుల, ప్రొద్దుటూరులలో ఈరకంగా రాజకీయాలలో ఎదగడం కొత్తతరం నాయకులకు చాలా సులభం అయింది. వాళ్ల దూకుడుకు దౌర్జన్యానికీ తట్టుకోలేక పాతతరం ఓడిపోయి పక్కకు తప్పుకుంది. ఆ తరువాత ఈ కొత్తతరం నాయకుల మధ్య ప్రబలిన పోటీ వల్ల, వారి పోషణలో వర్ధిల్లిన రెండవ శ్రేణి నాయకుల మధ్య పెచ్చరిల్లిన కక్షల వల్ల, జిల్లాలో ముఠా సంస్కృతి బాగా ముదిరింది. 1980 ల నుండి సారాయి వ్యాపారం ఈ నాయకుల పాలిటి కల్పవృక్షం అయింది. ముఠా దౌర్జన్యంతో సారావ్యాపారంపైన గుత్తాధిపత్యం నెలకొల్పి, లక్షలాది రూపాయల ఆదాయం సంపాదించుకున్నారు. ఆ ఆదాయంతో రాజకీయాలలో నిలదొక్కుకోవడం, విస్తరించడం వారికి సులభం అయింది. ముఠాల పోషణ సులభం అయింది. ముఠాలు, ముఠాదౌర్జన్యాలు మరింత బలపడ్డాయి. సారాయి వ్యాపారం లాగే సివిల్ కాంట్రాక్టులపైన గుత్తాధిపత్యం సివిల్ కాంట్రాక్టులలో కమీషన్లు, ముఠా దౌర్జన్యాల వల్ల సాధ్యం అయ్యాయి. తిరిగి ముఠాలను బలపరచాయి. జిల్లా సామాజిక జీవితంలో ఒక విచిత్రమయిన సంప్రదాయంగా ఉండిన ఫాక్షన్ వ్యవస్థ ఎదిగి ఎదిగి జిల్లా రాజకీయాలను, అధికార యంత్రాంగాన్నీ, సమస్త సామాజిక జీవిత రంగాలనూ తనకు లోబరచుకుంది. ఆ దశాబ్దం చివరినాటికి దాని ప్రతిధ్వని హైదరాబాద్‌లోనూ వినిపించసాగింది.

ముఠాకక్షలు గ్రామస్థాయికే పరిమితం అయిన రోజులలో వాటి ప్రత్యక్ష లక్ష్యం ఆస్తి సంపాదన కాదు. రాజకీయ అధికారం కాదు. అప్పట్లో అది ప్రధానంగా ఊరిలో పెద్దరికం కోసం, ప్రతిష్ఠకోసం జరిగిన పోటీ. పైన చెప్పినట్టు బ్రిటీష్ ప్రభుత్వ రికార్డుల ప్రకారం, పెద్దవాళ్ల జ్ఞాపకాల ప్రకారం, గ్రామపాలనా వ్యవస్థలో ముఖ్యుడయిన 'రెడ్డి' పెత్తనాన్ని ఎదిరించి ఊరిలో మరొకరు పెత్తనం తనదేనని ముందుకు రావడం చాలా గ్రామాలలో ముఠా కక్షలకు ప్రధాన హేతువు. ఒకసారి కక్షలు మొదలయితే, గ్రామంలోని ఇతర వైరుధ్యాలు ఆ కక్షలలో భాగం అవుతాయి. గ్రామంలో ఎవరయినా ఇద్దరికి ఆస్తి తగాదా ఉంటే ఒకరు ఒక పెత్తందారును, వేరొకరు ఇంకొక పెత్తందారును ఆశ్రయిస్తారు. లేదా పెత్తందార్లే తమ దగ్గరికి రప్పించుకుంటారు. ఒక సమస్యను ఒక పెత్తందారు పరిష్కరిస్తే, ఆ పరిష్కారం వల్ల (న్యాయంగానో, అన్యాయంగానో) నష్టపోయిన వాళ్లు రెండవ పెత్తందారు పంచన చేరుతారు. ఒక కులానికీ మరొక కులానికీ గ్రామ సామాజిక వ్యవస్థలోవైరుధ్యం ఉంటే ఒక కులం ఒక ముఠా నాయకుడికి చేరువవుతుంది. రెండవ కులం అతని ప్రత్యర్థికి చేరువవుతుంది. చేరువ కావాలన్న ఆలోచన వాళ్లకు రాకపోతే ముఠా నాయకులే జోక్యం చేసుకొని చేరదీస్తారు. ఈవిధంగా ఇద్దరు వ్యక్తుల మధ్య పెత్తనం కోసం మొదలయిన ఘర్షణ గ్రామ సామాజిక జీవితంలో చీలికకు దారి తీస్తుంది. కొన్ని కుటుంబాలు ఒక ముఠా వైపు, కొన్ని కుటుంబాలు మరొక ముఠావైపు చీలుతాయి. ఏ ముఠాకూ చెందని వారు ఇద్దరికీ చెడుకాకుండా జాగ్రత్తగా

బ్రతుకుతారు. ముఠాకక్షలు బలంగా ఉన్న గ్రామాలలో ఆ ఘర్షణ తప్ప వేరే నేరాలుగానీ అల్లర్లుగానీ ఉండనని ఒక అనుభవజ్ఞుడు అంటాడు. ఎందుకంటే వేరే ఏదయినా (ఒక మామూలు దొంగతనంతో సహా) జరిగితే అది ముఠాకొట్లాటలో భాగం అయిపోతుంది. ఫాక్షన్‌లో కలిసిపోతుంది.

అప్పట్లో గ్రామీణ ముఠా ఘర్షణలలో సాంప్రదాయిక ఆయుధాలే ఎక్కువగా వాడేవారు. గొడ్డళ్లు, వేటకొడవళ్లు, బరిసెలు, ఉపయోగించేవారు. ఎప్పుడైనా తుపాకుల ప్రయోగం జరిగేది. బాంబుల ప్రయోగం ఈమధ్య వచ్చిన అలవాటే. 1972 లో జమ్మలమడుగు తాలూకాలోని పెద్దబసుపులలో కామన పుల్లారెడ్డిని సిపిఐ తో సంబంధం ఉన్న వ్యక్తులు శక్తివంతమయిన బాంబువేసి చంపారు. అది మొదటి సంఘటన. అయితే పెద్ద ఎత్తున బాంబులు ప్రయోగించే అలవాటు 1980 తరువాతే ప్రబలింది. కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో మొదలయి కడపకు వేగంగా పాకింది. ఇప్పుడు బాంబుల వాడకం ఎంత మామూలు విషయం అయిపోయిందంటే అవి లేని రోజు ఉండిందా అని ఆశ్చర్యపోవాలి. తుపాకుల సంఖ్యకూడ 1980లలోనే పెరిగింది. చట్టవిరుద్ధంగాతయారయ్యే వాటికిచట్టబద్ధంగా పొందే లైసెన్స్ తుపాకులు తోడయ్యాయి. మొదట్లో జిల్లా కలెక్టర్, ఎస్‌పి ల రిపోర్టుపైన ఆధారపడి తుపాకి లైసెన్స్ ఇచ్చేవారు. కానీ 1980ల చివరి సంవత్సరాలలో (తెలుగు దేశం పాలనలో) స్థానిక విచారణ లేకుండ రాష్ట్ర ప్రభుత్వం నేరుగా తుపాకి లైసెన్స్‌లు ఇవ్వసాగింది. ఇది 1986 లేక 1987 లో మొదలయిందంటారు. హైదరాబాద్‌లో పైరవీ చేసుకొని, లంచాలు ముట్టచెప్పి, అనర్హులు కూడ తుపాకి లైసెన్స్‌లు పొందే పరిస్థితి ఏర్పడింది. తరువాత వచ్చిన కాంగ్రెస్ పాలనలో ఇది కొనసాగింది. రంగయ్యనాయుడు హోంసెక్రెటరీగా ఉన్న రోజులలోను, ఆ తరువాత మైసూరారెడ్డి హోంమంత్రిగా ఉన్న రోజులలోను విచ్చల విడిగా తుపాకి లైసెన్స్‌లు ఇచ్చారు. కొందరికి రాజకీయ కారణాల వల్ల ఇచ్చారు. కొందరికి డబ్బులు తీసుకొని ఇచ్చారు. మొత్తానికి ఆత్మరక్షణ పేరు చెప్పి అధికారికంగా తుపాకి తెచ్చుకొని బెదిరించి బ్రతికే అవకాశం ఏర్పడింది.

'ఒక హత్య జరుగుతుంది. పోలీసులు కేసు పెట్టగానే ముద్దాయిలు హైదరాబాదుకుపోయి నాయకులను పట్టుకొని, డబ్బులవసరమైతే ఇచ్చి, తమ పైన పోలీసులు తప్పుడు కేసులు పెట్టడం వల్ల తమకు ప్రాణాపాయం ఏర్పడిందని చెప్పి తుపాకి లైసెన్స్ తెచ్చుకుంటారు.' అని ఒక పరిశీలకుడు అంటాడు. దీనిఫలితంగా హత్యలు పెరిగే కొద్దీ జిల్లాలో తుపాకీ లైసెన్స్‌లు కూడ పెరిగాయి. ముఠానాయకులకు ఈసేవ చేసినందుకే కాబోలు రంగయ్య నాయుడుకు రిటైర్డ్ అయిన తరువాత పార్లమెంట్‌కు కాంగ్రెస్ టిక్కెట్ దొరికింది. గెలవగానే కేంద్రంలో మంత్రి పదవి దక్కింది. (ఇప్పుడాయన రాష్ట్రానికి వచ్చినప్పుడు రాజకీయాలలో నైతిక విలువల గురించి ఉపన్యాసాలు ఇస్తుంటాడు.) 1994లో

రాష్ట్ర ప్రభుత్వం తుపాకీ లైసెన్స్‌లన్నీ సస్పెండ్ చేసే నాటికి కడప జిల్లాలో 1431 లైసెన్స్‌లున్నాయని ఒక పోలీస్ అధికారి అంటాడు. ఒక్క జమ్మలమడుగు తాలూకాలోనే 500 దాకా ఉంటాయని అనధికార అంచనా. తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు శివారెడ్డి తన అనుచరులందరికీ లైసెన్స్‌లు ఇప్పించుకుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత వాళ్ల ప్రత్యర్థులందరికీ వైఎస్ రాజశేఖరరెడ్డి ఇప్పించాడు. లైసెన్స్‌లేని తుపాకులకు సరయిన లెక్కేలేదు. లైసెన్స్ తుపాకులకు మూడు రెట్లు ఉంటాయని అదే పోలీస్ అధికారి అంచనా. నిజానికి లైసెన్స్‌తుపాకులు పాలెగాడి హోదాను చూపించే ఆభరణం మాత్రమే. తుపాకులు పట్టుకొని జీపులో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులు చేయడానికే అవి పనికొచ్చాయి. హత్యలు చేసేది అధికంగా బాంబులతో, గొడ్డళ్లతో, వేట కొడవళ్లతో, నాటు తుపాకులతో.

తొలినాటి గ్రామీణ ముఠాకక్షలు వల్ల లాభపడిన వాళ్ళు తక్కువ. ఒక పక్షాన్ని మరోపక్షం పూర్తిగా అణచివేసి వాళ్ల ఆస్తులు స్వాధీనం చేసుకున్న సందర్భాలున్నాయి. ముఠా ప్రాబల్యాన్ని అడ్డం పెట్టుకుని యితరుల ఆస్తులను స్వంతం చేసుకున్న సంఘటనలు కూడా వున్నాయి. అయితే మొత్తం మీద ఫాక్షన్ పెడితే నష్టమే ఎక్కువ. కేసుల కోసం ఖర్చవుతుంది. అప్పుడప్పుడు వూరు విడిచిపెట్టి ప్రవాసం పోవలసి ఉంటుంది. దానికి ఖర్చవుతుంది. కొట్లాటల వలన వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయడం జరుగుతుంది. అది కూడా నష్టమే. ఒకరి యిళ్లు ఒకరు తగలబెట్టుకోవడం, పొలాలు బీడుపెట్టడం, తోటలు నరుక్కోవడం తరచుగా జరుగుతుంటుంది. ఇటువంటి నష్టాలు, ఖర్చులు అనేకం వుంటాయి. ముఠా కొట్లాటలకి దిగితే అభద్రత చాలా పెరుగుతుంది. ప్రాణాలు కాపాడుకోవడం ప్రధాన సమస్య అవుతుంది. ఇంట్లో ఎవరికైనా బయటి ఊరిలో మంచి వుద్యోగం వచ్చినా, కాలేజీలో సీటు వచ్చినా పంపించడానికి భయపడతారు. వచ్చేటపుడు, పోయేటపుడు దారికాసి చంపుతారని భయం. దీని వలన కుటుంబం అభివృద్ధి కుంటుపడుతుంది.

ఉదాహరణగా పులివెందుల తాలూకా లింగాల మండలంలోని అంబకపల్లిని తీసుకోవచ్చు. ఆ ఊరిలో 1947 నాటికి గ్రామ 'రెడ్డి' అయిన మస్తాన్ రెడ్డికి, ముద్దిగారి వెంగళరెడ్డి అనే మరొక రైతుకు గ్రామపెత్తనం కోసం ఫాక్షన్ వుండింది. పంచాయత్‌రాజ్ వ్యవస్థ రావడంతో ఈ ఫాక్షన్‌లోకి పంచాయతీ రాజకీయాలు ప్రవేశించాయి. వై.ఎస్. రాజారెడ్డి ప్రతి ఎన్నికలోను రాజీ ప్రయత్నంచేస్తూ వచ్చాడు. వీళ్లు అప్పుడప్పుడూ రాజీ పడుతూ అప్పుడప్పుడూ చంపుకుంటున్నారు, బాంబుదాడులు చేసుకుంటున్నారు. తొలితరం గడిచిపోయిన తరువాత వెంగళరెడ్డి కుమారుడు బాలిరెడ్డికి, వెంగళరెడ్డి హత్య కేసులో ఒక ముద్దాయి అయిన శంకర నారాయణ రెడ్డి తమ్ముడు మనోహర రెడ్డికి ఫాక్షన్ కొనసాగింది. గ్రామంలో వున్నది 250 ఇళ్లు కాగా అందులో 50 ఇళ్లు ఒకవైపు, 50 ఇళ్లు రెండోవైపు చేరాయి. బాంబులు రంగంలోకి రాకముందు ఇళ్ల పైకెక్కి రాళ్లు విసురుకునేది. 1981 లో

ఆళ్లగడ్డ నుండి బాంబులు దిగుమతి అయినాక ఇళ్లపైకెక్కి బాంబులు వేసుకోసాగారు. 1969-72 కాలంలో ఊరిలో ప్యూనిటివ్ పోలీస్ క్యాంపు వుండింది. ఇరువర్గాల మీద మొత్తం 55 కేసులు నమోదయ్యాయి. అందులో పది హత్య కేసులు. 1971 లో వెంగళరెడ్డి హత్య కావడంతో హత్యాకాండ మొదలయింది. ఆ పక్షంవారు నలుగురు, ప్రతిపక్షంవారు ఆరుగురు చనిపోయారు. అందులో ఒకరు ముస్లిం, ఒకరు వాల్మీకి కాగా మిగిలిన వాళ్ళందరూ రెడ్లు, జిల్లా రాజకీయనాయకులు ఈ ఊరి ముఠా కొట్లాటలలో జోక్యం చేసుకోవడం మొదలు పెట్టిన తరువాత వెంగళ రెడ్డి వర్గాన్ని జిల్లాపరిషత్ ఛైర్మన్ డి.ఎన్.రెడ్డి, ప్రత్యర్థి వర్గాన్ని వై.ఎస్. కుటుంబం చేరదీశారు. పులివెందుల రాజకీయాలలో డి.ఎన్.రెడ్డి, వై.ఎస్. రాజశేఖరరెడ్డికి దాసోహం అన్న తరువాత అంబకపల్లిలో ఇరువర్గాలూ వై.ఎస్. అనుచరులే. చంపుకున్నా, రాజీపడినా వై.ఎస్. మనుషులే. ఈ రెండు కుటుంబాలూ పెద్దగా ఉన్నవాళ్ల కాదు. వెంగళరెడ్డి కొడుకు బాలిరెడ్డికి 20 ఎకరాలు, అతని ప్రత్యర్థి మనోహరరెడ్డికి 15 ఎకరాలు వున్నాయి. అయితే గత 20 ఏళ్లలో చెరి పది లక్షల రూపాయలు ఖర్చు పెట్టుకున్నారు. ఇరువైపులా ముఖ్యులు సివిల్ కాంట్రాక్టులు చేస్తారు కాని ప్రాణభయం వల్ల ఎవరూ ఊరినుండి ఒంటరిగా పోలేరు, రాలేరు. గుంపులుగానే తిరగాలి. ఇది వారి ఆర్థిక కార్యకలాపాలకు అవరోధం. ఇరుపక్షాలలో యువకులెవ్వరూ ఊరి బయట ఉద్యోగాలకు పోలేదు. ఉద్యోగం చేసుకుంటూ బయట ఉంటే భద్రత వుండదు. ఒకవేళ చదువుకొని ఉద్యోగ అర్హత పొందిన యువకులెవరైనా ఉంటే, అవతలి పక్షం ఏదో ఒక హత్య కేసులో అటువంటి యువకులను ముద్దాయిలుగా ఇరికించేస్తారు. హత్యకేసులో ముద్దాయి అయినవాడు ఏ రోజైనా ప్రతీకారానికి గురి కావొచ్చు కాబట్టి ముద్దాయిలైనవారు ఉద్యోగాలకు పోరు. ఉద్యోగాల దాకా ఎందుకు, చదువుకోవడానికి కూడా దూరప్రాంతాలకు పోవడానికి తటపటాయించే పరిస్థితి అంబకపల్లిలో ఉండింది. ఇరుర్గాలలో ముగ్గురు మాత్రమే కాలేజి చదువులు చదువుకున్నారు.

ఇదంతా చదివితే గ్రామీణ ఫాక్షనిస్టుల మీద సానుభూతి కలుగుతుందేమో! వాళ్ల ముఠా దౌర్జన్యాల వల్ల గ్రామంలోని సామాన్య జనం ఎంతగా భీతికి గురవుతారో, గ్రామ సామాజిక జీవితం ఎంతటి భయాందోళనలకు లోనై వుంటుందో జ్ఞాపకం చేసుకోవడం మంచిది. అయితే గ్రామీణ ఫాక్షనిస్టులు తమ ముఠా కొట్లాటల వల్ల జనాన్ని భయపెట్టి పెత్తనం నిలబెట్టుకున్నారే గాని ఆర్థికంగా లబ్ధి పొందింది తక్కువేననేది సత్యం. తొలినాడు ఫాక్షనిస్టు అనేవాడు మూర్ఖుడిగా, బుద్ధిహీనుడిగా పరిగణించబడేవాడు.

ముఠా దౌర్జన్యాలు గ్రామం పరిధి దాటి రాజకీయ అధికారం, సివిల్ కాంట్రాక్టులు, సారాయి కాంట్రాక్టులలోకి విస్తరించిన తర్వాతే ఫాక్షన్ అనేది ఆర్థికంగానూ; ఇతరత్రాను లబ్ధి పొందడానికి ఒక మార్గమైంది. గ్రామ పంచాయతీ వ్యవస్థ రావడంతోనే ఈ విషయం ముఠాదారులకు అర్థమైంది. ఫాక్షన్ గ్రామాలలోని కొట్లాటలన్నీ పంచాయతీ ఎన్నికల

కొట్లాటలుగా మారాయి. ప్రతి పంచాయతీ ఎన్నికలలోను అవి చెలరేగి విజృభించాయి. ముఠా కొట్లాటలు లేని వూర్లలో కూడా పంచాయతీ ఎన్నికలతో ముఠాలు పుట్టాయి. కాని గ్రామరాజకీయాలను దాటి సమితి, అసెంబ్లీ రాజకీయాల లోనికీ, నాపరాయి గనుల లోనికీ, సివిల్ కాంట్రాక్టుల లోనికీ, సారాయి వ్యాపారం లోనికీ ఫాక్షన్లు ప్రవేశించిన తర్వాత గాని అవి సంపాదనకు, హోదాకు ఎంత శక్తివంతమైన సాధనాలుగా ఉపకరించగలవో పూర్తిగా అర్థం కాలేదు. అర్థమైన తర్వాత యింక ముఠాల్ని ఆపేవాళ్లు లేకుండా పోయారు. అవి మొత్తం కడప జిల్లా సామాజిక జీవితాన్నే శాసించసాగాయి.

1970 దాకా జిల్లాలో రాజకీయ నాయకులుగా పేరుపొందిన ముఖ్యులెవ్వరూ స్వయంగా ఫాక్షనిస్టులుకారు. తమ అనుచరులు ఫాక్షనిస్టులయితే వారికి సహాయం చేసేవారు. కాని గ్రామీణ ఫాక్షన్లలో స్వయంగా జోక్యం చేసుకునేవారు కారు. ఫాక్షన్లు పెట్టమని ప్రోత్సహించేవారు కారు. బసిరెడ్డి, ఆదినారాయణ రెడ్డి స్వాతంత్ర్యానంతరం జిల్లాలో ప్రముఖ కాంగ్రెస్ నాయకులు. వారి మధ్య రాజకీయ వైరం ఉండింది. సి.పి.ఐ నాయకుడు ఈశ్వరరెడ్డి దానిని ఆసరా చేసుకుని నాలుగుసార్లు పార్లమెంటుకు ఎన్నికయ్యాడు. కాని ఆ వైరం హింసాత్మక రూపం తీసుకోలేదు. గ్రామాలలో ఒకరి అనుచరులను అణచడానికి మరొకర్ని హింసకు పాల్పడమని ప్రోత్సహించే దుష్ట సంప్రదాయం అప్పట్లో లేదు. తమ రాజకీయ లబ్ధి కోసం గ్రామాలలో ఫాక్షన్లు పెట్టించే నీచపు స్థాయికి మొదటితరం కాంగ్రెస్ నాయకులు దిగజారలేదు. దాని అర్థం వాళ్లందరూ అహింసావాదులనీ, సన్మార్గులనీ కాదు. కొందరికి మంచి పేరు వుండింది. కాని అందరికీ లేదు. వాళ్లస్థాయిలో, వాళ్ల పద్ధతిలో వాళ్లు గ్రూపు రాజకీయాలకు, రాజకీయ కుట్రలకు పాల్పడ్డారు. వాళ్లలో కొంతమంది తమ ప్రాంతాలలో చాలా ఫ్యూడల్ పెత్తనం చెలాయించారు. తమను వ్యతిరేకించిన వాళ్లపైన బలప్రయోగానికి పాల్పడ్డారు. కాని అది ఒక పరిమితికి లోబడి వుండింది. ముఠా హింసను అదే పనిగా ప్రోత్సహించి, తాము స్వయంగా ఫాక్షన్లు పెట్టి తమ రాజకీయ పురోగతికి పీనుగుల సోపానం వేసుకున్న ఘనత ఆ తరువాతి తరం నాయకులకే దక్కింది. ప్రొద్దుటూరులో ఎం.వి. రమణారెడ్డి జమ్మలమడుగులో, గుండ్లకుంట శివారెడ్డి, పులివెందులలో వై.ఎస్ రాజశేఖరరెడ్డి ఈ వరవడి వేశారు. తమ ఎదుగుదలకు అడ్డం వచ్చిన పాతతరం నాయకులను ఓడించడానికి ఈ ముగ్గురూ హింసాత్మక ముఠా రాజకీయాలను ఉద్దేశ్యపూర్వకంగా ఆశ్రయించారు. ఆ తర్వాత తమ మధ్య పోటీలో దానిని కొనసాగించారు. అందులో భాగంగా జిల్లాలో ఊరూరా ముఠాకక్షలు పెచ్చరిల్లాయి. రాజశేఖరరెడ్డి అయితే తన హింసాత్మక ప్రాబల్యాన్ని అనంతపురం జిల్లాకు కూడా తీసుకుపోయాడు.

వీరి బలప్రయోగ పథకానికి అభ్యుదయం రంగు కొంత లేకపోలేదు. ముఠా రాజకీయాలకు మద్దతు పొందడానికి ఈ రంగు బాగానే పనికొచ్చింది. రమణారెడ్డి తన

కార్మిక రైతు సంఘాల ఉనికిని భూస్వామ్య పెట్టుబడిదారీ వర్గాల దాడుల నుండి కాపాడుకోవడానికే తాను హింసాత్మక ఎత్తుగడలు ఎంచుకున్నట్టు చెబుతాడు. ఈరోజు అతని మాటలు నమ్మేవారెవరూ లేరు. కాని మొదట్లో కొంతకాలం కొంతమందిని నమ్మించగలిగాడు. క్రమంగా అతని నాయకత్వంలో ఒక దౌర్జన్యకర ముఠా తయారై ప్రొద్దుటూరును 'క్రిమినల్ టౌన్' గా మార్చింది. అతనికి వ్యతిరేకంగా వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి, వరదరాజులు రెడ్డిని ప్రోత్సహించడంతో ఈ రెండుముఠాల మధ్య ఘర్షణ ఏ అభ్యుదయ లక్షణమూ లేని ఫాక్షన్ కొట్లాట రూపం తీసుకుంది. రమణారెడ్డి ఏ కార్మిక రైతుసంఘాల పేరుమీద హింస మొదలుపెట్టాడో అవన్నీ పక్కకు పోయి వీరి ఫాక్షన్ కొట్లాటలో సారాయి వ్యాపారం, ఎన్నికల అక్రమాలు, రౌడీ మామూళ్ళు, ప్రొద్దుటూరు వీధుల్లో కర్రపెత్తనం ప్రధాన విషయాలయ్యాయి.

వై.యస్. తండ్రీతనయులు పులివెందులలో ఎదుర్కొన్నది డాక్టర్ డి.ఎన్. రెడ్డి ప్రాబల్యాన్ని. డి.ఎన్. రెడ్డి చాలా ఫ్యూడల్ స్వభావం గల నాయకుడు. కొంతకాలం కడప జిల్లాపరిషత్ ఛైర్మన్‌గా వున్నాడు, తర్వాత ఎం.పి అయ్యాడు. అతని ఫ్యూడల్ అహంకారానికి ఒక ఉదాహరణ చెపుతారు. అతని యింటి వరండాలో ఎప్పుడూ ఒకే కుర్చీ వుండేదట. అతనిని చూడడానికి ఎవరు వచ్చినా నిలబడి మాట్లాడవలసిందే. ఎవర్నీ తనతో సమానంగా చూసేవాడు కాదు. అతని ఫ్యూడల్ పెత్తనాన్ని వ్యతిరేకించడంలో వై.యస్. కుటుంబానికి కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ) సహకరించింది. రాజారెడ్డి అప్పట్లో ఒక మామూలు రైతు, చిన్న కాంట్రాక్టరు. డి.ఎన్. రెడ్డిని ఎదుర్కోవడానికి కావల్సిన జోరు అతనిలో వుందని సి.పి.ఐ భావించి అతనికి సహకరించింది. 1971 పంచాయతీ ఎన్నికలలో పులివెందులలో డి.ఎన్. రెడ్డి అభ్యర్థులకు వ్యతిరేకంగా వై.ఎస్ కుటుంబం సి.పి.ఐ సహకారంతో పోటీ చేసింది. రాజారెడ్డి, రాజారెడ్డి భార్య, ఇతర కుటుంబ సభ్యులు వార్డ్‌మెంబర్లుగా పోటీ చేసారు. మెజారిటీ వార్డ్‌లు గెలుచుకుంటే సర్పంచ్ పదవి దక్కించుకోవచ్చునని ఆశించారు. వీళ్ల ఎన్నికల ఏజెంట్ సిపిఐ కార్యకర్త. అయితే 6 వార్డులు వీళ్లకురాగా, 7 వార్డులు డి.ఎన్ రెడ్డి మనుషులకు వచ్చాయి. సిపిఐ కీ వై.ఎస్ కుటుంబానికీ ఆరోజులలో ఉన్నసంబంధం కేవలం ఈ ఒక్క ఎన్నికకు పరిమితం కాదు. పులివెందుల తాలూకాలో మొట్టమొదటి నుండి సిపిఐ ప్రభావం ఉండింది. ఆ తాలూకాలో భూస్వామ్య పెత్తనం చలాయించిన డి.ఎన్.రెడ్డికి సిపిఐ సహజంగానే వ్యతిరేకం అయింది. అయితే డి.ఎన్.రెడ్డిని ఎదుర్కోవడానికి అవసరమయినంత బలం సిపిఐకి లేదు. ఫ్యూడల్ పెత్తనం చలాయించిన కాంగ్రెస్ నాయకులనూ, భూస్వాములనూ ఎదుర్కొనడానికి తన బలం సరిపోని చోట, వారిని ఎదుర్కొనే సత్తావున్న వాళ్లకు మద్దతు ఇచ్చే ఎత్తుగడ సిపిఐ ఆ రోజులలో అనుసరించింది. ముఠా రాజకీయ సంస్కృతి ప్రబలంగా ఉన్నచోట ఈ ఎత్తుగడ ముఠాకక్షలకు దోహదం చేస్తుందని ఆ పార్టీ నాయకులు అర్థం చేసుకున్నట్టు లేదు. ఈ

క్రమంలో డి.ఎన్. రెడ్డి పైన జరిపిన పోరాటంలో సిపిఐ, వై.యస్ రాజారెడ్డి పరస్పరం సహకరించుకున్నారు. 1978 తరువాత డి.ఎన్. రెడ్డి ఆధిపత్యాన్ని తెరమరుగు చేయడంలో కృతకృత్యులైన వై.ఎస్ తండ్రీ తనయులు ఆ ఆధిపత్యాన్ని తలదన్నే హింసాత్మక పెత్తనాన్ని పులివెందులలో నెలకొల్పారు. ఈరోజు కమ్యూనిస్టుల ప్రభావం పులివెందులలో దాదాపు లేదనే చెప్పాలి.

జమ్మలమడుగులో శివారెడ్డి పైకి రావడానికి కూడ ఇదే తర్కం పనిచేసింది. 1970 లలో జమ్మలమడుగు సమితి ప్రసిడెంట్‌గా ఉండిన తాతిరెడ్డి పుల్లారెడ్డి చాలా ఫ్యూడల్ స్వభావం గల నాయకుడు. 'పుల్లారెడ్డి పొద్దున్న పేపర్ పట్టుకుంటే ఆయన కోసం వచ్చిన వాడు గంటలసేపు నిలబడ వలసిందే' నని ఇప్పటి ముఠా నాయకుడొకడు జ్ఞాపకం చేసుకుంటాడు. ఇతరత్రా పుల్లారెడ్డికి 'పెద్దమనిషిగా' పేరున్నప్పటికీ ఈ ఫ్యూడల్ అహంభావాన్ని భరించలేక అతనిని దించడానికి సమితిలోని సర్పంచ్‌లందరూ సన్నద్ధులయి, తమలో కొంత చురుకయిన వాడిగా గుర్తింపుపొందిన శివారెడ్డికి మద్దతు ఇచ్చారు. పుల్లారెడ్డిని అవిశ్వాస తీర్మానంతో దించి. శివారెడ్డిని సమితి ప్రెసిడెంట్ చేసారు. ఇది 1975 లో జరిగింది. అప్పట్లో శివారెడ్డికి సహకరించిన వాళ్లలో కమ్యూనిస్టులకు చాలా సన్నిహితులయిన దేవగుడి గ్రామానికి చెందిన సుబ్బరామిరెడ్డి కుటుంబం కూడ ఉంది. జమ్మలమడుగు తాలూకాలో పాతతరం నాయకుల ప్రాబల్యం తగ్గించడంలో ఈ దేవగుడి కుటుంబం చాలా కాలం శివారెడ్డికి అండగా ఉండింది. ఈ కుటుంబం సిపిఐ కి దగ్గరివారయిన ఫాక్షనిస్టులు. శివారెడ్డి తన ఆధిపత్యం నెలకొల్పడానికి తాలూకాలో గ్రామగ్రామాన ముఠాకక్షలు రేపి విజృంభించిన క్రమంలో దేవగుడి వాళ్లకూ శివారెడ్డికీ విరోధం ఏర్పడింది. చివరికి వాళ్ల చేతిలోనే శివారెడ్డి ప్రాణం పోయింది.

ఫాక్షనిస్టులు కాకపోయినప్పటికీ భూస్వామ్య అభిజాత్యం వల్ల ప్రజలకు దూరంగా ఉండిన పాతతరం నాయకులను పక్కకు తొలగించి ఒక కొత్తతరం నాయకత్వం ఆధిపత్యం నెలకొల్పడానికి ముందుకొచ్చింది. పాతవారితో పోలిస్తే వీరు దొరతనపు లక్షణాలు లేనివారు కావడం వల్ల వీళ్లు కొంత విస్తృతంగానే మద్దతు (సిపిఐ మద్దతుతో సహా) పొందగలిగారు. అయితే వీళ్లు ప్రజాస్వామిక పద్ధతులలోకాక విపరీతమయిన స్థాయిలో బలప్రయోగానికి పాల్పడి, ముఠాలు కట్టి, గ్రామీణ ముఠాకక్షలను వాడుకొని, పెంచిపోషించి పాత తరాన్ని పక్కకు తొలగించారు. ఆ క్రమంలో బలప్రయోగ సంస్కృతినీ ముఠాకక్షల సంస్కృతినీ జిల్లా రాజకీయాల ప్రముఖ లక్షణంగా మార్చారు. ఆ తరువాత వీరి ప్రోత్సాహంతో చిన్న చిన్న ఫాక్షనిస్టులు గ్రామగ్రామాన బయలుదేరారు. 1978 తో మొదలుపెట్టి జిల్లా రాజకీయాలు రక్తసిక్తం అయ్యాయి.

ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందులలో ఈ పరిణామం జరిగిన వైనాన్ని వచ్చే అధ్యాయంలో ఇంకొంచెం వివరంగా చూద్దాము.

# మూడు తాలూకాల కథ

ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల కడప జిల్లా వాయువ్య ప్రాంతంలో ఒక దానినొకటి ఆనుకొని ఉన్న తాలూకాలు. ఇది పెన్న, దాని ఉపనదులు ప్రవహించే నల్లరేగడి నేలల ప్రాంతం. జిల్లా జనాభాలో 33 శాతం, జిల్లా విస్తీర్ణంలో 27.3 శాతం ఈ మూడు తాలూకాలలో ఉంది. పెన్న నది జమ్మలమడుగు, ప్రొద్దుటూరు తాలూకాలలో ప్రవహిస్తుంది. దాని ఉపనదులయిన చిత్రావతి, కుందేరు, పులివెందుల, జమ్మలమడుగు తాలూకాలలోను, పాపఘ్ని పులివెందుల తాలూకాలోను ప్రవహిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఏజెన్సీ ప్రాంతాలున్న జిల్లాలను మినహాయిస్తే మిగిలిన అన్ని జిల్లాలలోనికీ కొండప్రాంతం అధికంగా ఉన్నది కడప జిల్లాలోనే. దక్షిణ, తూర్పు భాగాలు కొండలమయం అయిన ఈ జిల్లా వాయువ్య భాగం మాత్రం విశాలమయిన మైదాన ప్రాంతం. క్రీ.శ 1800 నాటికి దక్షిణాన ఉన్న పాలకొండలు (వీటినే శేషాచలం కొండలని కూడ అంటారు) పాలెగాళ్ల ప్రధాన కేంద్రంకాగా, 19వ శతాబ్దం చివరి నాటికి గ్రామీణ ముఠాకక్షల వ్యవస్థ ఆ కొండల కంటె పెన్ననది పరీవాహక ప్రాంతమయివ మైదావంలోనే ఎక్కువ ఉందని పై అధ్యాయాలలో చెప్పాము. 1978 తరువాత పెచ్చురిల్లిన రాజకీయ ఫాక్షన్లకు కూడ ఈ మూడు తాలూకాలే పేరు పడ్డాయి. ఈ రాజకీయ ఫాక్షన్ల ప్రభావంలో పాత ఫాక్షన్ గ్రామాలలోనే కాక ఇతర గ్రామాలలో కూడ ముఠా కక్షలు ప్రబలాయి. ప్రతీ ఎన్నిక, ప్రతీ సారాయి వేలంపాట, ప్రతీ కాలవ పని, రోడ్డువని కక్షలు విజృంభించి బాంబుదాడులు, హత్యలూ ప్రతి హత్యలూ జరగగల సందర్భమే.

కమలాపురం, మైదుకూరు, కోడూరు, రాజంపేట, రాయచోటి నియోజకవర్గాలలో కూడ రాజకీయ ముఠాకక్షలున్నాయి. కమలాపురంలో చెప్పుకోదగ్గ మోతాదులో ఉన్నాయి. ఈ కక్షలకు స్థానిక కారణాలు, మూలాలు ఉన్నాయి. వాటిని రెచ్చగొట్టడంలో, పెంచిపోషించడంలో పులివెందుల పాలెగాళ్లయివ వై.ఎస్ తండ్రీ తవయుల ప్రమేయం కూడ ఉంది. ఆ మాటకొస్తే ప్రొద్దుటూరు, జమ్మలమడుగులలో కూడ ఆ ప్రమేయం లేకపోలేదు.

## ప్రొద్దుటూరు :

19వశతాబ్దంలో జమ్మలమడుగుతో సమానంగా కాకున్నా ప్రొద్దుటూరులో కూడ గ్రామీణ ముఠా కక్షల సంస్కృతి ఉండింది. ఈ శతాబ్దంలో కూడ అది కొనసాగింది. స్వాతంత్ర్యానికి పూర్వం నుండి ఫాక్షన్లకు పేరుపొందిన గ్రామాలలో టంగుటూరు ఒకటి. గతంలో వివిధ ముఠాకొట్లాటలలో ఆ ఊరిలో 8 హత్యలు జరిగాయని గ్రామస్తులు జ్ఞాపకం

చేసుకుంటారు. రాంభూపాల్‌రెడ్డి ఆ ఊరి 'రెడ్డి' కావడమేకాక పంచాయితీరాజ్ వ్యవస్థ పుట్టినప్పటి నుండి 30 ఏళ్లకుపైగా పోటీ లేకుండా సర్పంచ్‌గా ఎన్నిక అయ్యాడు. అయితే గత తెలుగుదేశం పాలవలో నిర్వహించిన గ్రామపంచాయితీ ఎన్నికలలో వీరారెడ్డి అనే రైతు అతనిపైన పోటీ చేసి సర్పంచ్‌గా గెలిచాడు. అతనికి ప్రొద్దుటూరు ఎంఎల్‌ఏ వరదరాజులు రెడ్డి ప్రోత్సాహం ఉంది. గ్రామంలో పెద్ద సంఖ్యలో ఉన్న దూదేకుల ముస్లింలు అతని పక్షం.

ఈ రెండు వర్గాల మధ్య చిచ్చు ఈనాటికీ రేగుతూనే ఉంది. 1995 ఉగాది తరవాతి దివం ఇరువర్గాలూ మిద్దెలెక్కి గంటసేపు బాంబులు వేసుకున్నారు. ఇళ్లు తగలబెట్టుకున్నారు. తరువాతి రోజు మళ్లీ మిద్దెలెక్కి ఇంకొక గంటసేపు బాంబులు వేసుకున్నారు. మళ్లీ ఇళ్లు తగలబెట్టుకున్నారు. మొదటి రోజు జరిగిన ఘటన ఫలితంగా రెండవరోజు ఆ ఊరిలో పోలీస్ పికెట్ నెలకొనింది. అయితే వీళ్లు బాంబులు వేసుకోవడం మొదలు పెట్టగానే పోలీసులు పారిపోయారు. మళ్లీ అరెస్టు చేయడానికి తిరిగి వచ్చారు. మగవాళ్లు కనిపించలేదని ముస్లిం స్త్రీలను విపరీతంగా కొట్టారు. ఈ కేసులో మొత్తం 74 మంది జైలుకు పోయారు.

అయితే ప్రొద్దుటూరులో రాజకీయ ఫాక్షన్లకు పునాది వేసినవాడు ఎం.వి. రమణారెడ్డి. ఇతనికి కొంతకాలం విప్లవ కమ్యూనిస్టు రాజకీయాలతో సంబంధం ఉండింది. 1970 లలో ఒక కార్మిక నాయకుడిగా ప్రొద్దుటూరు రాజకీయాలలోకి ప్రవేశించాడు. ప్రొద్దుటూరులోని ఆంధ్రకాటన్ మిల్స్‌లో మొదట యూనియన్ పెట్టాడు (1969లో). ఆతరువాత మోటార్ వర్కర్స్ యూనియన్, ఇంటర్నేషనల్ పాకేజింగ్ కంపెనీలో యూనియన్, తాడిపత్రిలోని అనంతపూర్ కాటన్‌మిల్స్‌లో, మదనపల్లిలోని స్పిన్నింగ్ మిల్‌లో, జ్యూస్ ఫ్యాక్టరీలో, కడప పట్టణంలోని రామకృష్ణ జ్యోతి కెమికల్స్‌లో, కోడూరులోని డిటర్జెంట్ ఫ్యాక్టరీలో, ఇంకా కొన్ని ఇతర ఫ్యాక్టరీలలో, యూనియన్‌లు పెట్టాడు. యూనియన్ల వ్యవహారాలను అతను త్వరలోనే ముఠా కక్షల పద్ధతిలో నడపసాగాడు. అంటే ఒక రాజకీయ నిర్మాణం, సిద్ధాంతం లేకుండా కేవలం ఒక నాయకుడిని ఆశ్రయించిన ముఠాను తయారుచేసుకొని హింసాత్మక దాడులకు, ప్రతీకార దాడులకు పాల్పడనారంభించాడు. ఈపని విజయవంతంగా చేసేకొద్దీ కొత్త యూనియన్లు (కడప జిల్లాలోనేకాక చిత్తూరు, అనంతపురం జిల్లాలలోనివి కూడ) అతని చేతిలోకి వచ్చాయి. కొంతకాలం వరకు ఈ ముఠాదాడులు కార్మికుల ప్రయోజనాల కోసమే జరుగుతున్నట్టు ప్రజలకు అనిపించింది. ఎంవిఆర్ పేదప్రజలకు అండగా నిలబడతాడనీ 'రాత్రికి రాత్రి షావుకార్ల తలలు నరికి పోతాడ'నీ 1975 నాటికే ప్రొద్దుటూరులో ధనవంతులు భయపడసాగారని ఒక ప్రొద్దుటూరు నివాసి అంటాడు. కానీ క్రమంగా ఈ హింస ఎంవిఆర్ కు ఆస్తినీ అధికారాన్నీ సంపాదించి పెట్టే ఫాక్షన్ హింసా రూపం తీసుకుంది. తన ముఠా దౌర్జన్యాలతో అతను ప్రొద్దుటూరులో

జనజీవితం మీద ఆధిపత్యం నెలకొల్పాడు. 1978 నుండి ప్రొద్దుటూరు రాజకీయాలలో తలదూర్చాడు. 1983లో ఎంఎల్ఏ అయ్యాడు. ఆ తరువాత సారా కంట్రాక్టర్ అయ్యాడు. కోటీశ్వరుడయ్యాడు. అయితే అతను మరీ పెరిగి పోతున్నాడని భావించిన వైఎస్ రాజశేఖరరెడ్డి (తనకు మించి ఎవ్వరూ ఎదగకూడదనేది ఈయన రాజకీయాల ప్రథమ సూత్రం కావడం వల్ల) అతనికి వ్యతిరేకంగా వరదరాజులు రెడ్డిని ప్రోత్సహించడం మొదలు పెట్టాడు. ఈ యిద్దరి మధ్య ఘర్షణ, హత్యలు, బాంబుదాడులు చెలరేగి, ఇద్దరి ముఠా దౌర్జన్యాలకు ప్రొద్దుటూరు తల్లడిల్లింది.

మోటార్ వర్కర్స్ యూనియన్‌కూ లారీ ఓనర్లకూ మధ్య వచ్చిన ఘర్షణలో లారీ ఓనర్లకు మద్దతుగా ఉండిన మాజీ ఎంఎల్ఏ, న్యాయవాది రామసుబ్బారెడ్డిని ఎంవి రమణారెడ్డి 1975 లో హత్య చేయించాడు. ఇది ప్రొద్దుటూరులో మొదటి రాజకీయ హత్య. ఎంవిఆర్ ముఠా రాజకీయాలకు నాంది. ఇంటర్నేషనల్ ప్యాకేజింగ్ కంపెనీ కార్మికులు ఎంవిఆర్ ఆ కంపెనీలో యూనియన్ పెట్టక ముందే ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అయిన కృష్ణమూర్తిని హత్య చేసారు. హత్య చేసిన వాళ్ళు ఎంవిఆర్ దగ్గరకు పోగా ఎంవిఆర్ వాళ్లను చేరదీసాడు. రామసుబ్బారెడ్డి హత్య తరువాతే రమణారెడ్డికి మిలిటెంట్ కార్మిక నాయకునిగా పేరు వచ్చింది. కడప, తాడిపత్రి, మదనపల్లెలలో కొన్ని మిల్లుల యూనియన్లు అతని చేతిలోనికి వచ్చాయి.

రాజుపాలెం మండలం తొండలదిన్నె గ్రామంలో ఎంవి రమణారెడ్డి ప్రోత్సాహంతో ఒక రైతుకూలీ సంఘం ఏర్పడింది. దానికి అధ్యక్షుడు మొదట ఎంవి రమణారెడ్డి. ఆ తరువాత చంద్రశేఖర రెడ్డి అనే ఆ గ్రామ యువకుడు. ఈ రైతుకూలీ సంఘానికీ భూస్వాములకూ జరిగిన ఘర్షణ కూడ హత్యలు, ప్రతిహత్యల రూపంలో సాగింది. 1982 లో ఎంవిఆర్ మనుషులు తమ ప్రత్యర్థినొకడిని హత్య చేసారు. దానికి ప్రతీకారంగా వాళ్ళ రైతుకూలీ సంఘం నాయకుడు చంద్రశేఖరరెడ్డిని చంపారు. ఆ తరువాత వీళ్ళు ఇంకొకరిని చంపారు. (ముగ్గురిని చంపారని ఒక స్థానిక న్యాయవాది అంటాడు.)

1978-83 మధ్య కాలంలో ప్రొద్దుటూరు ఎంఎల్ఏ చంద్రఓబుల్ రెడ్డితో ఎంవిఆర్ ఘర్షణకు దిగాడు. 1978 ఎన్నికలలో అతవికి వ్యతిరేకంగా ఐ.సుబ్బారెడ్డికి మద్దతు ఇచ్చాడు. ఆ అయిదేండ్లలో జరిగిన మునిసిపల్ ఎన్నికలలో, సమితి ఎన్నికలలో ఎంవిఆర్ తన గుంపును ఒక వర్గానికి అనుకూలంగా ఉంచాడు. 1981 సమితి ఎన్నికలలో ఎంవి రమణారెడ్డి మనుషులు రిగ్గింగ్ పుణ్యాన వదరరాజులురెడ్డిపైన రఘురామి రెడ్డి గెలిచాడు. ప్రొద్దుటూరు మునిసిపల్ ఛైర్మన్‌గా ఎంవిఆర్ మద్దతుతో ఐ.సుబ్బారెడ్డి గెలిచాడు. 1983 లో ఎంవిఆర్ తానే ఎన్నికల

రంగలోకి దిగి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీచేసి చంద్రఓబుల్‌రెడ్డి పైన గెలిచాడు. ఈ అయిదేళ్ల ఘర్షణలో ఇరువర్గాలు దాడులు , హత్యలు చేసుకొన్నారు. 11 సంవత్సరాలు సమితి ప్రెసిడెంటుగా ఉండి ఆతరువాత ఎంఎల్ఏ అయిన చంద్రఓబుల్ రెడ్డిని రాజకీయంగా ఓడించకపోతే తాను పైకి రాలేనని ఎంవి రమణారెడ్డి నిర్ణయించుకున్నాడు. అందుకోసం హత్యలు చేయడానికీ దౌర్జన్యం చేయడానికీ సిద్ధపడ్డాడు. 1975 లో అతను హతమార్చిన అడ్వకేట్ రామసుబ్బారెడ్డి చంద్రఓబుల్ రెడ్డికి సన్నిహితుడు. 1978-83 కాలంలో వాళ్ళు ఇద్దరినీ తాము ఇద్దరినీ చంపుకున్నామని ఎంవిఆర్ అంటాడు. ఎంవిఆర్ బంధువయిన పద్మనాభరెడ్డినీ సుబ్బారెడ్డి అనే లారీ డ్రైవర్‌ను వాళ్లు చంపగా, ఎంవిఆర్ మనుషులు కామాల్‌సాహెబ్ అనే కౌన్సిలర్‌ను సుబ్బారెడ్డి అనే బంగారు వర్తకుడినీ చంపారని అంటారు. కానీ 'ఆరు వారాలలో ఆరు హత్యలు జరిగాయి' అని అప్పటి ఎంవిఆర్ అనుచరుడొకడు జ్ఞాపకం చేసుకుంటాడు. ఆరు కాదు, ఎనిమిది అని ఇంకొక మాజీ అనుచరుడు అంటాడు. అవతలి వాళ్లు రెండు హత్యలు చేయగా ఎంవిఆర్ మనుషులు ఆరుహత్యలు చేసారంటాడు.

సంఖ్య ఏమయినా, దాని ఫలితం మాత్రం ప్రొద్దుటూరులో నెలకొన్న టెర్రర్. ఎంవిఆర్ టెర్రర్ గురించి ఒక ఉదంతం చెప్తారు. చలమారెడ్డి అనే జనసంఘ్ కార్యకర్త 1977 లో యూనియన్ రంగంలోకి దిగబోగా, ఎంవిఆర్ మనషులు అతనిని మాన్పించవలసిందిగా అతని భార్యను హెచ్చరించారు. ఆమెకూడ రాజకీయాలు తెలిసిన వ్యక్తే. అప్పటికొకసారి మునిసిపాలిటీ ఎన్నికలలో పోటీచేసింది. కానీ ఆమె ఈ బెదిరింపుకు భయపడి భర్తను మానుకొమ్మని వారించింది. అతను వినకపోయేసరికి ఆమె తన ఒంటికి నిప్పు అంటించుకొని చనిపోయింది. ఆమెను కాపాడబోయి చలమారెడ్డి కూడ ఒళ్లు కాలి చనిపోయాడు.

1983 ఎన్నికలలో రాష్ట్రంలో ఉన్న తెలుగుదేశం గాలివల్ల కొంత, తన గుండాబలం వల్ల కొంత ఎంవిఆర్ గెలిచాడు. అతను ఎంఎల్ఏగా ఉండింది రెండు సంవత్సరాలే. కానీ ఆరెండు సంవత్సరాలలో అతని అనుచరుల రౌడీయిజం మితిమీరిపోయింది. ఆ తరువాత కూడ కొనసాగింది. అంగళ్లలో డబ్బులు, వస్తువులు, రౌడీ మామూళ్లు వసూలు చేయడం, తగవులను తమ దగ్గరకు రప్పించుకొని పంచాయితీలు చేయడం, ఆస్తులు ఇప్పించడం మొదలు పెట్టారు.

చంద్రఓబుల్‌రెడ్డి తరానికి చెందిన నాయకులు హింస ఎరుగని వారేంకారుగానీ దౌర్జన్యాన్ని అదేపనిగా ఒక రాజకీయ సాధనంగా ప్రయోగించిన ఎంవిఆర్ దూకుడుకు తట్టుకోవడం అతనికి సాధ్యం కాలేదు. ఎంవిఆర్‌కు ఉండే కార్మికబలం కూడ దానికి తోడయింది. ఈ కారణంగా చంద్రఓబుల్ రెడ్డి తెరమరుగు కాగా, ఎంవిఆర్‌కు కళ్లెం

వేయడానికి వరదరాజులు రెడ్డిని వైఎస్ రాజశేఖరరెడ్డి అదేపనిగా ప్రోత్సహించాడు. దీనితో ఎంవిఆర్‌కూ వరదరాజులు రెడ్డికీ ముఠాకొట్లాట ప్రారంభం అయింది. అది ఇప్పటికీ తెగలేదు.

1975 నుండి 1990 దాకా ప్రొద్దుటూరు రాజకీయ ఫాక్షన్‌లలో 30 లేక 40 హత్యలు జరిగి ఉంటాయని పరిశీలకులు అంటారు. అందులో ఎక్కువ భాగం ఎం.వి. రమణారెడ్డి మనుషులు చేసినవే. 1983 లో ఎంఎల్ఏ గా గెలిచిన రమణారెడ్డి 1984 లో రాయలసీమ విమోచన సమితి నెలకొల్పి దానికి నాయకుడయ్యాడు. కొంతకాలం మంచి ఉద్యమం నడిపాడు. 1985 ఎన్నికలో అతనికి తెలుగుదేశం టిక్కెట్టు దొరకలేదు. రాయలసీమ విమోచన సమితి తరపున స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసాడు. తెలుగుదేశం అభ్యర్థిగా వరదరాజులు రెడ్డి పోటీ చేసాడు. రమణారెడ్డిని ఓడించడానికి తానే వరదరాజులు రెడ్డిని తెలుగుదేశం పార్టీలో చేరి టిక్కెట్ తీసుకొమ్మని ప్రోత్సహించానని రాజశేఖరరెడ్డి అంటాడు. ఒక కాంగ్రెస్ నాయకుడు మరొక కాంగ్రెస్ మనిషిని తెలుగుదేశం టిక్కెట్ ఇప్పించడం కడప జిల్లాలో సాధ్యమే. ఇక్కడ ముఠాలూ ముఠా ప్రయోజనాలూ తప్ప వేరే రాజకీయమేదీ లేదు. 1985లో వరదరాజులు రెడ్డి తెలుగుదేశం అభ్యర్థిగా గెలిచాడు. అతను నియోజకవర్గం ఎల్లలు దాటగానే తనకారుపైన ఉన్న తెలుగుదేశం జెండా తీసేసి కాంగ్రెస్ జెండా పెట్టుకునేవాడు.

1985 ఎన్నికలప్పుడే పెద్ద ఎత్తున హింస జరిగింది. చాపాడు మండలం చీపాడు గ్రామంలో ఎంవి రమణారెడ్డి ఎలక్షన్ ఏజెంటయిన యారాసి రమణారెడ్డిని వరదరాజులు రెడ్డి మనుషులు హతమార్చారు. ఎన్నిక ముగిసి వరదరాజులు రెడ్డి గెలుపు ప్రకటించిన తరువాత ఎంవిఆర్ ప్రతీకారం తీర్చుకున్నాడు. వరదరాజులురెడ్డిని అభినందించడానికి బస్సులో ప్రొద్దుటూరు వస్తున్న అతని అనుచరులు నలుగురిని ఆంధ్రాకాటన్ మిల్లు దగ్గర ఎంవిఆర్ మనుషులు నరికి చంపారు. బస్సు ఆపి అద్దాలు పగలగొట్టి వీరిని దించి హతమార్చారు. ద్వార్శల చినవీరారెడ్డి, ద్వార్శల పెదసుబ్బారెడ్డి, ద్వార్శల బాలవీరారెడ్డి, భూమిరెడ్డి రామకృష్ణారెడ్డి అనే ఈ నలుగురూ లక్ష్మీపేట గ్రామనివాసులు. అదే సంవత్సరం వరదరాజులు రెడ్డి మద్దతుదారయిన వీరారెడ్డి అనే మరొక వ్యక్తిని కూడ వీళ్ళు చంపారు. తాళ్ళమాపురం గ్రామంలో ఎంవిఆర్ అనుచరులిద్దరిని వరదరాజులు రెడ్డి 1988 లో చంపించాడు. అప్పుడు రమణారెడ్డి జైలులో ఉన్నాడు. జైలు నుండి బయటకు వచ్చిన తరువాత ఎంవిఆర్ అవతలి వర్గానికి చెందిన గ్రామస్తులిద్దరిని చంపించాడు. ఇంకా అనేక హత్యలు జరిగాయి. ఒక గుంపు వదిలిపెట్టి ప్రత్యర్థి గుంపులోకి పోయిన వాళ్లను చంపారు. వ్యాపారాలకు అడ్డం వచ్చిన వాళ్లను చంపారు. ముఠా నాయకుడిని ఎదిరించిన వాళ్లను చంపారు. తాము చెప్పిన మాటవినని వాళ్లను చంపారు. చాలా మందిని చంపారు.

ఈ రెండు గ్రూపుల మధ్య ఘర్షణ పెరగడానికి సారాయి వ్యాపారం ఒక ముఖ్య కారణం అయింది. కడప జిల్లాలో కొన్ని ఊర్లలో సారావ్యాపార లాభం మొత్తం కాంట్రాక్టర్‌కూ ప్రభుత్వానికీ చెందకుండ ఊరి అభివృద్ధికి దానిని వినియేగించే ఆలోచన చేసినట్టు పైన చెప్పాము. ఈ వరవడి మొదలు పెట్టింది రమణారెడ్డే. ప్రభుత్వ వేలంపాట కంటె ముందే ఊరిలోనే వేలంపాట జరుగుతుంది. ఊరి అభివృద్ధికి ఎవరు ఎక్కువ ఇస్తామని ఒప్పుకుంటే వాళ్లకే ప్రభుత్వ వేలంపాటలో పాల్గొని కాంట్రాక్టు తెచ్చుకునే హక్కు గుత్తకు ఇవ్వబడుతుంది. (ఈ నిర్ణయాన్ని కాదని వేరే ఎవరయినా వేలంపాటకు పోతే బాంబులు పడతాయి, హత్యలు జరుగుతాయి.) ఈ ఏర్పాటు చాలా ఊర్లకు కొంతమేలు చేసింది కానీ త్వరలో ఊరి అభివృద్ధి కోసం కేటాయించిన డబ్బు గురించే ఘర్షణ, కొట్లాటలు మొదలయ్యాయి. అదే ఒక ఆధిపత్య సాధనం అయింది.

రమణారెడ్డి ఎంఎల్ఏ కాక ముందే ప్రొద్దుటూరులో ఒక డెవెలప్‌మెంట్ ట్రస్ట్ ఏర్పాటు చేసాడు. ట్రస్ట్ తరపున సారాయి వేలంపాట పెట్టి ప్రభుత్వ ఎక్సైజ్ పాటలో పాల్గొనే హక్కు ఎవరిదనేది నిర్ణయించేవారు. మొదట్లో ఈ ట్రస్ట్ కొంత విశాల ప్రాతిపదికపైననే నడిచింది. చంద్రఓబుల్‌రెడ్డి ఎంవిఆర్‌తో రాజీపడిన తరువాత అతనిని ట్రస్ట్‌కు గౌరవ అధ్యక్షుడిని చేసాడు. ట్రస్ట్ ఆదాయంతో ప్రొద్దుటూరులో ఒక జూనియర్ కాలేజీ, ఒక ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ నెలకొల్పారు. 1984 లో ఎంవి రమణారెడ్డి ప్రారంభించిన రాయలసీమ విమోచన సమితి ఖర్చులకు ట్రస్ట్ డబ్బులు వినియోగించాడు. (ట్రస్ట్ పేరిట సేకరించిన 30 లక్షలలో 20 లక్షలు ఆ సంవత్సరం ఈ ఉద్యమానికి ఖర్చు పెట్టాడని అప్పటి అతని అనుచరులు అంటారు.) అయితే కాలక్రమంలో ఎంవిఆర్ ట్రస్ట్ సభ్యులుగా ఉన్న ఇతర వ్యక్తులను తొలగించి తన మనుషులను పెట్టుకున్నాడు. ట్రస్ట్ ఆస్తుల లెక్కలు చూపించకుండ స్వంత ఆస్తిగా వాడుకోసాగాడు. 1986 లో అతనే సారావ్యాపారంలోకి ప్రవేశించిన పిదప ట్రస్ట్ మూతపడింది. ట్రస్ట్ తరపున జరిగే వేలంపాటలకు ఉమ్మడి ఒడంబడిక తప్ప వేరే ప్రాతిపదిక ఏదీ లేకపోయినప్పటికీ, ఎంవిఆర్ దానిని తన బలప్రయోగంతో అమలు చేయాలని చూసాడు. 1984లో ప్రొద్దుటూరు సారా కాంట్రాక్టు తీసుకున్న కోగటం వీరారెడ్డి ట్రస్ట్‌కు ఇమ్మన్న 2 లక్షలు ఇవ్వలేదని ఎంవిఆర్ అతనిని చంపించాడు.(అతని కొడుకు వీరశివారెడ్డి ప్రస్తుతం కమలాపురం ఎంఎల్ఏ) 2 లక్షలు ఇయ్యవలసిందేనని రమణారెడ్డి పట్టుబడితే, 'నువ్వు 35 ఏండ్లకు రౌడీవి అయ్యావు. నేను 18 ఏండ్లకే రౌడీని' అంటూ వీరారెడ్డి ఇవ్వను పొమ్మన్నాడని ఒక కథ చెప్తారు. (వీరారెడ్డి ఇంటిపేరు గుండ్లూరు, స్వగ్రామం కోగటం).

నిజానికి ఈ దశవచ్చే సరికి సారా కాంట్రాక్టర్లు ప్రొద్దుటూరు డెవలప్‌మెంట్ ట్రస్ట్‌కు డబ్బులిస్తున్నారా లేక ఎంవిఆర్‌కు రౌడీ మామూలు ఇస్తున్నారా అన్న తేడా చెరిగిపోయింది. 1986 తరువాత తానుగాక ఇతరులు కాంట్రాక్టు తీసుకుంటే రౌడీ మామూలు డిమాండ్ చేయడం, వాళ్లు చెల్లించకపోతే దొంగ సారాయి అమ్మించి వాళ్లకు నష్టం చేయడం ఎంవిఆర్ మొదలుపెట్టాడు. 1986 లో సారాకాంట్రాక్టు వరదరాజులు రెడ్డి చేతిలోకి పోయింది. అతను రౌడీ మామూలు ఇవ్వడానికి నిరాకరించాడని రమణారెడ్డి అతనికి అన్ని రకాలుగా అడ్డుపడ్డాడు. అతని ముఠాకు బలం ఉన్న గ్రామాలలో వాళ్లను అంగడి పెట్టనివ్వలేదు. పెట్టినా అమ్మనియ్యలేదు. వాళ్లు బలవంతంగా అమ్మేప్రయత్నం చేస్తే దాడిచేసి కొట్టారు. తాము దొంగ సారాయి తెచ్చి అమ్మారు. 'ఆ ఒక్క సంవత్సరం నాకు 30 లక్షలు నష్టం చేసాడు' అని వరదరాజులు రెడ్డి అంటాడు. తరువాత ఇద్దరూ మార్చి మార్చి ప్రొద్దుటూరు సారా కాంట్రాక్టు తీసుకున్నారు. 1989 నాటికి ఎంవిఆర్ తిరిగి తెలుగుదేశంలో చేరగా వరదరాజులు రెడ్డి మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరాడు. అసెంబ్లీ ఎన్నికలో వరదరాజులు రెడ్డి మళ్లీ గెలిచాడు. 1991 లో ఎంవిఆర్ ప్రొద్దుటూరు సారా కాంట్రాక్టు తీసుకున్నప్పుడు వరదరాజులు రెడ్డి పాత నష్టానికి ప్రతీకారం తీర్చుకున్నాడు. రమణారెడ్డి రాజీకి వచ్చి తన సారా వ్యాపారం కాపాడు కోవడానికి వరదరాజులు రెడ్డికి 6 లక్షల 30 వేలు చెల్లించుకున్నాడు. అయితే వరదరాజులు రెడ్డి పాత నష్టం దీనితో తీరలేదు. 1992 లో ఎవరు సారాకాంట్రాక్టు తీసుకున్నా, తాను ఎక్సైజ్ శాఖకు చెల్లించవలసిన పాత బాకీ మొత్తం, తనకు రౌడీ మామూలు రూపంలో చెల్లించి కాంట్రాక్టు తీసుకోవాలని వరదరాజులు రెడ్డి షరుతు పెట్టాడు. అతని గుంపులోని ఒక వ్యక్తి ఈ షరతుకు సిద్ధపడి అతని సహాయంతో కాంట్రాక్టు పొంది అతనికి 15 లక్షలు చెల్లించాడు.

ఈ గొడవంతా ప్రశాంతంగా జరిగిందనీ, లేదా ఘర్షణలు కేవలం సారా దుకాణాల దగ్గర జరిగాయనీ అనుకుంటే పొరబాటే. 1985-89 మధ్య కాలంలో ఇటు ఎంవి రమణారెడ్డి, అటు వరదరాజులు రెడ్డి ప్రొద్దుటూరులోని రౌడీలందరినీ చేరదీసారు. ఇరు వర్గాల మధ్య ప్రతీ చిన్న సందర్భంలోనూ గొడవలు, బాంబు దాడులు, హత్యలు జరిగాయి. ఊరిలో ఏ సమస్య వచ్చినా ఒక పక్షాన ఈ వర్గం, ఒక పక్షాన ఆవర్గం నిలబడి ఆ సమస్యను తమ ముఠాకొట్లాటలో భాగం చేసారు. దీనితో సమస్య న్యాయంగా పరిష్కారం కాకపోగా నిష్కారణమయిన అల్లరి, హింస, బాంబుదాడులు, భయం, భీతి చెలరేగాయి. వీధి రౌడీలకు ముఠాల ఆశ్రయం దొరికి ఒక్కొక్కడూ ఒక చిన్నపాటి పాలెగాడయ్యాడు. వ్యాపారస్తుల నుండి లక్షల రూపాయలు మామూళ్లు, కమీషన్లు వసూలు చేయడం, భూములూ ఇళ్లూ ఒకరివి ఒకరికి అక్రమంగా స్వాధీనం చేయడం, ప్రతీ తగవులోనూ జోక్యం చేసుకొని బలప్రయోగంతో తీర్పులు అమలు చేయడం, ఆస్తి తగాదాలూ, ఇంటి కలహాలూ తమ ఇష్ట ప్రకారం పరిష్కరించడం, అధికార

యంత్రాగాన్ని లోబరచుకొని పనులు చేయించుకోవడం. మునిసిపల్ కౌన్సిలర్‌లుగా, పాల సొసైటీ డైరెక్టర్లుగా, సహకార బ్యాంకు డైరెక్టర్లుగా ఈ రెండు ముఠాల మనుషులే బలప్రయోగంతో ఎన్నికయి ప్రజాజీవితాన్ని శాసించడం, దొంగసారా, మట్కా, దారిదోపిడీలు, డెకాయిటీలు చేసి లక్షలు సంపాదించడం ప్రొద్దుటూరులో నిత్యకృత్యమయిపోయింది. 'మేము ఎంవిఆర్ మనుషులం' అని చెప్పుకుంటే వీధికుళాయి దగ్గరి నుండి సివిల్ కాంట్రాక్టుల దాకా ఎక్కడయినా రౌడీయిజంచేసి సాధించుకునే పరిస్థితి ఎంవిఆర్ ఎంఎల్ఏ అయ్యేనాటికే నెలకొనింది. స్థానిక డిగ్రీ కాలేజీ (ఎస్‌సి ఎన్ ఆర్ కాలేజి) లో సహితం, 'మేము ఎంవిఆర్ మనుషులం' అని చెప్పుకునే విద్యార్థుల ఆగడాల వల్ల విద్యార్థి రాజకీయాలలో బాంబుదాడులు, కత్తిపోట్లు, కిడ్నాపింగ్ సాధారణ విషయాలయ్యాయి. వరదరాజులు రెడ్డి అధికార యంత్రాంగాన్ని బెదిరించి పనులు చేయించుకోవడంలో దిట్ట. ఒక మునిసిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నికలో, కౌన్సిలర్లు కానివాళ్లను తీసుకొచ్చి కూచోబెట్టి ఆర్‌డివోను బెదిరించి వాళ్లతోనే ఎన్నిక జరిపించాడు. ప్రొద్దుటూరు మునిసిపల్ కౌన్సిల్‌కు ఎన్నికయిన వాళ్లను బెదిరించి రాజీనామా చేయించి తన ఆధిపత్యం నిలబెట్టుకున్న చరిత్ర వరదరాజులు రెడ్డికి ఉంది. అతని అనుచరులు దారిదోపిడీలను, దొంగతనాలను ప్రోత్సహిస్తాడన్న పేరుకూడ అతనికి ఉంది. అతని అనుచరులు ఎంత హేయమయిన నేరాలకు పాల్పడినా అతను కాపాడుతాడు. దీంట్లో రహస్యమేమీ లేదు. ఎంవి రమణారెడ్డికి అభ్యుదయ రాజకీయాల పరిభాష తెలుసు కాబట్టి తాను చేసేది వర్గపోరాటమే తప్ప ఫాక్షన్ రాజకీయం కాదంటాడు. వరదరాజులు రెడ్డి ఎంవిఆర్ లాగ విద్యాధికుడు కాడు. అతను పుట్టి పెరిగింది ఫాక్షన్ రాజకీయ సంస్కృతిలోనే కాబట్టి ఇటువంటి అబద్ధాలు చెప్పడు. 'నా వర్గం వాళ్లు ఏ నేరం చేసినా కాపాడడం నావిధి' అంటాడు. అతని దృష్టిలో అదే న్యాయం, అదే ధర్మం. ముఠా సంస్కృతిలో ఉండే ప్రధానమైన అవలక్షణాలలో ఇదొకటి. అందులో తప్పొప్పులు, న్యాయాన్యాయాలు, నీతీ అవినీతులు అనే విచక్షణ ఉండదు. నీ వర్గమా నావర్గమా అనేదే విచక్షణ. ఇది కేవలం ముఠా నాయకులకు పరిమితమైన ఆలోచనా వైపరీత్యం కాదు. ఇది సామాజిక సంస్కృతిలోని ఒక ప్రబలమైన అంశం.

ఈ ముఠా రౌడీయిజం ఫలితం ప్రొద్దుటూరు పట్టణ జనజీవితం మీద ఏవిధంగా ఉండిందనేది ముఠా నాయకుల మాటలలోనే చెప్పుకోవచ్చు. ఎంవి రమణారెడ్డి రచనా సామర్థ్యం ఉండడం వల్ల తన ప్రత్యర్థులను విమర్శిస్తూ (లేదా తన నడవడికను సమర్థించుకుంటూ) కరపత్రాలు వేయడం అతనికి అలవాటు. అతని ప్రత్యర్థులకు (ఎం.ఎల్.ఏ వరదరాజులు రెడికి, మొన్నటి ఎన్నికలో తెలుగుదేశం టికెట్టు పొందిన కోవూరు రామ సుబ్బారెడ్డికి, వీళ్ల అనుచరగణానికి) రచనా సామర్థ్యం లేకపోయినప్పటికీ తప్పనిసరయి వాళ్లు

కూడా ఎదురు కరపత్రాలు వేస్తుంటారు. వీటిలో ఈ మహానుభావులు వేసుకొనే పరస్పర నిందలన్నీ పూర్తిగా నిజం కాకపోవచ్చు. వాటిలో సగం నిజం ఉన్నా వీళ్లు నిజంగా ఘనులే. నిజానికి, వాళ్లే ఒకరి గురించి ఒకరు చెప్తేతప్ప సాధారణ ప్రజానీకానికి ఈ సత్యాలు తెలిసే అవకాశం అంతగా ఉండదు.

ఈ కరపత్రాలలో ప్రజల పరిస్థితి గురించి వాళ్లు చేసిన వర్ణనలు వింటే వాళ్లందరి ఉమ్మడి కృషి ఫలితంగా ప్రొద్దుటూరుకు ఏ గతి పట్టిందో అర్థం అవుతుంది. 'దోపిడీలకు, పట్టపగటి దొంగతనాలకు, గుండాల పెత్తనానికి గురయి నలిగిపోతూ ఉన్న పట్టణ ప్రజలు' (1991లో ఎం.వి. రమణా రెడ్డి వేసిన ఒక కరపత్రం), 'దొంగసారా వ్యాపారిని పట్టుకుంటే బంద్. వీరి అనుచరులను ఏ మన్నా బంద్. వీరూ, వీరి అనుచరులు స్త్రీలపైన అత్యాచారాలు జరిపినా ప్రజలు ప్రశ్నించరాదు. పోలీసులు అరెస్టు చేయరాదు. చేస్తే బదిలీల బెదిరింపులు. ఈ గ్యాంగులే ఉద్యోగుల భవితవ్యాన్ని నిర్ణయించేది. ఈ ప్రజాస్వామ్య ప్రముఖుల ఘనచరిత్ర ఎవరికీ తెలియనిదికాదు' (1991లో ప్రొద్దుటూరు పోలీసులు జన జాగృతి సంఘం పేరు మీద వేసిన ఆకాశరామన్న కరపత్రం), 'మాఫియా గ్యాంగులను, చరిత్రహీనులను, గుండాలను తయారుచేసి ఊరిలో భయభ్రాంతులు కల్పించిన నీవు' 'మోడంపల్లి నాగిరెడ్డికి సారాయి అంగడి ఇస్తానని చెప్పి నీ వద్దకు రప్పించుకొని అతనికి కడుపునిండా తాపి కుక్కచావుకంటే హీనంగా నీ అనుచరులచేత చంపించిన నీవు' (ఎం.వి. రమణా రెడ్డిని ఉద్దేశించి ప్రస్తుత కమలాపురం ఎం.ఎల్.ఏ. వీరశివా రెడ్డి తమ్ముడు సంటి వీరారెడ్డి 1991లో వేసిన కరపత్రం), 'తన అభీష్టానికి వ్యతిరేకంగా అన్నపు శాస్త్రుల పాలెము పాలకేంద్రం ఎన్నికల నోటీసు అంటించివస్తున్న కో-ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణను గుడిపాడులో ట్రాక్టర్ అడ్డంపెట్టి పట్టపగలు నిర్దాక్షిణ్యంగా నరికించిన ఘనుడు' (వరదరాజులు రెడ్డి గురించి ఎం.వి.ఆర్. 1994లో వేసిన కరపత్రం).

ప్రస్తుతం జైలు శిక్షల కారణంగా ఎం.వి. రమణా రెడ్డి వర్గం బాగా బలహీనపడింది. ప్రొద్దుటూరు ఫాక్షన్ రాజకీయ ఘర్షణలలో 1975-90 కాలంలో 30 నుండి 40 మంది దాకా హతం అయ్యారని పైన చెప్పాము. అందులో మూడు ఘటనలలో ఎం.వి.ఆర్. వర్గం వారికి శిక్ష పడింది. మాజీ ఎం.ఎల్.ఏ. రామసుబ్బా రెడ్డి హత్యకేసులో 1976లోనే రమణారెడ్డికి శిక్షపడింది కానీ ఆ శిక్షను హైకోర్టు కొట్టివేసింది. 1985లో చంపిన అడ్వకేట్ వీరారెడ్డి హత్యకేసులో ఎం.వి.ఆర్. వర్గీయులు అయిదుగురికి జీవిత ఖైదుపడింది. అదే సంవత్సరం ఎన్నికల విజయాభినందనల సందర్భంగా హతమార్చిన నలుగురు లక్ష్మీపేట నివాసుల హత్యకు 1988లో జిల్లా సెషన్స్ కోర్టు ఎం.వి.ఆర్.తో సహా 25 మందికి శిక్ష వేసింది. అందులో

ఎం.వి.ఆర్ ను మరి నలుగురిని హైకోర్టు విడిచిపెట్టింది. అడ్వకేట్ రామసుబ్బారెడ్డి హత్యకేసులో ఎం.వి.ఆర్‌కు పడిన శిక్షను సుప్రీం కోర్టు 1989లో ధృవీకరించింది. అయితే 1985లో తెలుగుదేశం ప్రభుత్వం జారీచేసిన ఒక జీ.వో ప్రకారము తన శిక్షపూర్తి అయినట్టేనని వాదించి కోర్టుకెక్కి ఎం.వి.ఆర్. విజయం సాధించాడు. అతను విడుదలయ్యాడు కానీ అతని అనుచరులు చాలామంది జైలులో ఉండిపోయారు.

జైలునుండి బయటకొచ్చిన తర్వాత తాను ఫాక్షన్‌లకు దూరం ఉంటాననీ జిల్లాలో ముఠాకక్షలు రూపుమాపడానికి కృషిచేస్తాననీ ఎం.వి. రమణారెడ్డి ప్రకటిస్తున్నప్పటికీ అతని వర్గం అంటే ప్రొద్దుటూరులో భయంపోలేదు. ఇది శ్మశాన వైరాగ్యమో। లేక నిజమైన హృదయపరివర్తనో తెలీదు. ఒకవేళ అతను పక్కకు తప్పుకున్నా అతని ముఠాలో నుండి ఇంకొక పాలెగాడు ఆవిర్భవించడన్న నమ్మకం లేదు.

ప్రజలపైన ప్రజల హక్కులపైనా ప్రొద్దుటూరులో ముఠా రాజకీయాల దాడిని గురించి తరువాత అధ్యాయంలో ఇంకొన్ని విషయాలు చూద్దాం.

## జమ్మలమడుగు :

కడపజిల్లా రాజకీయాలను భ్రష్టు పట్టించిన ముగ్గురు ఆధునిక పాలెగాళ్ళలో ఎమ్.వి. రమణా రెడ్డి అభ్యుదయ భావాలుగల మేధావిగా, వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రజల శ్రేయస్సుకోరే పెద్దమనిషిగా తమనుతాము చలామణీ చేసుకొనే ప్రయత్నం చేస్తారు. ఏ రంగు పూసుకోకుండా తానేమిటో నిర్మొహమాటంగా చెప్పుకున్నవాడు అపకీర్తి శేషుడు పొన్నపురెడ్డి శివారెడ్డి. (ఇతని స్వగ్రామం గుండ్లకుంట కావటం వల్ల మామూలుగా ఇతనిని గుండ్లకుంట శివారెడ్డి అంటారు). ఇతను జమ్మలమడుగు నియోజకవర్గంలో తనకు వ్యతిరేకమైన వారిని అణచడానికి వారి ప్రత్యర్థులతో గ్రామ గ్రామాన ఫాక్షన్లు పెట్టించి, వాళ్ళ హింసాకాండకు రక్షణ, ప్రోత్సాహం కల్పించి నియోజకవర్గాన్ని తన గుప్పిట్లోకి తెచ్చుకున్నాడు. 'నేను ఫాక్షన్లతోనే పుట్టాను, ఫాక్షన్లతోనే పెరిగాను' అని శివారెడ్డి అనేవాడని ఒక పోలీస్ అధికారి అంటాడు. చివరికి ఫాక్షన్ వల్లనే చనిపోయాడు. అతనికి ముఠా పద్ధతిలో తాలూకా లీడర్‌గా ఎదగడానికి తొలుత సహకరించిన దేవగుడి శంకర్ రెడ్డి కుటుంబంతోనే ఆ తరువాత అతనికి ముఠా కొట్లాటలు మొదలై , వాళ్ళవర్గం వాళ్ళను కొందరిని తాను చంపించి, చివరికి వాళ్ళ చేతిలోనే హతమయ్యాడు.

జమ్మలమడుగు, దానికి ఉత్తరాన వున్న కర్నూలుజిల్లా కోవెలకుంట్ల బ్రిటిష్ కాలంలో గ్రామీణ ముఠాకక్షలు అత్యధికంగావున్న తాలూకాలని క్రితం అధ్యాయంలో చెప్పాం.

ఈ రెండు తాలూకాలతో పాటు ప్రొద్దుటూరు (కడపజిల్లా), ఆళ్ళగడ్డ (కర్నూలు జిల్లా) తాలూకాలలోని పరిసర ప్రాంతాన్ని కలిపి 'రేనాడు' అని వ్యవహరించేవారు. (దళిత ఉద్యమకారులు ఈ మధ్య దీన్ని రెడ్డిస్తాన్ అంటున్నారు). 'ఆత్మగౌరవం, అహం, ఆధిపత్యకాంక్ష' ఇక్కడ ఎక్కువని అంటారు. కారణమేమైనా రెడ్డికులస్థులైన గ్రామీణ పెత్తందారుల ముఠా కక్షలకు ఈ ప్రాంతం నిలయమైంది.

జమ్మలమడుగు తాలూకాలో ముచ్చుమర్రి, పొట్టిపాడు, టి.కోడూరు, ఎనుముల చింతల, సుద్దపల్లి, చిన్నముడియం, పెద్దపసుపుల, జంగాలపల్లి మొదలైనవి తొలినాటి ఫాక్షన్ గ్రామాలు. టి.కోడూరు కథ గత అధ్యాయంలో చూశాము. పెదపసుపుల కాలక్రమంలో కమ్యూనిస్టుల ప్రభావంలోకి వచ్చింది. నాలుగుసార్లు కడప పార్లమెంటుకు ఎన్నికైన ఈశ్వర్‌రెడ్డిది ఆ వూరే. 1949లో అతనిని పోలీసులు అరెస్టుచేయగా గ్రామస్తులు పోలీస్‌వ్యాన్ పైన దాడిచేశారు. పోలీసులు జరిపిన కాల్పులలో ఒక వ్యక్తి చనిపోయాడు. ఐతే కడపజిల్లాలో చాలాచోట్ల జరిగినట్లు పెదపసుపులలోకూడా కమ్యూనిస్టులు నడిపిన పోరాటాలు ముఠాకొట్లాటల రూపం తీసుకున్నాయని ఒక పాత సి.పి.ఐ. నాయకుడే స్వయంగా అంటాడు. ఇందులో భాగంగా సి.పి.ఐ తో సంబంధంవున్న వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి 1972లో పెద్దపసుపులలో కామన పుల్లారెడ్డిని బాంబులువేసి చంపారు. జిల్లా ముఠా రాజకీయాలలో ఇదే మొదటి బాంబుల ఘటన. ఆ తరువాత అదే వర్గానికి చెందినవారు రామరంగారెడ్డి అనే మరొక వ్యక్తిని కూడా హతమార్చారు.

జమ్మలమడుగులో ముఠాకొట్లాటల సంప్రదాయం బలంగా వుండటం శివారెడ్డికి బాగా ఉపయోగపడింది. అతను గ్రామాలలో తన పట్టు పెంచుకోవడానికి కృషిచేసిన క్రమంలో, తనకు ఎవరు అడ్డం వచ్చినా వాళ్ళను వ్యతిరేకించటానికి సిద్ధంగా వున్నవాళ్ళను ముఠాలు కట్టటానికీ దౌర్జన్యం చేయడానికీ ప్రోత్సహించేవాడు. వాళ్ళకు అన్నిరకాల సహాయసహకారాలు అందించేవాడు. వాళ్ళు తమ ప్రత్యర్థులపైన హింసాత్మకదాడులు జరిపి తమ ఆధిపత్యం గ్రామంలో నెలకొల్పిన మేరకు, నియోజకవర్గంలో శివారెడ్డి ఆధిపత్యం బలపడింది. భూస్వామ్య మనస్తత్వంగల పాతతరం నాయకుడు తాతిరెడ్డి పుల్లారెడ్డికి వ్యతిరేకంగా శివారెడ్డిని విభిన్నశక్తులు కలిసి 1975లో సమితి ప్రెసిడెంటుగా గెలిపించారని పైన చెప్పాం. అతని చొరవను చూసి పుల్లారెడ్డిని వ్యతిరేకించటానికి అతనే తగినవాడని వాళ్ళంతా భావించారని అంటారు. (రౌడీయిజం చేయగలడన్న నమ్మకంతో అతనికి అందరూ మద్దతు ఇచ్చారని మరికొందరు అంటారు. రెండిటి అర్థం ఒకటే కావచ్చు.)

1983లో శివారెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరి ఎమ్.ఎల్.ఏ. అయ్యాడు. అప్పటినుండి అతని హింసాదౌర్జన్యాలు మితిమీరిపొయ్యాయి. గ్రామగ్రామానా ముఠాకక్షలు, ఘర్షణలు,హత్యలు, గృహదహనాలు చెలరేగాయి. తరువాత దశాబ్దికాలంలో జమ్మలమడుగు తాలుకా ముఠా కొట్లాటల్లో కనీసం అరవై హత్యలు జరిగివుంటాయని అంచనా, శివారెడ్డి ఏ పద్ధతిలో తన ఆధిపత్యం నెలకొల్పాడో అదేపద్ధతిలో అతనిని అణచడానికి వై.యస్. రాజశేఖర్ రెడ్డి అతని ప్రత్యర్థులను బలపర్చాడు. అతనిపైనా, అతని మనుషులపైనా ముఠాలు కట్టి హింసా దౌర్జన్యాలకు పాల్పడడానికి ప్రోత్సాహం, సహాయసహకారాలు అందజేసాడు. శివారెడ్డికి ప్రత్యర్థులుగా నిలబడి రాజశేఖర్ రెడ్డి సహాయంతో అతనిని ఢీకొన్నవాళ్ళు దేవగుడికి చెందిన సర్పంచ్ శంకర్ రెడ్డి కుటుంబం. మొదట్లో కమ్యూనిస్టు పార్టీతో సన్నిహిత సంబంధాలున్న ఈ కుటుంబం 1970లలో శివారెడ్డి ఎదుగుదలకు చాలా సహకరించారని చూశాం. 1983 తరువాత వాళ్ళు శివారెడ్డికి క్రమంగా వ్యతిరేకమయ్యారు. 1983-90 కాలంలో వీరిద్దరి ప్రోత్సాహంతో జమ్మలమడుగు తాలూకాలోని అనేక గ్రామాలలో బాంబుదాడులు కొట్లాటలు హత్యలు జరిగాయి. 1990 తర్వాత వీరి ఘర్షణ ప్రత్యక్షంగా ముఠా కక్ష రూపం తీసుకొని అనేక హత్యలకు దారితీసింది. జమ్మలమడుగులో ప్రజా జీవితాన్ని భయకంపితం చేసింది. చివరికి శివారెడ్డి హతమైన తరువాత కొంత చల్లారింది. మళ్ళీ ఎప్పుడు చెలరేగుతుందో ఎవరూ చెప్పలేరు.

దేవగుడి మొదటినుండీ ఫాక్షన్ గ్రామం. సర్పంచ్ శంకర్ రెడ్డి కుటుంబం ముఠా పద్ధతిలో చుట్టూవున్న గ్రామాలపైన పెత్తనం చెలాయించేది. 1978లోనే (శివారెడ్డితో వీరింకా స్నేహంగా వుండగానే) శంకర్‌రెడ్డి తండ్రి సుబ్బరామిరెడ్డిని ప్రత్యర్థులు బాంబులువేసి చంపారు. దానికి ప్రతీకారంగా వాళ్ళు బాలిరెడ్డి అనే వ్యక్తిని చంపారు. 1983 ఎన్నికలప్పటికి వీళ్ళు శివారెడ్డితోనే వున్నారు. ఆ తరువాత క్రమంగా దూరమయ్యారు. వీళ్ళు పెత్తనం చెలాయించిన గ్రామాలలో ఒకటి సుగమంచిపల్లె. సుగమంచిపల్లెకు చెందిన ఒక కుటుంబం వీరి ఆధిపత్యాన్ని వ్యతిరేకించి శతృత్వం పెట్టుకోవడంతో ఆ కుటుంబాన్ని చేరదీసి దేవగుడి ఫాక్షనిస్టుల పెత్తనాన్ని దెబ్బతీయడానికి శివారెడ్డికి అవకాశం దొరికింది. దానితో దేవగుడి శంకర్‌రెడ్డి కుటుంబానికి, శివారెడ్డికి ప్రత్యక్ష ముఠాకక్షలు మొదలయ్యాయి. సుగమంచిపల్లెకు చెందిన వెంకట్రామరెడ్డి ఒకప్పుడు దేవగుడి శంకర్ రెడ్డి ఆధిపత్యంలో భాగం పంచుకొని 1984 తర్వాత దూరమయ్యాడు. కొన్ని గ్రామాలు ఇతని ఆధిపత్యంలోకి వచ్చాయి. 1987లోను 89లోను ఇరువర్గాల మధ్య బాంబుదాడులు, ఘర్షణలు జరిగాయి. వెంకట్రామరెడ్డి శివారెడ్డిని ఆశ్రయించి అతని తోడ్పాటును పొందాడు. మొదట వెంకట్రామరెడ్డి బావమరిదైన అశ్వత్థరెడ్డిని దేవగుడివాళ్ళు హత్య చేశారు. దానికి ప్రతీకారంగా ఇవతలివర్గం 1990 డిసెంబర్‌లో

హైదరాబాదుకు బస్సులో పోతున్న శంకర్ రెడ్డిని గోపాలరెడ్డినీ షాద్‌నగర్ బస్‌స్టాండ్‌లో హతమార్చారు. దానికి ప్రతీకారంగా దేవగుడివాళ్ళు జమ్మలమడుగు పట్టణంలోని శివారెడ్డి కార్యాలయంపైన అతని మద్దతుదార్ల ఇళ్ళపైనా, ఆస్థులపైనా పెద్దఎత్తున దాడి చేశారు. దహనం చేశారు. లూటీ చేశారు. కనీసం నలభైలక్షలు నష్టంచేసి వుంటామని తామే అంటారు. రెండుకోట్ల నష్టం జరిగిందని శివారెడ్డి మనుషులు అంటారు. అప్పటినుండి నియోజకవర్గంలో ఈ రెండు ముఠాలకు ఎక్కడ ఘర్షణ జరిగినా జమ్మలమడుగు పట్టణంలో బాంబుదాడులు కాల్పులు ఆస్తుల విధ్వంసం జరగడం మామూలైపోయింది. ఎక్కడ ఏదిజరిగినా జమ్మలమడుగు పట్టణ ప్రజలు ఇళ్ళలోకిదూరి తలుపులు మూసుకొని బిక్కుబిక్కు మంటూ బ్రతికే వాతావరణం నెలకొనింది. ఆ వూరు రెండుగా చీలిందనీ ఒకరి మనుషులు మరొకరి ప్రాంతంలో అడుగుపెట్టరనీ ముఠాదారులే అంటారు. ఆ ఒక్కవూరేకాదు, నియోజకవర్గం మొత్తం రెండుగా చీలి గ్రామ గ్రామాన హింసాకాండ పెచ్చరిల్లింది. శంకర్‌రెడ్డి కుటుంబానికి పులివెందుల పాలెగాడు వై.యస్. రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహం లభించింది. కొంతకాలం హోమంత్రిగా వున్న మైసూరారెడ్డి అండకూడా దొరికింది.

ఈ ముఠా కొట్లాట నియోజకవర్గంలో సృష్టించిన భీభత్సానికి కల్లుట్ల అనేగ్రామం తార్కాణంగా నిలుస్తుంది. ఆ గ్రామంలో రామ సుబ్బారెడ్డికి రాఘవరెడ్డితో వూరి పెత్తనం విషయంలో ఘర్షణ వుండింది. ఈ రామ సుబ్బారెడ్డి షాద్‌నగర్ హత్యలు జరిగిన రోజున అదే బస్సులో హైదరాబాదు పోతున్నాడు. హత్యకేసుల ఎఫ్.ఐ.ఆర్. అతనే దాఖలు చేసాడు. 1992 లో అతని ప్రత్యర్థులు అతనిని బాంబులు వేసి గ్రామం సమీపంలోనే చంపారు. వీళ్ళు శివారెడ్డి అనుచరులు. అక్కడితో ఆగక శివారెడ్డి మనుషులు 1993 ఫిబ్రవరి 2వ గ్రామంలోని ప్రత్యర్థుల ఇళ్ళపైన బాంబులువేసి వాటిని అగ్నికి ఆహుతి చేశారు. రామ సుబ్బారెడ్డి హత్య అనంతరం గ్రామంలో ఇద్దరు కానిస్టేబుళ్లతో పికెట్ వుండింది. బాంబుదాడి జరిగినప్పుడు ఒక కానిస్టేబుల్ గ్రామంలో వున్నాడు. ఐతే అతను బాంబులు పట్టుకొని వస్తున్న గుంపుని చూసి రెండు తుపాకులూ చంకలో పెట్టుకొని పారిపోయాడని రామసుబ్బారెడ్డి కుమారుడు అంటాడు. ఈ దహనకాండలో నలభై ఐదు ఇళ్ళు కాలిపోయాయి. కాలూరు చిన్నపరెడ్డి, గడ్డం సుబ్బన్న అనే దళితుడు, మంటలలో దహనమై చనిపోయారు. మండుతున్న ఇళ్ళనుండి సకాలంలో బయటకు రాలేక కాలిపోయారా, లేక వాళ్ళను చంపి మంటలలో వేసారా, అన్నది తెలియదు.

ఇది జరిగింది ఫిబ్రవరి రెండున. ఫిబ్రవరి మూడున కడప పార్లమెంటు సభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వంలో మాజీ మంత్రి అయిన వై.యస్. రాజశేఖర్ రెడ్డి పది జీపులలో గుంపును తీసుకొని కల్లుట్లకు స్వయంగా వచ్చి రామసుబ్బారెడ్డి వర్గానికి 'ధైర్యం' చెప్పి పోయాడు. దాని

ఫలితంగా మరుసటిరోజు వాళ్ళు ఎదురుదాడిచేసి ప్రత్యర్థివర్గం ఇళ్ళు దహనం చేశారు. ఐతే హోంమంత్రి మైసూరా రెడ్డి ప్రోద్బలం వల్ల పోలీసులు మొదటి దహనకాండను మాత్రమే కేసుగా నమోదుచేసి కాలిన ఇళ్ళన్నీ అప్పుడే కాలినట్లు కేసు పెట్టారని శివారెడ్డి వర్గీయులు అంటారు. నూట యాభై ఇళ్ళున్న వూరిలో పదిళ్ళు తప్ప అన్నీ కాలిపోయాయి. డబ్బున్న ఒకరిద్దరు తప్ప వేరే ఎవ్వరూ ఈనాటికీ ఇళ్ళు కట్టుకోలేదు. కాలిన మొండిగోడల మధ్యనే బ్రతుకుతున్నారు. ఈ దహనకాండకు ప్రోత్సాహం, ప్రోద్బలం చేకూర్చిన వాళ్ళంతా బాగానేవున్నారు (శివారెడ్డి తప్ప). వాళ్ళ రాజకీయాలు వర్ధిల్లుతున్నాయి, వాళ్ళ అస్తులు, అధికారం, శోభిల్లుతున్నాయి. వాళ్ళ ముఠా రాజకీయాలలో తామూ భాగమై, తమ ఘర్షణలను నిరర్థకంగా ఆ ముఠా ఘర్షణలలో భాగంచేసిన గ్రామస్తులు మాత్రం నాశనం అయ్యారు. వాళ్ళలో కొందరు (గ్రామంలోని ఇరుపెత్తందారీ వర్గాల ముఖ్యులు) రేపు ఎప్పుడైనా ఈ నష్టాన్ని మించిన ప్రయోజనం పొందుతారేమో. కాని తక్కిన వందలాది జనానికి మిగిలేది వినాశనమే.

దీనిని కడపజిల్లా ముఠారాజకీయాల గురించి ఒక సాధారణ వ్యాఖ్యగా భావించవచ్చు. ఇటువంటి మరొక ఉదాహరణ చూద్దాం. కోడికాండ్లపల్లి అనే గ్రామం జమ్మలమడుగు తాలూకా ముద్దనూరు మండలంలో వుంది. మద్రాసు బొంబాయి రైల్వే మార్గంలోని మంగపట్నం రైల్వేస్టేషన్‌కు సమీపంలో వుంది. 1988 గ్రామ పంచాయతీ ఎన్నికలతో ఈ గ్రామంలో స్పర్థలు ప్రారంభమయ్యాయి. ఆ ఎన్నికలో ఘర్షణలు నివారించే వుద్దేశంతో ఎమ్.ఎల్.ఏ. శివారెడ్డి అనుచరుడైన తిమ్మారెడ్డిని సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అతని ప్రత్యర్థి అయిన మద్దిలేటిరెడ్డికి మాజీ ఎమ్.ఎల్.ఏ. రామనాథరెడ్డి మద్దతు ఉండింది. 1989 అసెంబ్లీ ఎన్నికలలో జమ్మలమడుగులో శివారెడ్డికి వ్యతిరేకంగా వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి బావమరిది పోటీ చేశాడు. అప్పుడు కోడికాండ్లపల్లెలోని రెండువర్గాలు చేరి ఒక పక్షమయ్యాయి. గ్రామ పంచాయతీలో ఏకమైన వాళ్ళు అసెంబ్లీలో ఏకం కాలేకపోయారు. వాళ్ళు ఒకటిగా వుంటే ఏదో ఒక నాయకుడి ప్రయోజనం దెబ్బతింటుంది కాబట్టి నాయకులు వారిని ఐక్యంగా వుండనివ్వరు. పోలింగ్ రోజున ఆ వూరిలో కొట్లాటలు జరిగాయి, బాంబులు పేలాయి. ఆ తరువాత (1989 డిసెంబర్ 8న) మద్దిలేటి రెడ్డి వర్గం సర్పంచ్ తిమ్మారెడ్డిని హతమార్చారు. 1991 మార్చి 17వ తేదీన తిమ్మారెడ్డి అనుచరులు దీనికి ప్రతీకారం తీర్చుకున్నారు. మద్దిలేటిరెడ్డి ఇంటిమీద తుపాకులతో బాంబులతో దాడిచేశారు. అతను కిరోసిన్ డీలర్ కావడంవల్ల అతని ఇంట్లో కిరోసిన్ స్టాకు వుండింది. దానితోనే అతని ఇంటిని సంపూర్ణంగా దహనం చేశారు. మద్దిలేటిరెడ్డి, అదే పేరుగల అతని తమ్ముడు, వెంకట సుబ్బమ్మ అనే స్త్రీ కాలి చనిపోయారు. మంటలలో కాలి గాయపడిన జయలక్ష్మమ్మ, జయరామిరెడ్డి, ఆ తర్వాత కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చనిపోయారు.

మంటలనుండి తప్పించుకొని పారిపోబోయిన వేమారెడ్డిని ప్రత్యర్థులు వెంటబడి తరిమి మంగపట్నం దగ్గర నరికి చంపారు.

ఈ దహనకాండకు పాల్పడిన వాళ్ళు జమ్మలమడుగు పారిపోగా మద్దిలేటిరెడ్డి మనుషులు వాళ్ళ ఇళ్ళపైన దాడిచేసి నూటయాభై ఇళ్ళు తగలబెట్టారు. శివారెడ్డి రెండురోజుల తర్వాత పారిపోయిన తిమ్మారెడ్డి మనుషులను తిరిగి గ్రామంలోకి తీసుకురాగా మద్దిలేటిరెడ్డి మనుషులు ప్రతిఘటించి వెనక్కు పంపించారు. వాళ్ళు అప్పటినుండి జమ్మలముడుగులో శివారెడ్డి పోషణలో బ్రతకసాగారు. వాళ్ళ పొలాలు మూడుసంవత్సరాలు బీడుపడి వున్నాయి. 1994 నుండి వాళ్ళు మంగపట్నంలో వుంటూ సాగుచేసుకుంటున్నారు. ఇటువైపు మద్దిలేటిరెడ్డి ఇంటితోపాటు కాలిపోయిన ఎనిమిది ఇళ్ళ వాళ్ళకు వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి తన పరపతి ఉపయోగించి ఇళ్ళస్థలాలు మంజూరు చేయించాడు. కానీ డబ్బు లేకపోవడం వల్లనేమో వాళ్ళు ఇళ్ళు కట్టుకోలేదు. వాళ్ళు గ్రామంలోని ఒక కోమటి ఆమెను బెదిరించి ఇల్లు ఖాళీ చేయించి ఆమె ఇల్లు ఆక్రమించుకున్నారని శివారెడ్డి వర్గీయుల ఆరోపణ.

సారాయి వ్యాపారం విషయం కూడా కొంత చెప్పుకోవాలి. సారాయి వ్యాపారం మీద ముఠా నాయకులు 1980లో నెలకొల్పిన గుత్తాధిపత్యం ఈ పాలెగాళ్ళ చరిత్రలో ఒక ముఖ్య ఘట్టమని పైన వివరించాం. తమ ముఠా దౌర్జన్యాలను వినియోగించుకొని సారా వ్యాపారంమీద గుత్తాధిపత్యం నెలకొల్పారు. అందులో సంపాదించిన లక్షలాది రూపాయలు ముఠాల విస్తరణకు, పెరుగుదలకు పనికొచ్చాయి. డబ్బు, దౌర్జన్యం ఉన్నవాడికే ఎన్నికలలో టికెట్లిచ్చే రాజకీయనీతి యిదే దశలో ప్రబలడం వల్ల సారా వ్యాపారస్తులైన ఫాక్షనిస్టులే అన్ని పార్టీల నాయకులయ్యారు. ఎమ్మెల్యేలు, మంత్రులు అయ్యారు. రాజకీయం, సారాయి, ముఠాదౌర్జన్యాలు ఒకదాని నొకటి పెనవేసుకుని వర్ధిల్లాయి.

సారా వ్యాపార లాభాలను ఊరి అభివృద్ధికోసం వినియోగించే ప్రయత్నంలో భాగంగా చాలాచోట్ల గ్రామకమిటీలు, పట్టణ కమిటీలు ఏర్పడిన సంగతిపైన వివరించాము. ఆ కమిటీలు కూడా పాలెగాళ్ళ వాత పడేంతవరకు వాటివల్ల చాలా ఊళ్ళలో కొంతవరకు ప్రయోజనం కలిగింది. ప్రొద్దుటూరు డెవలప్‌మెంట్ ట్రస్టును ఎం.వి.రమణారెడ్డి సొంతం చేసుకున్న వైనాన్ని పైన వివరించాం. జమ్మలమడుగులో కూడా అటువంటి ఒక డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఉండింది. దాని ఆధ్వర్యంలో సారా వ్యాపారుల నుండి డబ్బులు సేకరించి జమ్మలమడుగులో ఒక డిగ్రీ కాలేజి, ఒక జూనియర్ కాలేజీ, ఒక హైస్కూలు, ఒక ఐ.టి.ఐ. నెలకొల్పారు. (ఈ దశలోకూడా శివారెడ్డి ట్రస్టుమీద పెత్తనం నెలకొల్పి దాని నిధులు కొంతమేరకు సొంతం చేసుకున్నాడని అతని ప్రత్యర్థులంటారు). అయితే దేవగుడి

ముఠాదారులు, శివారెడ్డి తమ పోటీని సారాయి వ్యాపారంలోకి తీసుకువచ్చిన తరువాత ట్రస్టు మూతబడవలసి వచ్చింది. 1987లో దేవగుడి వాళ్ళు సారా కాంట్రాక్టు తీసుకుని, ట్రస్టుకు యిస్తామని ఒప్పుకున్నదానిలో ఆరులక్షలు బకాయిపెట్టారు. మరుసటి సంవత్సరం శివారెడ్డి సారా కాంట్రాక్టు 42 లక్షలకు పాడుకొని ఆ ఆరులక్షలు వసూలు చేసుకుంటేనే తాను ఈయవలసింది యిస్తానని దబాయించి అసలేమీ ఈయలేదు. ఈ విధంగా ట్రస్టు మూతబడే పరిస్థితి వచ్చింది. ఈ ఇద్దరు ముఠాదారులు యితర విషయాలలో ప్రాణాంతకంగా ఘర్షణ పటుతూ, సారాయి విషయంలో మాత్రం రాజీ పడుతూ కోట్లాది రూపాయల లాభం సంపాదించుకున్నారు. 1990 తర్వాత వీరిద్దరి ఘర్షణ పతాకస్థాయిని అందుకుంది. కాని సారా వ్యాపారం విషయంలో మాత్రం యిద్దరూ యిబ్బంది లేకుండా రాజీకి వచ్చి ప్రతీ సంవత్సరము ఒకరు కాంట్రాక్టు తీసుకోవడం, మరొకరికి కొంత ముడుపు చెల్లించుకోవడం అలవరచుకున్నారు. వీళ్లు ఈ విధంగా సునాయాసంగా కోటీశ్వరులవుతుంటే వీళ్ల వెంబడిపోయి కొట్లాటలలో హతమవుతున్నవారి కుటుంబాలు నాశనమవుతున్నాయి.

జమ్మలమడుగు నియోజకవర్గంలో కొండాపురం మండలం గురించి విధిగా కొంత చెప్పుకోవాలి. నియోజకవర్గంలోని యితర ప్రాంతాలలో శివారెడ్డికి ప్రధాన ప్రత్యర్థులు దేవగుడి శంకర్‌రెడ్డి కుటుంబం కాగా, కొండాపురం మండలంలో అతని ప్రత్యర్థిగా నిలబడింది మాజీ ఎం.ఎల్.ఏ రామనాథ రెడ్డి. ముగ్గురాళ్ల గనులలో కోట్లు సంపాదించిన రామనాథ రెడ్డి దేవగుడి వాళ్లలాగా స్వయంగా ఫాక్షనిస్ట్ కాడు. అయితే తన రాజకీయ ప్రయోజనాల కోసం ముఠాలను, ముఠా కక్షలను పోషించడానికి ఎన్నడూ వెనకాడని మనిషి రామనాథ రెడ్డి. ఒక గ్రామంలో శివారెడ్డి మనుషులకు వ్యతిరేకంగా ముఠాకట్టి వారితో తలపడడానికి ఎవరు సిద్ధపడినా వారికి చాలా ఉదారంగా డబ్బులిచ్చి పోషిస్తాడు. 'రామనాథ రెడ్డి రాజకీయ ఘర్షణల కోసం యిచ్చిన డబ్బు సాగునీటికోసం యిస్తే కొండాపురం సస్యశ్యామలం అయ్యుండేది' అనేది ఒక ప్రత్యర్థి అభిప్రాయమే అయినప్పటికీ అందులో సత్యం చాలా వుంది. ఈ డబ్బులివ్వడంలో తన రాజకీయ ఆధిపత్య ప్రయోజనాలే తప్ప అతనికి వేరే నీతి నియమాలేవీలేవని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అది అతని ఒక్కడి దుర్గుణం కాదు.

రామనాథ రెడ్డి చేసే ముఠాల పోషణ గురించి యిక్కడ ఒక కథ మాత్రం చెప్పుకుందాం. కొండాపురంలో పురుగుల మందులు తయారుచేసే చిన్నతరహా మిల్లు వున్న ఒక వైశ్య కుటుంబంవుంది. వాళ్ల రాజకీయంగా శివారెడ్డి మనుషులు. కాని హింసాదౌర్జన్యాలు ఎరగరు. 1988 గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఈ కుటుంబానికి చెందిన గ్రంధే రామమోహనరావు, రామనాథ రెడ్డి మనుషులకు వ్యతిరేకంగా కొండాపురం సర్పంచ్‌గా పోటీచేసి ఓడిపోయాడు. అప్పటినుండి ఆ కుటుంబానికి రామనాథ రెడ్డి మనుషుల నుండి

బెదిరింపు ఎక్కువైంది. 1991 లేక 92లో ముసుగులు వేసుకున్న సాయుధ యువకులు ఒకరాత్రి వాళ్ల యింట్లో డెకాయిటికి పాల్పడి బెదిరించి 15 తులాల బంగారం దొంగిలించిపోయారు. మళ్లీ 1994 మే 11 రాత్రి ముసుగు యువకులు దొంగతానానికి వచ్చి రామమోహనరావు తమ్ముడు రామకృష్ణారావును గొడ్డలితో తలపైన, మెడపైన తీవ్రంగా గాయపరచి 100 గ్రాముల బంగారం తీసుకుపోయారు. ఒకనెల ఆస్పత్రిలో వుండి బయటపడిన రామకృష్ణా రావు పూర్తిగా కోలుకోక మరుసటి సంవత్సరం జనవరి 8 నాడు చనిపోయాడు.

ఈ డెకాయిటీలకు పాల్పడినవారు మామూలు బందిపోట్లు కారని, దత్తాపురం గ్రామంలో రామనాథ రెడ్డి మద్దతుతో ఫాక్షన్ నడిపిన అన్నెం రామిరెడ్డి. కుటుంబీకులని అందరికీ తెలుసును. పోలీసులు మాత్రం తెలియనట్లు నటిస్తున్నారు. వీళ్ల తమ ఊరిలో బలంగా ఉన్న శివా రెడ్డి వర్గీయుల ధాటికి తట్టుకోలేక వ్యవసాయం బీడుపెట్టి డెకాయిటీలు చేసుకుని బతుకుతున్నారు. వీళ్ల బందిపోటు చర్యలు రామనాథ రెడ్డికి రాజకీయంగా ఉపయోగపడుతున్నాయి.

దత్తాపురం కథ కూడా క్లుప్తంగా చెప్పుకుంటే బాగుంటుంది. ఆ ఊరిలో 1969 పంచాయతీ ఎన్నికలప్పటినుండి ముఠాకక్షలున్నాయి. అప్పుడు అన్నెం రామిరెడ్డి, శింగన కొండారెడ్డి పోటీ చేశారు. రామిరెడ్డి మనుషులు శింగన కొండారెడ్డిని దారికాచి కొట్టారు. దానితో మొదలైన ఘర్షణలో శింగన కొండారెడ్డి గ్రూపు 1971లో రామిరెడ్డి వర్గానికి చెందిన ముగ్గురిని నరికి చంపారు. ఈ కేసు కోర్టులో కొట్టుడుపోగా ఇరు వర్గాలూ తాత్కాలికంగా రాజీపడ్డారు. అయితే హత్యకేసులో ముద్దాయి అయిన ఎం.వి. రామలింగేశ్వర్ రెడ్డిని 1989లో అన్నెం వర్గీయులు రోడ్డులో పట్టుకుని 'గొంతు కోసి తలకాయ మొండెం పక్కన పెట్టారు ఈ ఘర్షణలో అన్నెం వర్గానికి మాజీ ఎమ్మెల్యే రామనాథరెడ్డిమద్దతు, శింగన కొండారెడ్డి వర్గానికి ఎమ్మెల్యే శివారెడ్డి మద్దతు లభించాయి. 1992లో శింగన కొండారెడ్డి వర్గం ఒక హత్య, 1993లో అన్నెం వర్గం వాళ్ళు యింకో రెండు హత్యలు చేశారు. ప్రత్యర్థులు గ్రామంలో చాలా బలంగా వుండడం వల్ల అన్నెం కుటుంబీకులు ఊరు వదిలిపెట్టి వెళ్లిపోయారు. రామలింగేశ్వర రెడ్డి హత్య తర్వాత మూడునెలలకు ముద్దాయిలైన అన్నెం వర్గీయులను వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి స్వయంగా వెంటబెట్టుకొని ఊరిలోకి తీసుకొచ్చాడట. గ్రామీణ ముఠాలను పోషించే నాయకులు చేయవలసిన ముఖ్యమైన సేవలలో హంతకులను సురక్షితంగా ఊరు చేర్చే ఈ కర్తవ్యం ఒకటి. అయితే రామలింగేశ్వర రెడ్డి భార్య బాలసుబ్బమ్మ ఆ పెద్దమనిషిని తిట్టి అతనిని, ముద్దాయిలను వెనక్కి పంపించింది. దత్తాపురంలో శివారెడ్డి మనుషుల టెర్రర్ ఎంతటిదంటే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఏజెంటు కూర్చునే ప్రసక్తి లేదు.

పార్లమెంటు ఎన్నికప్పుడు తన ఏజెంటును కూర్చోబెడదామని వై.ఎస్. రాజ శేఖరరెడ్డి స్వయంగా వెళ్లినా అది సాధ్యంకాలేదు.

ఈ విధంగా గ్రామ బహిష్కృతులైన 'అన్నెం' అన్నదమ్ములు తమ 25 ఎకరాల భూమిని బీడుపెట్టి, వై.ఎస్. కుటుంబానికి అప్పుడప్పుడు అనుచరులు, అప్పుడప్పుడు శత్రువులైన పులివెందుల ఎరుకలవాళ్లతో కలిసి డెకాయిటీలు చేసి బతుకుతున్నారు. వాళ్ల బందిపోటు చర్యలు కొండాపురంలో గ్రంథే రామమోహనరావు కుటుంబానికి 'బుద్ధి చెప్పడానికి' రామనాథరెడ్డికి పనికొచ్చాయి.

ప్రజల జీవితంపైన జమ్మలమడుగు ముఠా రాజకీయాల ప్రభావం గురించి తర్వాత అధ్యాయంలో ఇంకొంచెం చూద్దాం.

## పులివెందుల :

ఎమ్.వి. రమణారెడ్డి కథ ప్రొద్దుటూరుకే పరిమితం. పొన్నపురెడ్డి శివారెడ్డి కథ జమ్మలమడుగుకే పరిమితం. కానీ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి కథ కేవలం పులివెందులకే పరిమితం కాదు. అతను పులివెందులలో జవాబులేని నాయకునిగా ఎదగడంతోపాటు, కడపజిల్లాలోనే తనకు ఎదురులేకుండా చేసుకునే ప్రయత్నం చేశాడు. ఇప్పటివరకు విజయం సాధించాడనే చెప్పుకోవచ్చు. ఇది ప్రజలకు సేవచేయడం ద్వారా సాధించుకొని వుంటే ఎవరికీ అభ్యంతరం వుండవలసిన అవసర ంలేదు. కానీ రాజశేఖర్ రెడ్డి ఈ స్థితిని సాధించింది ప్రజాసేవ ద్వారా కాదు. కడప జిల్లాలోని ముఠాకక్షల సంస్కృతినీ, ముగ్గురాళ్ళ డబ్బులనూ, చాలా చాకచక్యంగా వాడుకోవడం ద్వారా సాధించాడు. అయినప్పటికీ రమణారెడ్డికీ శివారెడ్డికీ హంతకులనీ, రౌడీలనీ చెడ్డపేరురాగా రాజశేఖర్ రెడ్డి మాత్రం పెద్దమనిషి 'ఇమేజ్' పూర్తిగా చెరిగిపోకుండా కాపాడుకోగలిగాడు. పత్రికలు సైతం అతని గురించి చెడు ఎక్కువ రాయవు. అతనివల్ల జరిగే హింసాకాండ పత్రికలకు ఎక్కినా అతని పేరుమీద ఎక్కదు. అతనిని ఒక దౌర్జన్యకారునిగా కాక ప్రజానాయకునిగానే పత్రికలు చూపిస్తాయి. సభ్య సమాజంలో అధికభాగం కూడా అదే విధంగా స్వీకరిస్తుంది. అతను స్వయంగా రిగ్గింగ్ చేశాడు. ఇతర ఎన్నికల అక్రమాలకు స్వయంగా పాల్పడ్డాడు. హత్యలు చేయించాడు. డబ్బుపెట్టి రాజకీయాలనుకొన్నాడు. తన ప్రాబల్యం పెంచుకోవడానికీ ప్రత్యర్థులను మట్టుపెట్టడానికీ, రౌడీలను హంతకులను బందిపోట్లను మట్కా ఆడించేవాళ్ళను, దొంగసారా అమ్మేవాళ్ళను చేరదీసాడు. ఉదాహరణకు మొన్నటి అసెంబ్లీ ఎన్నికలు కమలాపురంలో మైసూరారెడ్డిని ఓడించడానికి దొంగసారాయి, మట్కా వ్యాపారాలకు పేరుపొందిన తెలుగుదేశం అభ్యర్థి వీరశివారెడ్డికి బాహాటంగా మద్దతుఇచ్చాడు. ఎక్కడ అగ్గిరాజుకున్నా తనకు అనుకూలమనిపిస్తే

దానిని పెంచి దావానలం చేశాడు. అగ్గిని చల్లార్చడం తనకు ఎక్కువ ప్రయోజనమైతే ఆ పనీ చేశాడు. అయినా ఏదో మాయాజాలం అతని ప్రతిష్ఠను కాపాడుతూనేవుంది. తండ్రి రాజారెడ్డి దౌర్జన్యాలకు జవాబులేదనీ కొడుకు రాజశేఖర్ రెడ్డి సమ్మోహన శక్తికి అడ్డులేదనీ ఈ మాయాజాలం నమ్మింపజేస్తుంది. తండ్రీ కొడుకులు జంటగా దీనివల్ల ప్రయోజనం పొంది వర్ధిల్లుతున్నారు.

వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి దౌర్జన్యంతోపాటు డబ్బుకూడా పెద్ద ఎత్తున రాజకీయాలలోకి తీసుకువచ్చాడు. 1978 నుండి మంగంపేట బెరైటీస్ గనుల డబ్బులు రాజకీయాలలోకి రావడంతో జిల్లా రాజకీయాల రూపమే మారిపోయిందని పరిశీలకులు అంటారు. జిల్లా రాజకీయాల పతనం దానితో ప్రారంభమైందంటారు. రాజకీయాలలోకి హింసా దౌర్జన్యాలూ ముఠాకక్షలూ ప్రవేశించింది కూడా ఆ దశలోనే కాబట్టి పతనానికి కారణం ఫలానా అని చెప్పటం కష్టం కావచ్చు.

కోడూరు మండలంలోని మంగంపేట గనులలో ముగ్గురాళ్ళ తవ్వకం 1925నుండి వుంది. కానీ మొదట్లో ముగ్గురాళ్ళకు మార్కెట్ ఎక్కువ లేదు. పెట్రోలియం శుద్ధిలో మంగంపేట ముగ్గురాళ్ళు ఉపయోగపడతాయని కనుక్కున్న తర్వాతే (1970లలో) వాటి ధర పెరిగింది. వై.యస్. రాజారెడ్డి 1964 లో వెంకటనర్సయ్య అనే ముగ్గురాళ్ళ వ్యాపారికి పార్ట్‌నర్‌గా మంగంపేట బైరైటీస్ గనులలోకి ప్రవేశించాడు. (మొదట సూపర్‌వైజర్‌గా ప్రవేశించి తరువాత పార్టనర్ అయ్యాడంటారు). ముగ్గురాళ్ళ ధర పెరిగిన తర్వాత ఆ పార్ట్‌నర్‌ను తొలగించుకొనే ప్రయత్నంలో రాజశేఖర్ రెడ్డి వెంకటనర్సయ్యను 1975లో చంపించాడు. 1978లో రాజశేఖర్‌రెడ్డి ఎన్నికలలో ప్రవేశించి ముగ్గురాళ్ళ డబ్బులు పెద్దఎత్తున కుమ్మరించి పులివెందులనుండి గెలిచాడు.

వై.ఎస్. కుటుంబంతోపాటు మంగంపేట బై రైటీస్ గనుల వల్ల కోటీశ్వరులయిన వాళ్ళ కందుల ఓబుల్ రెడ్డి, సి.ఎం. బలరాంరెడ్డి. వీళ్ల చేతిలోకి అంతకు ముందెన్నడూ లేనంత డబ్బువచ్చింది. దానిని ఖర్చుపెట్టి 1978 తరువాత వాళ్ళు జిల్లా రాజకీయాలలో ఆధిపత్యం కోసం ప్రయత్నంచేసారు. వోట్లు కొన్నారు. ఫాక్షనిస్టుల మద్దతుకొన్నారు. ఓబుల్‌రెడ్డి ఎం.పి. అయ్యాడు. అతని కొడుకు శివానందరెడ్డి కడప ఎం.ఎల్.ఏ. అయ్యాడు. బలరాంరెడ్డి జిల్లా పరిషత్ ఛైర్మన్ అయ్యాడు, అతని తమ్ముడు రాంనాథ రెడ్డి జమ్మలమడుగు ఎం.ఎల్.ఏ. అయ్యాడు. రాజశేఖర్ రెడ్డి 1978 నుండి అసెంబ్లీకీ పార్లమెంటుకూ గెలుస్తూనే ఉన్నాడు. ముగ్గురాళ్ల లాభాలు వేసిన ఈ వరవడిలోకి 1980 తరువాత సారాయి వ్యాపారలాభాలు ప్రవేశించాయి. ముగ్గురాళ్ల వ్యాపారం కొద్ది మందికే పరిమితంకాగా సారాయి వ్యాపారం

దౌర్జన్యంచేసే సత్తా ఉన్న ప్రతీ ఒక్కడిసొత్తు అయింది. ఈ డబ్బు జిల్లా రాజకీయాలను దిగజార్చింది. పైన వివరించినట్టు, సరిగ్గా ఇదే సమయంలో ఆధిపత్యం కోసం హింసా దౌర్జన్యాలు ప్రయోగించే రాజకీయ సంస్కృతి జిల్లాలో ప్రబలింది. రాజకీయ నాయకులు స్వయంగా ముఠాలు కట్టి ఆధిపత్యంకోసం దౌర్జన్యానికి పాల్పడడమేకాక, గ్రామాలలో ఫాక్షన్లు పెట్టించి, ఉన్న వాటిని పెంచిపోషించి, తమ పురోగమనానికి పునాది వేసుకున్నారు. రాజకీయాలలోకి పెద్దఎత్తున ప్రవేశించిన డబ్బుకు, పెద్దఎత్తున పెరిగిన ముఠా దౌర్జన్యాలకూ సన్నిహిత సంబంధం ఉంది. ఆ సంబంధాన్ని వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి రాజకీయ చరిత్రలో చూడవచ్చు.

వై.యస్. కుటుంబం మొదట్లో పెద్దగా ధనవంతులుకారు. రాజారెడ్డి తండ్రి కాలంలో 1970లలో బలపనూరు నుండి పులివెందులకు వచ్చి వ్యవసాయం, కాంట్రాక్టులు చేసుకొని బ్రతికేవారు. పులివెందుల తాలూకాలో ఆధిపత్యం చలాయిస్తున్న డి.ఎన్. రెడ్డితో రాజకీయంగా తలపడ్డారు. మిల్లు ఓనర్లు, భూస్వాములు, ఫ్యూడల్ అహంభావులు అయిన డి.ఎన్. రెడ్డి కుటుంబం ఆధిపత్యాన్ని ఎదుర్కోవడానికి కొంత రౌడీగా పేరు పొందిన రాజారెడ్డిని మిగిలినవాళ్ళు (కమ్యూనిస్టు పార్టీతో సహా) సపోర్టు చేశారు. డి.ఎన్. రెడ్డి కుటుంబం హింసా దౌర్జన్యాలు అసలే ఎరుగని వారేంకారు. తమ పద్ధతిలో వాళ్ళు చేసేవారు. పులివెందులకు చెందిన కొందరు ఎరుకల వాళ్లు డెకాయిటీలు చేసి బంగారం తీసుకొస్తే డి.ఎన్. రెడ్డి కుటుంబం ఆ బంగారాన్ని మారకం చేసేవారని అంటారు. అయినప్పటికీ రాజారెడ్డి ప్రయోగించిన హింసా దౌర్జన్యాలకు తట్టుకోలేక వాళ్లు వెనక్కి తగ్గారు. 'వాళ్ల గేటు బయటే వాళ్ల మనుషులను రాజారెడ్డి చంపిపోయినా మాట్లాడలేని స్థితికి దిగజారారు' అని ఒక పులివెందుల నివాసి అంటాడు.

రాజారెడ్డి పేరు చెప్తేనే జనం భయపడే స్థితి 1960లలోనే మొదలయింది. 1970లలో డబ్బులు, దాని వెంబడి కొడుకు రాజశేఖర్‌రెడ్డికి రాజకీయాలలో హోదా, రావడంతో ఈ టెర్రర్‌కు తిరుగులేకుండా పోయింది. 1963 (లేక 64) లో రాజారెడ్డి చేయించిన ఒక పట్టపగటి హత్యను ఈ సందర్భంలో స్థానికులు ఉదహరిస్తారు. పులివెందుల ఎరుకలవాళ్లంటే జనంలో కొంత భయం ఉంది. వాళ్లలో కొందరు బందిపోట్లు, దొంగసారాయి అమ్మేవాళ్లు, దౌర్జన్యాలకూ దొమ్మీలకూ రాజకీయ నాయకులకు ఉపయోగపడేవాళ్లు, ఆనాడూ, ఈనాడూ ఉన్నారు. వాళ్లను అటు డి.ఎన్. రెడ్డి కుటుంబం, ఇటు వై.యస్. కుటుంబం వాడుకున్నారు. కానీ రాజారెడ్డి తన భుజబలం ప్రదర్శించుకోవడానికి వాళ్లను టార్గెట్‌గానూ ఉపయోగించుకున్నాడు. 1963 (లేక 64)లో జరిగిన ఆ సంఘటనలో ఊసన్న అనే ఎరుకల

అతన్ని రాజారెడ్డి పట్టపగలు కిరోసిన్‌పోసి సజీవంగా దహనం చేసి చంపించాడు. ఒక రెడ్డి కులానికి చెందిన స్త్రీ మెడలోని గొలుసు దొంగిలించడానికి ఊసన్న ప్రయత్నించాడనీ, ఆమె పెనుగులాడడం చూసిన జనం దృష్టి అటువైపు మళ్లించగా ఆమె తన భార్య అనీ తనతో రానంటుందనీ చెప్పి తప్పించుకొన్నాడనీ కథ. రాజారెడ్డి అదేరోజు అతనిని పట్టుకొని బహిరంగంగా సజీవదహనం చేయించాడు. అప్పటినుండి రాజారెడ్డిని ఎదిరించాలంటే జనం భయపడే పరిస్థితి నెలకొనిందంటారు.

1960లలోనే కోడూరు సమీపంలోని మంగంపేట ముగ్గురాళ్ల వ్యాపారంలోకి వై.ఎస్. రాజారెడ్డి ప్రవేశించాడు. పెద్దగా విలువలేని ఈ వ్యాపారాన్ని మొదట ప్రారంభించి చాలా ఏళ్ళు నిర్వహించిన వారిలో ముఖ్యులు ముగ్గురాళ్ల కిష్టయ్య, సలారుద్దీన్. దాని విలువ పెరిగేనాటికి అది రెడ్ల చేతిలోకిపోయింది. రాజారెడ్డి వెంకటనర్సయ్య అనే పద్మశాలీ కులస్తుడయిన వ్యాపారి పార్ట్నర్‌గా చేరాడు. కోడూరు, పులివెందులలో జిల్లాకు తూర్పు పడమరలయినప్పటికీ రాజారెడ్డిని వెంకటనర్సయ్య తీసుకోవడానికి కారణం లేకపోలేదు. అతను కూలివాళ్లను అదుపులో ఉంచడానికి పనికివస్తాడనీ వ్యాపారసంబంధమయిన ఘర్షణలలో తన సంస్థ నిలదొక్కుకోవడానికి పనికొస్తాడనీ అతన్ని తీసుకున్నాడు. ఈ ఆలోచన తనకే ఎసరుపెడతాడని బహుశా వెంకటనర్సయ్య ఊహించి ఉండడు. వై.యస్. వాళ్లు అతనిని వదిలించుకోవడానికి 11 లక్షలు ఇచ్చి బయటికి పంపించే ప్రయత్నం చేసారు. ఈ ప్రయత్నానికి గజ్జెల మల్లారెడ్డి (ఒకప్పటి కమ్యూనిస్టు నాయకుడు, ఆ తరువాత పత్రికా సంపాదకుడు) మధ్యవర్తిత్వం నెరపినట్టున్నాడు. అయితే వెంకటనర్సయ్య ఈ బేరంతో సంతృప్తి చెందలేదు. వై.యస్. వాళ్లు అతనిని చంపించి సమస్యను పరిష్కరించుకున్నారు. ఈ హత్య రాజశేఖర్ రెడ్డి చేయించాడంటారు. దానికి ప్రతీకారంగా ఆ తర్వాత వెంకటనర్సయ్య బంధువులు హైదరాబాద్‌లోని రాష్ట్ర సెక్రటేరియట్‌లోనే రాజశేఖర్ రెడ్డిపైన కాల్పులు జరిపారు. అతను తప్పించుకొన్నాడు.

బైరైటీస్‌కు మార్కెట్ పెరిగిన తర్వాత ఆ ఖనిజం గనుల శాఖ అజమాయిషీలోకి వచ్చింది. పట్టా భూములున్న వారయినాసరే ప్రభుత్వం దగ్గర లీజు తీసుకొని తవ్వకం చేయాలి. ప్రభుత్వ భూములలో కూడ లీజు ఇచ్చారు. వై.ఎయు. రాజారెడ్డి కంపెనీ (విజయలక్ష్మి బైరైటీస్) 10 ఎకరాల లీజు తీసుకుంది. అయితే 1982లో రాష్ట్ర ప్రభుత్వం మంగంపేటలోని పట్టాభూములను స్వాధీనంచేసుకుని ముగ్గురాళ్ళ త్రవ్వకాన్ని జాతీయం చేసి రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థకు (ఎ.పి.యం.డి.సి) లీజుకు ఇచ్చింది. ఈ సంస్థ తానే త్రవ్వకం చేపట్టకుండ ముందునుండి వ్యాపారం చేస్తున్నవాళ్ళకు సబ్ లీజు ఇవ్వనారంభించింది.

వై.యస్. రాజారెడ్డి 8 ఎకరాలు సబ్‌లీజుకు తీసుకున్నాడు. ఈ సబ్‌లీజు నిజానికి నామ మాత్రమే. కొన్ని ఎకరాలు సబ్‌లీజుకు తీసుకుంటే ఆ పేరుమీద ఎన్ని ఎకరాలలో ఖనిజం త్రవ్వుకుపోయినా అడిగే వాడుండడు. వై.యస్. వాళ్ళు మంగంపేటలో నేషనల్ మాన్యుమెంట్‌గా పురావస్తుశాఖ ప్రకటించిన రక్షిత భూభాగాన్ని సహితం త్రవ్వుకుని పోయిన సంగతి తెలిసినదే. 1989 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ గెలిచిందని ప్రకటించిన రాత్రే ఈ రక్షిత ప్రాంతంలో దౌర్జన్యపూరితంగా త్రవ్వకాలు మొదలు పెట్టారని అంటారు. ప్రభుత్వం మేలుకుని ఆపేటప్పటికి చాలా ఖనిజం త్రవ్వుకుని పోయారు. ఒక లక్ష యాభైవేల టన్నులు త్రవ్వుకుని పోయారని అధికారుల అంచనా. (కె.వి.నటరాజన్ కమీషన్). ఒక టన్ను వెల ఆరువందల రూపాయలు. రాష్ట్ర అసెంబ్లీ ఈ విషయాన్ని పరిశీలించడానికి ఒక అసెంబ్లీ సబ్ కమిటీని నియమించింది. వాళ్ళ అంచనా ప్రకారం వై.యస్. వాళ్ళు త్రవ్వుకుని పోయింది యాభైవేల టన్నులు. అందుకు జుర్మానాగా యాభైలక్షల రూపాయలు వసూలు చేయమని ఆ సబ్‌కమిటి సూచించింది.

వై.యస్. కుటుంబం బై రైటీస్ చరిత్రలో వెంకటనరసయ్య హత్య ఒకటేకాక మరొక వికారమైన సంఘటన కూడాఉంది. మంగంపేట గ్రామానికి చెందిన రాజగోపాల్ అనే రిటైర్డు ప్రభుత్వఅధికారి మేనల్లుడు వివేకానందంకు 1.8 ఎకరాల పట్టాభూమి ఉండింది. అందులో ముగ్గురాళ్ళ త్రవ్వకం చేపట్టడానికి అతను రహంతుల్లా అనే వ్యాపారితో కలిసి 15 లక్షల పెట్టుబడి పెట్టాడు. ఇంతలో ప్రభుత్వం ముగ్గురాళ్ళ గనులున్న పట్టాభూములన్నింటిని స్వాధీనంచేసుకుని ఖనిజ అభివృద్ధి సంస్థకు అప్పగించింది. అందులో భాగంగా వివేకానందం భూమికూడా ప్రభుత్వం చేతిలోకి పోయింది. అయితే అతను దీనిమీద కోర్టుకుపోయి తన 1.8 ఎకరాలమేరకు స్టే ఆర్డరు తెచ్చుకున్నాడు. కాని అప్పటికే ఈ 1.8 ఎకరాలతో సహా మొత్తం 8 ఎకరాలు వై.యస్. వాళ్ళ కంపెనీకి ఎ.పి.యం.డి.సి. సబ్‌లీజుకు ఇచ్చింది. కోర్టు స్టే ఇచ్చినా వాళ్ళు ఆ 1.8 ఎకరాలనుండి వైదొలగలేదు. వివేకానందం మేనమామ రాజగోపాల్ అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డిని కలిసి తమ భూమిని వై.యస్. వాళ్ళకు సబ్ లీజుకు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించాడంట. దానికి జవాబుగా, ''మీరు కువైట్‌కు వెళ్ళిపోయారని రాజశేఖర్ రెడ్డి చెప్పాడు'' అని ఆయన అన్నాడట ఆ 1.8 ఎకరాలను స్వాధీనంచేయాలని వివేకానందం హైకోర్టులో మళ్ళీ పిటీషన్ వేశాడు. దీనికి ప్రతీకారంగా 1992లో ఒకనాడు రాజశేఖర్ రెడ్డి మనుషులు రాజగోపాల్‌పైన హైదరాబాద్‌లో ఘోరంగా దాడిచేశారు. ఆబిడ్స్ రోడ్డులోని ఒక హోటల్ దగ్గర కాపుకాసి అతనిమీద దాడిచేసి కాళ్ళుచేతులు విరగ్గొట్టారు. ఆ తర్వాత వివేకానందం తన భూమిని తిరిగి

స్వాధీనంచేసుకోగలిగాడు కాని అప్పటికే 5 కోట్లరూపాయల విలువచేసే ఖనిజాన్ని వై.యస్. వాళ్ళు త్రవ్వుకొనిపోయారు.

1978 నాటికే ముగ్గురాళ్ళ వ్యాపార లాభాలు వై.యస్. కుటుంబానికి చాలా ఆదాయం సమకూర్చాయి. రాజశేఖర్ రెడ్డి యం.పి.గా ఎన్నిక కావడానికి ఈ సంపద బాగా ఉపయోగపడింది. ఓట్లు కొనుక్కోవడానికేకాక గ్రామీణ ఫాక్షనిస్టులను తనవైపు తిప్పుకోవడానికి, తన ప్రత్యర్థులకు వ్యతిరేకంగా ఫాక్షన్లను పెట్టించడానికి ఈ డబ్బు ఉపయోగపడింది. పులివెందుల తాలూకాలోని గ్రామాలలో డి.ఎన్.రెడ్డి ప్రాబల్యాన్ని తుదముట్టించే కార్యక్రమం కొనసాగింది. ఈ క్రమంలో చాలా హత్యలు జరిగాయనీ, అయితే ఇప్పుడు ఆ తాలూకాలో రాజశేఖర్ రెడ్డికి ఎదురు మాట్లాడేధైర్యం ఎవరికి లేదు కాబట్టి వివరాలు తెలుసుకోవడం కష్టసాధ్యమని స్థానికులు అంటారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూర్లకంటె పులివెందులలోనే ఎక్కువ హత్యలు జరిగాయనీ, అయితే వై.యస్. కుటుంబం ప్రత్యక్షపాత్ర ఉన్న హత్యలకంటే వాళ్ళ అండచూసుకుని వాళ్ళ పంచనచేరిన వాళ్ళు చేసిన హత్యలే ఎక్కువని అంటారు. ప్రత్యక్షపాత్ర ఒకవేళ ఉన్నా ఆ తప్పు రాజారెడ్డి మీదకు పోతుంది. రాజశేఖర్ రెడ్డి సహితం తన తండ్రికి తొందరపాటు ఎక్కువని, అతను ఆధునిక ప్రజాస్వామ్య భావాలు తెలియని పాతకాలపు మనిషని సర్ది చెపుతుంటాడు. తాను మాత్రం దౌర్జన్యకారులనణచడానికి హింస ప్రయోగిస్తాడుతప్ప తనంతటతాను హింసను ప్రోత్సహించడని చెబుతుంటడు. వాస్తవం చెప్పుకోవాలంటే, రాజశేఖర్‌రెడ్డికి అనుకూలంగా ఉండేవాళ్ళు ఎంతటి దౌర్జన్యపరులైనా అతను ఏ రోజూ వాళ్లకు అడ్డంపోలేదు. వాళ్ళను అణచివేయలేదు. తనకు వ్యతిరేకంగా ఉండేవాళ్ళు దౌర్జన్యాలకు పాల్పడితే మాత్రం సహించడు. వాళ్ళ దౌర్జన్యాన్ని సాకుగా చూపించి వాళ్ళనణిచివేస్తాడు. అందుకోసం వాళ్ళకంటే దుర్మార్గులను సహితం చేరదీస్తాడు 'రాజశేఖర్ రెడ్డిని వ్యతిరేకిస్తే సహించడు. నిర్దాక్షిణ్యంగా తొక్కేస్తాడు' అని అతని ప్రత్యర్థులేకాదు అతన్ని అభిమానించే వాళ్ళుకూడా ఒప్పుకుంటారు. అతని అనుచరులు ఎన్నిఘోరాలు చేసినా వాళ్ళను కాపాడతాడనీ, మద్దతు ఇస్తాడనీ అనుభవజ్ఞులైన పోలీసు అధికారులు అతన్ని గురించి అంటారు.

ఇప్పటికీ రాజశేఖర్ రెడ్డి ఆధిపత్యానికి లొంగకుండా నిలబడిన ఒకరిద్దరి కథలు చెప్పుకుంటే విషయం కొంత అర్థం కావచ్చు. పులివెందుల తాలూకా లింగాల మండలంలోని కర్ణపాపాయపల్లె అనే ఊరి 'రెడ్డి' కొడుకైన విష్ణుకంచిరెడ్డి ఇప్పటికీ రాజశేఖర్ రెడ్డిని వ్యతిరేకిస్తున్న వారిలో ఒకడు. వాళ్ళుపెద్ద భూస్వాములు, ఊరిలో ఒకప్పుడు ఎదురులేని పెత్తందారులు, డి.ఎన్.రెడ్డి అనుచరులు. వాళ్ళకు భూములేకాక బస్సురూట్లు కూడా

ఉన్నాయి. వాళ్ళకు వ్యతిరేకంగా అదే గ్రామానికి చెందిన రెడ్డి కులస్థులలోని కొందరిని వై.యస్. రాజశేఖర్‌రెడ్డి చేరదీశాడు. అతని పంచన చేరిన వ్యక్తులు ఏడేండ్ల క్రింద సింగిల్‌విండో అధ్యక్షుడైన విష్ణుకంచిరెడ్డి అన్న రఘురామి రెడ్డిని హత్య చేశారు. అంతకుముందు వాళ్ళకు బలం తక్కువగా ఉన్నప్పుడు రాజశేఖర్ రెడ్డి సలహా మేరకు అందరూ కలసి ఏకగ్రీవంగానే ఇతన్ని ఎన్నుకున్నారు. బలం పెరిగిన తర్వాత ముఠాకట్టి అతన్ని చంపారు. విష్ణుకంచి రెడ్డి రెచ్చిపోయి ప్రత్యర్థుల బత్తాయి తోటల మీద పడి 650 చెట్లు నరికించాడు. వాళ్ళు ఇతని వ్యవసాయ మోటార్లు బావుల్లో వేశారు. ఆ తర్వాత ఇరువైపులు ముఠాలు కట్టి ప్రతీకారహత్యలు కొనసాగించారు. ఒకే సంవత్సరంలో మొత్తం 5 హత్యలు జరిగాయి. గ్రామంపైన ఆధిపత్యం వై.యస్. అనుచరుల చేతిలోకి పోయింది. విష్ణుకంచి రెడ్డి ఈ ముఠా కొట్లాటలకోసం మూడు బస్సులు, ఒక లారి, ఒక ట్రాక్టరు, ఒక పాలవ్యాను అమ్ముకున్నాడు. ఈ మధ్యనే మళ్ళీ రెండు బస్సులు కొనుక్కొని వ్యాపారం సాగిస్తున్నాడు. వై.యస్. ప్రోత్సాహంతో తమ అనుచరులపైన జరిగే హింసాత్మక దాడులను ఎదుర్కొనలేక డి.ఎన్. రెడ్డి కుటుంబం మౌనం అయిపోయిందని ఈయనే అంటాడు. ఆ ఆధిపత్యాన్ని వ్యతిరేకించదల్చుకున్న వాళ్ళకు తాలూకాలో ఒక నాయకుడు లేకుండా పోయాడు. '1994 అసెంబ్లీ ఎన్నికలలో పులివెందుల నియోజకవర్గంలో ఒక్కొక్క మండలంలో రెండు కంటె ఎక్కువ గ్రామాలలో తెలుగుదేశం పార్టీ ఏజెంట్లను కూర్చోపెట్టలేకపోయింది' అని విష్ణుకంచి రెడ్డి అంటాడు. రాష్ట్రమంతటా ఎన్.టి.ఆర్. గాలి వీచినా పులివెందులలో మాత్రం రాజశేఖర్ రెడ్డి తమ్ముడు వివేకానందరెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిచాడు.

1989 జూన్ 30న జరిగిన భారత్‌బంద్ సందర్భంగా పులివెందులలో జరిగిన ఒక జంటహత్య డి.ఎన్.రెడ్డి నిస్సహాయతకు తార్కాణం. ప్రతిపక్ష పార్టీలిచ్చిన భారత్‌బంద్ పిలుపును అమలుచేయడానికి డి.ఎన్. రెడ్డి, అతని అనుచరులు పులివెందులలో ప్రయత్నం చేశారు. ఎ ాళ్ళు వై.యస్. కుటుంబానికి చెందిన కాలేజికి పోయి మూసేయమన్నారు. కాలేజి యాజమాన్యం మూసేయలేదు. ఈ సంగతి తెలిసిన రాజారెడ్డి 'నా కాలేజీనే బంద్ చేయిస్తారా' అంటూ రెచ్చిపోయి ఆ రోజు బంద్ చేయించడానికి వచ్చిన శివరామ్ రెడ్డి, నారాయణ అనే ఇద్దరిని వారం తిరగక ముందే దారుణంగా హత్యచేయించాడు.

ముఠాసంస్కృతి ప్రబలంగా ఉన్న గ్రామాలలో ఎన్నికలప్పుడు గ్రామంలో ఏ ముఠా బలంగా ఉంటే వాళ్ళే ఓట్లన్నీ వేసుకునే ప్రయత్నం చేస్తారు. ప్రత్యర్థులను బూత్‌దగ్గరికి రానీయరు. ప్రచారం చేసుకోనీయరు. ఏజెంట్లను కూర్చోనీయరు. ఇవి మామూలు విషయాలు. రాజశేఖర్ రెడ్డి అనుచరులైన గ్రామీణ ముఠాదారులే ఈ పనిచేస్తే అతను

అభ్యంతరం చెప్పకపోగా దానివల్ల పూర్తి ప్రయోజనం పొందుతాడు. అది తన 'వర్గం' హక్కుగా భావిస్తాడు. పులివెందుల తాలూకాలో అతని ఆధిపత్యం సంపూర్ణంగా నెలకొన్న తర్వాత ప్రతి ఎన్నికలోనూ ఆ నియోజకవర్గంలో ఆ అభ్యర్థికి 80 వేలు, 90 వేలు, ఒక లక్షదాకా మెజారిటి ఊరికే రావడంలేదు. త్వరలో పులివెందుల గిన్నిస్ బుక్ కూడా తట్టుకోలేని రికార్డు నెలకొల్పవచ్చు. కాని జిల్లాలో వేరే ఎక్కడయినా తన ప్రత్యర్థులు ఇదేపని చేస్తే వారిని హింసాత్మకంగా ఎదుర్కొని తన వర్గం ఓటుహక్కును (నిజం చెప్పాలంటే రిగ్గింగ్ హక్కును) కాపాడటానికి రాజశేఖర రెడ్డి తానే స్వయంగా బయలుదేరి పోతాడు. 1989 అసెంబ్లీ ఎన్నికలప్పుడు జమ్మలమడుగు నియోజకవర్గంలోని పెనికలపాడులో ఇటువంటి సంఘటన ఒకటి జరిగింది. ఆ ఊరు కాటమయ్య అనే లేబరు కాంట్రాక్టరు అధీనంలో ఉంటుంది. అతను గుండ్లకుంట్ల శివారెడ్డి అనుచరుడు. అతని ప్రత్యర్థులైన రాజశేఖర రెడ్డి మనుషులు ఊరిలో మైనారిటి పోలింగ్‌రోజు ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి కాటమయ్య మనుషులు ఓట్ల పెట్టెలలో యాసిడ్ (ఆమ్లం) పోశారు. మరుసటిరోజు రీపోలింగ్ జరిగింది. కాటమయ్యకు ఆ ఊర్లో బలముంది కాబట్టి అతను తన మనుషులను కదలనీయడని భావించిన రాజశేఖర రెడ్డి రీపోలింగ్ రిగ్గింగ్‌లో తన వాళ్లకు అండగా నిలబడడానికి మందీమార్బలం బాంబులు తుపాకులు తీసుకుని స్వయంగా బయలుదేరిపోయాడు. అతను గ్రామంలోకి ప్రవేశించకుండా కాటమయ్య మనుషులు అడ్డుకున్నారు. ఎర్రగుంట్ల-ముద్దనూరు రహదారిమీద యుద్ధ వాతావరణం ఏర్పడింది. రాజశేఖరరెడ్డి స్వయంగా తుపాకి తీసుకుని కాల్పులు జరిపి కాటమయ్య షడ్డకుడు కొండయ్యను తీవ్రంగా గాయపర్చాడు.

1995 లో జరిగిన మండల ఎన్నికలలో రాజశేఖర్‌రెడ్డి ప్రతిష్టను బాగా దెబ్బతీసిన ఇటువంటి సంఘటన ఒకటి జరిగింది. వేంపల్లె పులివెందుల తాలూకాలోని ఒక ప్రధానమైన మండలకేంద్రం. మండల ఎన్నికలలో వేంపల్లె ఎం.పి.టి.సి. పదవికి సతీష్ కుమార రెడ్డి అనే యువకుడు పోటీచేశాడు. అతని తండ్రి (గ్రామ సర్పంచ్) వై.యస్. కు అనుకూలమేకాని కూమారుడు 1994 అసెంబ్లీ ఎన్నికలనుంచే వై.యస్. కు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీకి పనిచేస్తున్నాడు. ఆ కుటుంబం ఏ పార్టీ అయినా, ఎవరికి అనుకూలమైనా ఎవరికి వ్యతిరేకమైనా, వేంపల్లెలో మాత్రం పెత్తనం వాళ్ళదే. వాళ్ళ మాటకే చెల్లుబాటు ఉంటుంది. కాబట్టి సతీష్‌కుమార్ రెడ్డి గెలవడం ఖాయం. అందువల్ల ఎన్నికరోజు ప్రొద్దుటినుండే అతని ప్రత్యర్థులైన రాజశేఖర రెడ్డి మనుషుల ఆగడాలు మొదలయ్యాయి. వాళ్ళు బ్యాలట్ పెట్టెలలోనికి నీళ్ళుపోశారు. దీంతో సతీష్ కూమార్ రెడ్డి అనుచరులు గొడవచేశారు. ప్రొద్దున్నే వై.యస్. రాజశేఖర రెడ్డి స్వయంగా వేంపల్లెకు వచ్చాడు. గుమికూడిన జనం అతని కారుమీద

రాళ్ళువేశారు. తిట్టారు. అతనుపోయి తన అనుయాయుడైన శంకర్ రెడ్డి ఇంట్లో కూర్చున్నాడు. (ఈ శంకర రెడ్డి మళ్ళీ వేరెవరో కాదు, సతీష్ కుమార రెడ్డి మేనమామే). 8.30 సమయంలో రాజశేఖర రెడ్డి తమ్ముడు పులివెందుల ఎం.ఎల్.ఎ. అయిన వివేకానందరెడ్డి కూడా వేంపల్లెకు వచ్చాడు. రోడ్లో గుమికూడిన సతీష్ కుమార రెడ్డి అనుయాయులు వివేకానందరెడ్డి వాహనంమీద కూడా రాళ్ళువేసి అల్లరిచేశారు. అతను తన రివాల్వరు తీసి కాల్పులు జరుపబోగా అది పేలలేదు. జనం రాళ్ళు వేయడం, అటకాయించడం కొనసాగించేసరికి వివేకానందరెడ్డి తన బాడీగార్డును కాల్పులు జరపమన్నాడు. అతను కాల్పులు జరిపాడు. నీలం సుబ్బన్న అనే 52 సంవత్సరాల వ్యక్తి చనిపోయాడు.

ఆ తరువాత వై.యస్. రాజశేఖరరెడ్డి పోలింగ్ బూత్‌లలోకి పోయి, తెలుగుదేశం నాయకులు రిగ్గింగ్ చేసినట్లు తనకు రాసివ్వవలసిందిగా ప్రిసైడింగ్ ఆఫీసరును ఒత్తిడిచేసి రాయించుకున్నాడు. ఒక బూత్‌లోకి అతను పోతుండగా మీరు పోవడం చట్టవిరుద్ధమని స్థానిక సి.ఐ. అడ్డుపడితే అతన్ని తోసేసి లోపలికి పోయాడు. అయితే ఆ తర్వాత కొంతసేపటికి తెలుగుదేశం నాయకుడు తులసి రెడ్డి (మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్) అదే బూత్‌ల దగ్గరకు వచ్చి రాజశేఖర రెడ్డి బెదిరించి రాయించుకున్నట్లు తనకు రాసివ్వమని ప్రిసైడింగ్ ఆఫీసర్లపై ఒత్తిడిపెట్టి రాయించుకున్నాడు. పోలీస్‌స్టేషన్లో రాజశేఖర రెడ్డిపైన ఫిర్యాదుచేశాడు. అప్పటికే అక్కడికి వచ్చి ఉన్న జిల్లా ఎస్పీ రాజశేఖర రెడ్డిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించాడు. అతను పోలీస్ స్టేషన్లో ఉండగా సతీష్ కుమార రెడ్డి వర్గీయులు, ఊరిజనం, చనిపోయిన సుబ్బన్న శవాన్ని తీసుకొచ్చి పోలీస్ స్టేషన్ బయటపెట్టారు. లోపలున్న రాజశేఖర రెడ్డిని తీవ్రంగా దూషించారు. స్త్రీలు, పురుషులు దాదాపు గంటసేపు అతన్ని అనరాని మాటలన్నారు. అతనికి ఆశ్రయమిచ్చిన పోలీస్‌స్టేషన్‌పైన రాళ్ళువేశారు.

ఆధిపత్యంకోసం జరిగే ఈ ఘర్షణలలో ప్రాణాలుకోల్పోయే అర్భకుల గురించి అడిగేవాడుండడు, పట్టించుకునే వాడుండడు. వేంపల్లె ఘటనకు సంబంధించిన వాస్తవాలు తెలుసుకోవడానికి ఆ ఊరికి పోయిన పౌరహక్కుల సంఘానికి కాల్పులలో చనిపోయిన నీలం సుబ్బన్నపేరు తెల్సుకోవడం గగనమైంది. ఇరువర్గాల ప్రముఖులు హతుడి పేరు చెప్పలేకపోయారు. తమకోసం ప్రాణాలిచ్చిన ఆ వ్యక్తి ఎవరో సతీష్ కుమార రెడ్డి వర్గీయులకు జ్ఞాపకంలేదు. తమ తూటాలకు బలైన వ్యక్తిపేరేమిటో రాజశేఖర రెడ్డి వర్గీయులకు జ్ఞాపకంలేదు. ఎఫ్.ఐ.ఆర్. వ్రాస్తారు కాబట్టి పోలీసులకు మాత్రం జ్ఞాపకం ఉంది.

1978 తర్వాత డి.ఎన్.రెడ్డి ప్రాబల్యం పులివెందులలో తగ్గుతూ వచ్చిందని చెప్పాము. 1980 నుండి రాజశేఖర రెడ్డి గ్రామీణ ముఠాకక్షలను రాజీచేసే కార్యక్రమం చేపట్టాడు. ఇక్కడ

రాజీ అంటే అర్థం గ్రామస్తులు ముఠాకక్షలు మానేసి ఎన్నికలలోనూ ఇతర సందర్భాలలోనూ ప్రజాస్వామికంగా ఎవరి భావాలు వాళ్ళు ఆచరిస్తారని కాదు. రాజీ అంటే అర్థం ఇరువర్గాలూ ముఠాలుగానే ఉంటూ 'ఏకగ్రీవంగా' రాజశేఖర రెడ్డికి అనుకూలంగా నడుచుకుంటారని. 1980లో తాను మొదలుపెట్టిన రాజీ కార్యక్రమం ఫలితంగా, అప్పటి గ్రామపంచాయితీ ఎన్నికలలో 50 గ్రామాలలో సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని రాజశేఖర రెడ్డి అంటాడు. అప్పటి నుండి పాతిన్నున్న గ్రామాలలో రాజీచేస్తూ ఉన్నాడు. ముఠా కొట్లాటలు పెట్టుకోకూడదు. సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలి. తమకు పరిష్కారం దొరకకపోతే వై.ఎస్. దగ్గరకు రావాలి. ఎన్నికలలో రాజశేఖర రెడ్డికి అనుకూలంగా ఇరుపక్షాలూ పనిచేయాలి. రాష్ట్రమంతా ఎటుపోయినా పులివెందులలో మాత్రం రాజశేఖర రెడ్డి అభ్యర్థి లక్ష మెజారిటీతో గెలవాలి. (గ్రామంలోని ఇరువర్గాల నాయకుల అభీష్టమే తప్ప ప్రజలకు రాజకీయ స్వేచ్ఛ అనేది లేదు. కాబట్టి వాళ్ళిద్దరూ ఈ షరతుల ప్రకారం రాజీ అయితే ఊరివోట్లన్నీ రాజశేఖర రెడ్డికే). ఈ షరతును ఎవరయినా తప్పితే వాళ్ల అస్తులు స్వాధీనం చేసుకునే అధికారం వై.యస్. కు ఇవ్వబడుతుంది. అది రాజీ ఒడంబడికలో భాగం. సంతకాలు చేసిన ఖాళీ స్టాంప్ పేపర్లు ఇరువర్గాలూ వై.ఎయస్. కు అప్పగిస్తారు.

ఇది గ్రామాలలో ప్రజాస్వామ్య వాతావరణాన్ని పునరుద్ధరించే ప్రయత్నం కాదు. రాజశేఖర రెడ్డి ఆధిపత్యంలో ప్రశాంతత నెలకొల్పే ప్రయత్నం. దీని లక్ష్యం ప్రజలు స్వేచ్ఛగా, నిర్భీతిగా బ్రతకాలనికాదు. దీని లక్ష్యం తాలూకాలో రాజశేఖర రెడ్డికి ప్రత్యామ్నాయ నాయకుడు ఎదగకుండ ఉండడం. గ్రామాలలో మూఠా కక్షలుంటే ఒకరికి వ్యతిరేకంగా మరొకరిని వాడుకొని వై.యస్. కు పోటీగా నియోజకవర్గంలో ఇంకొక నాయకుడు ఎదగగలడు. ఇతర తాలూకాలలో ఇదే విధంగా ఎదగడానికి పోటీ నాయకులకు రాజశేఖర రెడ్డి సహాయ సహకారాలు, ప్రోత్సాహం కల్పించాడు. జమ్మలమడుగులో శివారెడ్డికి వ్యతిరేకంగా దేవగుడి శంకర రెడ్డి కుటుంబం, ప్రొద్దుటూరులో రమణారెడ్డికి వ్యతిరేకంగా వరదరాజులు రెడ్డి, రాయచోటిలో పాలకొండరాయుడుకి వ్యతిరేకంగా నాగిరెడ్డి, నారాయణరెడ్డి, వై.ఎస్. రాజశేఖర రెడ్డి సహాయ సహకారాలతో గ్రామీణ ముఠాకక్షలను వాడుకొని ఈ విధంగానే ఎదిగారు. (కోడూరులోనయితే చెంగల్రాయలుకు వ్యతిరేకంగా రాజారెడ్డే స్వయంగా రంగంలోకి దిగి బీభత్సం చేసి ఎదుర్కొన్నాడు). అక్కడ తన అనుచరులకు రాజశేఖర రెడ్డి ఈ రాజీసూత్రం బోధించలేదు. తన ఆధిపత్యం ఉన్న పులివెందులలో మాత్రం అదే నమూనాలో పోటీనాయకుడు ఎదగకుండ ఉండేందుకు శాంతి యత్నాలు చేపట్టాడు. ఇదంతా జిల్లాలో శాంతినీ ప్రజాస్వామ్యాన్నీ నెలకొల్పే ప్రయత్నం అని చలామణి చేసుకోగలుగుతున్నాడు. తన

నియోజకవర్గంలోనే తనకు మింగుడుపడని వాళ్ల విషయంలో (విష్ణుకంచి రెడ్డి, సతీష్ కుమార్ రెడ్డి వగైరా) అతనూ దౌర్జన్యకరపద్ధతులను ఆశ్రయిస్తున్నాడని పైరెండు ఉదాహరణలలో చూసాము. అతని రాజీ ప్రయత్నాలకు తల ఒగ్గే గ్రామీణ ముఠానాయకులు కూడ పెత్తన కాంక్ష వదులుకొని ప్రజాస్వామ్యాన్ని కోరుకొని రాజీకి రావడంలేదు. రాజీ చేసుకొమ్మని హెడ్‌క్వార్టర్స్ నుండి సూచన వచ్చినప్పుడు ఒకడు సమ్మతి చూపించి రెండవవాడు రాజశేఖరరెడ్డికి శత్రువు అవుతాడు. నియోజకవర్గంలో అతనికి ప్రత్యామ్నాయ నాయకుడులేని దశలో, ఉన్న ఒకే నాయకునికి కంటగింపు కావడం తమ పెత్తనానికీ ప్రయోజనాలకూ మంచిదికాదు. కాబట్టి ఇద్దరూ రాజీపడి వై.యస్. ఆధిపత్యంలో ఉమ్మడిగా గ్రామాన్ని ఏలుతారు.

ఒకవేళ రాజీ కుదురకపోయినా గ్రామీణ ముఠానాయకులలో ఈ స్పృహ ఉంటే చాలు. వాళ్లలో వాళ్ళు చంపుకున్నా ఇద్దరూ రాజశేఖర రెడ్డికి అనుకూలంగా ఉంటారు. 'నేనే వై.యస్. మనిషిని' అని రుజువు చేసుకోవడానికి ఇద్దరూ ఆరాటపడతారు. పులివెందుల తాలూకాలోని ఇనగలూరు (తొండూరు మండలం) ఈ మధ్యవార్తల కెక్కింది. ఆ ఊరిలో ఎరికల రెడ్డి వర్గం, కుళ్లాయి రెడ్డి వర్గం అని రెండు ముఠాలు. తాలూకాలో వై.యస్ కు పోటీ ఉంటే చెరి ఒక పక్షం అయివుండేవారేమో. కానీ ఆ అవకాశంలేదు కాబట్టి ఇరువర్గాలూ 'వై.యస్. మనుషులే'. అయినప్పటికీ గత మూడేళ్లలో అయిదు హత్యలు చేసుకున్నారు. 1993 మే 18నాడు రాజశేఖరరెడ్డి పులివెందులకు వచ్చాడని తెలిసి ఇరువర్గాలూ అతనిని సంప్రదించడానికి పులివెందులకు బయలుదేరివచ్చారు. ఎరికల రెడ్డి వర్గం మనుషులు (ప్రస్తుత సర్పంచ్ అంకాళరెడ్డి నాయకత్వంలో) ట్రాక్టర్‌లో బయలుదేరగా, కుళ్లాయి రెడ్డి వర్గం బస్సుపైన ఎక్కి ప్రయాణం అయ్యారు. బస్సు ట్రాక్టర్‌ను దాటడానికి ప్రయత్నం చేసిన క్రమంలో రెండు వాహనాలూ ఆగాయి. ట్రాక్టర్‌లో ఉన్నవాళ్లూ బస్సుమీద ఉన్నవాళ్లూ ఈలలువేసుకున్నారు. కేకలుపెట్టారు. బస్సుపైన ఉన్నవాళ్లు రాళ్లు వేసారు. వీళ్ల ట్రాక్టర్ దిగి సవాలు చేసారు. వాళ్లు బస్సుదిగి పరుగెత్తారు. వీళ్లు వెంటపడి బాంబులు వేసారు. కుళ్లాయి రెడ్డి వర్గానికి చెందిన ముగ్గురు (రాంమోహనరెడ్డి, రాజశేఖర రెడ్డి, రామకృష్ణా రెడ్డి) చనిపోయారు. నిరర్థకమైన ఈ హత్యాకాండమీద కడప జిల్లా కోర్టులో ప్రస్తుతం కేసు నడుస్తూఉంది. కేసులో సాక్ష్యం చెప్పిన ముఖ్యసాక్షి ప్రసాద్‌రెడ్డిని ముద్దాయి వర్గంవాళ్లు 1995 డిసెంబర్ 9 ప్రొద్దున్న గ్రామంలోనే కత్తితో పొడిచి బావిలో పడేసారు. దానితో కూళ్లాయి రెడ్డి వర్గం విజృంభించి ఇవతలి వర్గానికి చెందిన ఓబుల్ రెడ్డిని అతని ఎడ్లబండితో సహా సజీవదహనం చేసి చంపారు. 21 ఇళ్లకు నిప్పుపెట్టి 20 లక్షల ఆస్తి ధ్వంసం చేసారు.

మళ్లీ వీళ్ల ఏదో ఒకరోజా రాజీచేసుకోవలసిందే. దానికోసం రాజశేఖర రెడ్డి దగ్గరకు పోవలసిందే. ఒకరికంటె ఎక్కువగా మరొకరు అతనిపట్ల విశ్వాసం ప్రకటించవలసిందే. ఇది రేపు రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో జరగవచ్చు. జరిగితే, ఆ ఊరిలో రాజశేఖర రెడ్డికి పడనివోట్లు ఇంకా ఏమయినా మిగిలివుంటే ఈసారి అవికూడ అతనికే పడతాయి.

కోడూరు నియోజక వర్గం ఘర్షణల గురించికూడా ఇక్కడే చెప్పుకుంటే బాగుంటుంది. మంగంపేట ముగ్గురాళ్ళగనులు కోడూరుకు దగ్గరలో ఉండడంవల్ల పులివెందుల దెబ్బ, కోడూరుకు కూడా తగిలింది. కోడూరులో 1980 ల నుండి ముఠా కొట్లాటలున్నాయి. దానిని కొంతవరకు కుల ఘర్షణగా భావించవచ్చు. ఒకవైపు బలిజ కులస్తులు, మరొకవైపు రాజా, కమ్మ కులస్తులు మోహరించారు. బలిజల నాయకుడు చంగల్రాయులు. అవతలి పక్షం నాయకుడు నారాయణ నాయుడనే కమ్మ కులస్తుడు. ఇది రాజా రెడ్డి రంగంలోకి దిగక ముందు సంగతి. ఈ దశలో 8 హత్యలు జరిగాయి. పెద్ద ఎత్తున తోటలు నరుక్కున్నారు. కోడూరు, రాజంపేట ప్రాంతం చీనీ (బత్తాయి) తోటలకు ప్రసిద్ధిగాంచింది. మామిడితోటలుకూడా చాలా ఉన్నాయి. కోడూరు ముఠా ఘర్షణలలో 1985 తర్వాత వందలాది ఫలవృక్షాలను ఇరువర్గాలు నరుక్కున్నారు.

ఈ ఘర్షణకు భూమి సంబంధమైన కారణముందని చెంగల్రాయులు అంటాడు. ఉప్పరపల్లి గ్రామంలో పేదలు అనుభవిస్తున్న భూమికి పెత్తందార్లు బినామీగా పట్టా పుట్టించి ఒక పారిశ్రామికవేత్తకు అమ్మజూపారని దానిని తాము వ్యతిరేకించామని అంటాడు. అది నిజంకాదని ఇది కేవలం ఆధిపత్యంకోసం మొదలైన ముఠాకొట్లాటని తటస్థుడైన ఒక స్థానికుడంటాడు. నారాయణనాయుడు కోడూరు సమితి ప్రెసిడెంటుగా ఉండేవాడు. చెంగల్రాయులు ఆ పదవికోసం పోటీపడ్డాడు. ఆధిపత్యంకోసం జరిగే ఘర్షణల్లో ప్రజల సమస్యలు సాధనాలుగా ఉపయోగపడడం కొత్త సంగతికాదు. ఏమైతేనేం 1985లో చెంగల్రాయులు ప్రత్యర్థులు శెట్టిగుంటగ్రామ సర్పంచైన అతని అన్న సుబ్రమణ్యంను కోడూరులోనే దారుణంగా హత్యచేశారు. పొడిచి, సలసలకాగుతున్న పాలుమీద పోసి క్షీరదహనంచేసి చంపారు. 'వీళ్ళు దానికి ప్రతీకారంగా మామిడికాయల వ్యాపారి అయిన రామచంద్రనాయుడు అనే కమ్మ కులస్థుడిని హతమార్చారు. ఈ హత్యలు ప్రతిహత్యలు కొనసాగి 8 మరణాలకు దారితీశాయి.

ముఠా ఘర్షణ సుబ్రమణ్యం హత్యతో తీవ్రరూపం తీసుకునే సరికి చెంగల్రాయులు రక్షణకోసం వై.యస్. రాజశేఖర రెడ్డిని ఆశ్రయించాడు. తన ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి వీరి ముఠాకొట్లాట పనికి వస్తుందని వై.యస్. అతనిని చేరదీశాడు. కోడూరు ముఠా రాజకీయాలలో పులివెందుల పాలెగాళ్ళ జోక్యం ఈ విధంగా ప్రారంభమైంది. అది చివరికి,

తనమెడకే ఉచ్చు అయి బిగిసుకుంటుందని వారిని ఆహ్వానించిన చెంగల్రాయులు బహుశా ఆనాడు ఊహించలేదు. 1987లో అతను కాంగ్రెసు టికెట్‌తో కోడూరు మండలాధ్యక్షుడయ్యాడు.

అయితే 1989 నుండి చెంగల్రాయులుకు వై.యస్. వాళ్ళతోనే ఘర్షణ మొదలైంది. కోడూరు అసెంబ్లీ షెడ్యూల్డు కులాలకు రిజర్వుకావడంవల్ల చెంగల్రాయులుకు తన సొంత నియోజక వర్గంలో ఎం.ఎల్.ఎ. అయ్యే అవకాశంలేదు. అందువల్ల అతను రాజంపేట పార్లమెంట్ టికెట్‌కోసం పోటీపడ్డాడు. అయితే రాజశేఖర రెడ్డి ఆ టికెట్‌సాయి ప్రతాప్‌కు ఇప్పించాడు. తత్ఫలితమైన అసంతృప్తికి ఆస్తుల ఘర్షణకూడా తోడయ్యింది.

ఇవన్నీ కలిసి చెంగల్రాయులుకు వై.యస్. కుటుంబంతో ఘర్షణ తెచ్చి పెట్టాయి. కోడూరు సమీపంలోని బై రైటీస్ గనుల నిర్వహణ చేసుకుంటున్న రాజారెడ్డి స్థానిక ముఠాదారులతో పనిలేకుండా తానే చెంగల్రాయులుకు వ్యతిరేకంగా ఫాక్షను నడపసాగాడు. పులివెందులలో వై.యస్. కుటుంబం వందమందితో ఒక ప్రైవేటు సైన్యాన్ని పెట్టుకున్నారు. వాళ్ళ తరపున అల్లర్లు చేయడానికీ హత్యలు చేయడానికీ ఆ సైన్యాన్ని వాడుకుంటారు. దీనికి నాయకుడు రామకృష్ణారెడ్డి అనే వ్యక్తి. ఈ సైన్యమే కోడూరు ప్రాంతంలో చెంగల్రాయులకు వ్యతిరేకంగా దౌర్జన్యానికి పాల్పడసాగింది. చెంగల్రాయులు పాత శత్రువైన నారాయణనాయుడు ఇప్పుడు అతనితోనేచేరాడు. కాని 'రాజారెడ్డి చంపినంతగా చెంగల్రాయులు చంపలేకుండా ఉన్నాడు' అనే వై.యస్. అభిమాని అయిన ఒక వ్యక్తి అంటాడు. ముఠా కొట్లాటల ప్రారంభంలో అన్న సుబ్రమణ్యంను పోగొట్టుకున్న చెంగల్రాయులు ఈ దశలో తమ్ముడు మాధవయ్యను పోగొట్టుకున్నాడు. తనవాళ్ళు మొత్తం 17 మంది హతమయ్యారని అతనంటాడు. ఈ శవాల లెక్కల తప్పొప్పులు చెప్పగల వాళ్ళులేరు. అతని అవసరాలకోసమే కోడూరు ముఠా కొట్లాటల్లోకి ప్రవేశించిన వై.యస్. తండ్రి తనయులు ఇప్పుడు కోడూరులోను పరిసరప్రాంతాలలోను తిరుగులేని ఆధిపత్యం నెలకొల్పారు. రాజంపేట నియోజకవర్గంలో వందలాది ఎకరాల మామిడితోటలు కొన్నారు. చాలా గ్రామాలలో తమ అనుయాయులను తయారుచేసుకున్నారు. పుల్లంపేట మండలం వెంకట రాజంపేటలోనే త్రివేణి స్టీల్స్ మానేజింగ్ డైరెక్టరయిన మురళీమోహన్ రెడ్డి మండలాధ్యక్షుడైన వై.యస్. అనుచరుడు బ్రహ్మానందరెడ్డికి వ్యతిరేకంగా ఎదుగుతున్నాడని అతన్ని రాజారెడ్డి మనుషులు చంపారు. వై.యస్. కుటుంబానికి రాజకీయ ప్రత్యర్థి అయిన మైసూరా రెడ్డికి మురళీమోహన్ రెడ్డి అనుకూలంగా ఉండేవాడు. మైసూరా రెడ్డికి అతనొకరోజు విందు ఏర్పాటుచేసాడనీ ఈ అవిధేయతను సహించలేక రాజారెడ్డి అతనిని చంపించాడనీ ఒక కథ చెప్తారు.

# ప్రజలు, ప్రజావసరాలు, ప్రజాస్వామ్యం

ఆస్తి, సాంఘిక హోదా, పెత్తనం, అధికారం కొద్దిమంది చేతిలో కేంద్రీకృతమై ఉండడం ఇతర ప్రజలకూ ప్రజాస్వామ్యానికీ ఎప్పుడైనా నష్టకరమే. అభివృద్ధి మాటకొస్తే, అన్ని వనరులూ అవకాశాలూ ఉన్నవాళ్ళు తమ లాభంకోసమే అయినా ఉత్పత్తి దాయకమైన కృషి చేపడితేనే అది కొంతమేరకయినా ఆర్థిక అభివృద్ధికి దారితీస్తుంది. అదికూడా సంక్షోభయుతంగా ఉంటుంది. అయితే ఆ పెత్తనం హింసాత్మకరూపం తీసుకున్నప్పుడు, పెత్తనంకోసం జరిగే ఘర్షణ ప్రజాస్వామ్య ప్రమాణాలను పూర్తిగాధ్వంసంచేసే దౌర్జన్యరూపాలను తీసుకున్నపుడు, సాంఘిక సంస్కృతిలో ఉన్న ముఠాతత్వం వల్ల ప్రజలుకూడా రెండుగా చీలి ఈ దౌర్జన్యాలలో తామూ భాగమైనపుడు, సామాజిక ప్రయోజనాలకంటే, న్యాయాన్యాయాలకంటే, ప్రజాజీవిత అభివృద్ధి కంటే, వ్యక్తుల పెద్దరికం, ముఠాప్రయోజనాలు ముఖ్యమైనపుడు జరిగే నష్టం ఇంకా ఎక్కువ ఉంటుంది. రాయలసీమలో ముఠాకక్షలు ప్రబలంగా ఉన్న అన్ని ప్రాంతాలలోనూ ఈ నష్టం కొట్టొచ్చినట్లు కనబడుతుంది.

రాజకీయ ప్రజాస్వామ్యం ప్రజాజీవిత దీర్ఘకాలిక అభివృద్ధికి చాలా అవసరం. పెత్తనం చేతిలో ఉన్నవాళ్ళు తమకు ఎదురుమాట్లాడేవాళ్ళను హింసాత్మకంగా అణచివేసే సంస్కృతిలో అది మొలకెత్తలేదు, వికసించలేదు. సమాజంలో న్యాయాన్యాయాలు నిర్ణయించడానికి ముఠాప్రయోజనాలు తప్ప వేరే ప్రమాణాలులేని సంస్కృతిలోను, ప్రజాస్వామిక విలువలకు మనుగడ ఉండదు. పైరెండు లక్షణాలు కలగలసిన పాలెగాళ్ళ సంస్కృతి రాయలసీమలో అనేక ప్రాంతాలలో రాజ్యం చేస్తూఉంది. ఎన్నికల అక్రమాలు ఈ పతనానికి ఒక చిహ్నం మాత్రమే. ముఠాకక్షలు బలంగా ఉన్న గ్రామాలలో బలవంతులైన వారు మద్దతు ఇచ్చే అభ్యర్థికి తప్ప వేరే ఎవరికి గ్రామస్థులెవరూ ప్రచారంచేసే వీలులేదు. ఏజెంట్లుగా కూర్చోవడానికి వీలులేదు. ఓటు ఎవరికి వేసినది చూపించి డబ్బాలో వేయమంటే చూపించి వేయాలి. లేదా బలవంతులే బాలెట్ పేపర్లన్ని తీసుకుపోయి గుద్ది డబ్బాలో వేసుకున్నా చూస్తూ ఊరుకోవాలి. ఈ దౌర్జన్యాన్ని ఎదుర్కోదలచుకున్నవాళ్ళు ప్రత్యర్థి ముఠాలో భాగం కావాలి. తామొక ఫాక్షన్ తయారు చేసుకోవడానికీ గుంపుకట్టి ఎదురుదాడి చేయడానికి సిద్ధంగా ఉండాలి. వాళ్ళను పోషించే నాయకుడు జిల్లా రాజకీయాలలో దొరకాలి. అప్పుడయినా జరిగేది ప్రజాస్వామిక ఎన్నికకాదు. బాంబుదాడులు, కాల్పులు, నరుక్కోవడం, చంపుకోవడం బాలెట్ పెట్టెల్లో నీళ్ళుపోయడం, బాలెట్ పేపర్లు తగలపెట్టడం జరుగుతుంది. ఇట్లా కొంతకాలం సాగితే ఊరిజనం విసిగిపోయి శాంతికావాలని కోరుకుంటారు. ఈ శాంతికి అర్థం పెత్తందారీ

దౌర్జన్యాలను తిరస్కరించి ప్రజాస్వామ్య జీవితాన్ని ఆచరించడంకాదు. దీని అర్థం పెత్తందార్లు రాజీపడి ప్రజల ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా ఓట్లు పంచుకోవడం. సారా వ్యాపారం పంచుకున్నట్లు, సివిల్ కాంట్రాక్టులు పంచుకున్నట్లు ఓట్లు పంచుకుంటారు. ఊరిలో 60 మీకు 40 మాకు అని పంచుకుంటారు. దాని ప్రకారం ఇద్దరూ ప్రశాంతంగా బాలెట్ పెట్టెలను నింపుకుంటారు. ప్రజలంతా ఈసారి ఎన్నికలు గలాటాలు లేకుండా జరిగాయి'. అని ఊపిరి పీల్చుకుంటారు. లేదా పులివెందులలోలాగా ఇద్దరూ ఒకటయిపోయి రాజశేఖర రెడ్డి అభ్యర్థికి ప్రశాంతంగా ఓట్లన్నీ గుద్దేస్తారు. పులివెందులలో అధికభాగం గ్రామ పంచాయితీ ఎన్నికలలో ఏకగ్రీవ అభిప్రాయం సాధించడం తన ఘనత అని రాజశేఖర రెడ్డి చెప్పుకోగలగడానికి కారణం ఈ ఆధిపత్య ప్రశాంతతకు ప్రజాస్వామ్యానికి తేడా చెరిపివేయడమే.

సారాయి వ్యాపారంలాగే ఎన్నికల అక్రమాల విషయంలో గూడా ఒక నాయకుడిని ప్రత్యేకంగా పేర్కొనవలసిన అవసరంలేదు. రాశిలో తేడాయే తప్ప గుణంలో తేడాలేదు. ఫాక్షన్ గ్రామాలలో 1952 నుండి ఎన్నికల దౌర్జన్యాలు జరుగుతూనే ఉన్నాయి. మైసూరా రెడ్డి స్వగ్రామమైన నిడిజీవిలో అతన్ని పెంపకం తీసుకున్న మేనమామ సుబ్బిరెడ్డి రోజులనుండి ఎన్నికలలో ప్రజలకు స్వేచ్ఛలేదు. ప్రత్యర్థి ఏజెంట్ కూర్చునే పరిస్థితిలేదు. ప్రస్తుత కమలాపురం ఎం.ఎల్.ఎ. వీరశివా రెడ్డి స్వగ్రామమైన కోగటంలో కూడా తొలినాటినుండి ఇదే పరిస్థితి. శివారెడ్డి స్వగ్రామమైన గుండ్లకుంటలోను (అతను నియోజక వర్గానికి నాయకుడు కాకముందు నుండి) ప్రజలకు ఓటుహక్కు అనేది లేదు. ప్రత్యర్థి ఏజెంటు కూర్చోవడానికి వీలులేదు. ప్రజలు బాలెట్ పేపరును టేబిల్‌మీద పెట్టి శివారెడ్డి ఏజెంట్ చూసేటట్లు గుద్దిపెట్టెలో వేయాలి. ఈ రకమైన పరిస్థితి ఫాక్షనిస్టులు బలంగా ఉన్న గ్రామాలన్నింటిలోనూ ఏదో ఒక మోతాదులో ఉంటుంది. అయితే గ్రామీణ ఫాక్షన్లు రాజకీయ ఫాక్షన్లుగా మారి గ్రామం ఎల్లలు దాటిన తర్వాతనే ఎన్నికల దౌర్జన్యాలు జిల్లా రాజకీయాల లక్షణంగా మారాయి. నాయకులు అందుకోసమే పనిగట్టుకుని గ్రామాలలో ముఠాలు పెట్టించారు, పెంచి పోషించారు. ఒక ఊళ్ళో ఫాక్షను పెట్టిస్తే ఓటుకోసం ఆ ఊరికి పోనవసరంలేదు, రోడ్డువేయిస్తానని బావి త్రవ్విస్తానని హామీలు ఈయనవసరంలేదు అని ఒక ప్రముఖ ఫాక్షనిస్టు అంటాడు. 1983 నుండి భారీ రిగ్గింగ్ అన్ని ఎన్నికల లక్షణమైంది. ఆ సంవత్సరం తెలుగుదేశంగాలికి తట్టుకుని రాజశేఖర రెడ్డి పులివెందులలో గెలవడంకోసం భారీగా రిగ్గింగ్ చేశాడు. ఆ తర్వాత తాలూకాలో అతని ఆధిపత్యం సంపూర్ణంగా స్థిరపడ్డంతో అతని అభ్యర్థులకు అనూహ్యమైన మెజారిటీలు వస్తున్నాయి. అతను కడప ఎం.పి.గా గెల్చినప్పుడు పులివెందుల సెగ్మెంట్‌లో ఒక లక్షపదివేలు మెజారిటీ వచ్చింది. కడప, కమలాపురం సెగ్మెంట్లలో కూడా ఒక లక్షకుపైగా మెజారిటీ వచ్చింది.

ఎన్నికలను వాయిదా వేయించడానికి రాయచోటిలో పాలకొండ రాయుడు ఒకసారి, నాగిరెడ్డి ఒకసారి స్వతంత్ర్య అభ్యర్థులను హత్య చేయించిన సంగతి లోగడ చూసాము. 1989 పార్లమెంట్ ఎన్నికలో కడప సీటుకు వై.ఎస్. రాజశేఖర రెడ్డికి పోటీగా నిలబడిన తెలుగుదేశం అభ్యర్థి రామచంద్రయ్య; పోలింగ్‌కు ముందురోజున వృద్ధుడయిన స్వతంత్ర్య అభ్యర్థి పాలాకి వెంకట సుబ్బయ్యను చంపించి ఎన్నిక వాయిదా వేయించాడు. అతను చంపించిన సంగతి తెలిసి రాజశేఖర రెడ్డి మనుషులు శవాన్ని గుర్తుపట్టలేకుండ చేయడంకోసం దాని ముఖమంతా చెక్కేసారు. భారతదేశపు ఎన్నికల చరిత్రలో బహుశా ఇంతకంటే నీచమయిన ఉదంతం లేదు.

అయితే ఎన్నికలే ప్రజాస్వామ్యంకాదు. పెత్తందార్లను ప్రశ్నించేస్వేచ్ఛ, తమ జీవితాలను బాగుచేసుకోవడానికి ఉద్యమించే స్వేచ్ఛ, తమకు న్యాయమని తోచినది మాట్లాడే స్వేచ్ఛ, ఏ సమస్యవచ్చినా న్యాయ సమ్మతంగా, హేతుబద్ధంగా పరిష్కరించుకునే స్వాతంత్ర్యం ప్రజలందరికీ ఉండాలి. ఈ పాలెగాళ్ల పాలనలో అవి కరువయ్యాయి. ఒక పాలెగాడిని ప్రశ్నించాలంటే మరొక పాలెగాడిని ఆశ్రయించాలి. అప్పుడు అతని బలాన్ని బట్టి ఇతనిని ఎదిరించవచ్చు. అయితే అతని పాలెగాడితనాన్ని ప్రశ్నించే స్వేచ్ఛ వదులుకోవాలి. ఒక హక్కుకోసం, ఒక న్యాయం కోసం ఆందోళన చేయాలన్నా, అది ఒక ముఠాదారుకు వ్యతిరేకమయితే ఇంకొక ముఠాదారును ఆశ్రయించి ఆ ఆందోళనను వాళ్ల ముఠాకొట్లాటలలో భాగంచేయాలి. ఏ ముఠాదారుకూ వ్యతిరేకం కాకున్నా ఎవడో ఒకడి కనుసన్నలలో నడిస్తేనే శ్రేయస్కరం. స్వతంత్రంగా, సూత్రబద్ధంగా ఎవరయినా ఒక ఆందోళన చేస్తే వాళ్లు పోటీనాయకులుగా ఎదిగిపోతారని పాలెగాళ్లు అనుమానిస్తే కష్టం.

పెద్ద విషయాల దాకా పొనక్కరలేదు. ప్రజలమధ్య తలెత్తే నిత్యజీవిత సమస్యలను న్యాయసమ్మతంగా పరిష్కరించుకోవాలన్నా కష్టమే. ఇరుపక్షాలూ దానికి కట్టుబడి ఉంటే ఫరవాలేదు. కానీ న్యాయసమ్మతమయిన పరిష్కారం తనకు నష్టకరం అవుతుందని భయపడేవారు సమస్యను ముఠాదారుల దగ్గరికి తీసుకుపోతే న్యాయం, ధర్మం పక్కకు పోతాయి. రెండవ వ్యక్తి రాజీకయినా రావాలి, లేకపోతే మరొక ముఠాదారుడి దగ్గరకయినా పోవాలి. వారి ముఠా ప్రయోజనాలలో తనకు జరగవలసిన న్యాయాన్ని వెతుక్కోవాలి.

ప్రజల సమస్యలపైన ముఠానాయకులు చేసే పంచాయితీలు, ఒకరిపక్షం తీసికొని మరొకరికి జారీచేసే ఆదేశాలు కోకొల్లలు. ఇవి సమాంతర న్యాయస్థానాలు. ఈ పంచాయతులలో తీర్పులు న్యాయంగానే చెప్తారనీ అది ముఠా నాయకుడి ప్రతిష్ఠకు అవసరమని చాలామంది అంటారు. నాయకుడు తన ప్రతిష్ఠ కాపాడుకోవడం కోసం తీర్పున్యాయంగానే చెప్పవచ్చు. లేదా తన ముఠా ప్రయోజనాలు కాపాడుకోవడానికి

ఏకపక్షంగా పరిష్కరించవచ్చు. లేదా పాత కక్షల వల్లనో డబ్బుల కోసమో ఏకపక్షంగా తీర్పు చెప్పవచ్చు. ఏదిజరిగినా మౌనంగా బాధపడడం, లేకపోతే అతనికి వైరి అయిన ఇంకొక ముఠానాయకునికి చెప్పుకోవటం తప్ప బాధితునికి ప్రత్యామ్నాయం లేదు. పోలీసులకు, ప్రభుత్వానికి చెప్పుకుంటే ఏ ప్రయోజనం ఉండదు. వైరి ముఠానాయకుని దగ్గరకు పోతే తన సమస్య వారి ముఠా కొట్లాటలో భాగమయ్యే ప్రమాదం ఉంది. దానిని భరించడం ఆర్థికంగా భౌతికంగా సాధ్యం కాదనుకునే వాళ్ళు నష్టాన్ని సహించి ఊరుకోవాలి.

పంచాయితీలు చేసే ముఠాదారులు ఇరుపక్షాలనుండి ధరావతులు తీసుకుంటారు. పంచాయితీ అయిపోయింతర్వాత ఖర్చులు, జుర్మానా మినహాయించి మిగిలినది తిరిగి ఇవ్వాలి. కాని ఈ మధ్యకాలంలో ధరావత్తులు వెంటనే తిరిగి ఇవ్వకుండా కొన్నాళ్ళు వాడుకుని ఇవ్వడం లేదా పూర్తిగా ఎగ్గొట్టడం జరుగుతూఉందని ఒక పరిశీలకుడు అన్నాడు. పంచాయితీలలో ఇచ్చే తీర్పులు ముఠానాయకుల టెర్రర్ వల్ల అమలవుతాయి. తీర్పును పాటించకపోతే అంతకంటే ఎక్కువ మూల్యం చెల్లించవలసి వస్తుందని భయపడిపాటిస్తాడు. ఈ విషయంలో వై.యస్. రాజారెడ్డిని ప్రముఖంగా చెప్పుకోవాలి. రాజారెడ్డి తీర్పును ధిక్కరిస్తే చంపేస్తాడని పేరు. ముఠాదారులు జోక్యంచేసుకుని బలవంతంగా ఆస్తులు అమ్మించడం, ఇల్లుఖాళీ చేయించడం బాకీలు ఇప్పించడం, వడ్డీలు కట్టించడం, వ్యాపారంలో వాటాలు బదలాయించడం తరచుగా జరుగుతుంటుంది. పాలెగాళ్ళేగాక వాళ్ళ అనుచరులు కూడా ఈ పనులు చేస్తుంటారు. ఇక్కడ కూడా న్యాయాన్యాయాలు, ముఠాప్రయోజనాలు, డబ్బు ప్రలోభాలు అన్నీ కలగలసి పని చేస్తాయి. వేరే వాళ్లకు ఆస్తులు బలవంతంగా ఇప్పించడం ఒక ఎత్తయితే నాయకులే ఇతరుల ఆస్తులను, సంపదను దౌర్జన్యంగా సొంతంచేసుకోవడం వేరొక ఎత్తు, వై.యస్. వాళ్ళు మంగంపేట క్వారీభూములను (ప్రైవేటు వ్యక్తులవి, ప్రభుత్వానివి) దౌర్జన్యంగా ఆక్రమించుకున్న వైనాన్నిపైన వివరించాము. రాయచోటిలో పాలకొండరాయుడు ఇతరుల ఆస్తులను ఆక్రమించుకున్నాడనీ, శ్మశాన భూమిని అక్రమంగా సొంతం చేసుకుని సినిమా టాకీసు కడ్తున్నాడని ఆ భూమిలో ప్రవహించే పంటకాలువను పూడిపించి దానిమీద పునాది వేశాడని అతని ప్రత్యర్థులేకాక స్థానిక ప్రజలుకూడా అంటారు. రాయచోటి ఎం.ఎల్.ఏ. నారాయణ రెడ్డి స్వంత ఊరిలో ఒకరైతు తన భూమిని 3 లక్షలకు అమ్మకానికి పెట్టగా నారాయణ రెడ్డి వేరే ఎవ్వరినీ రానివ్వకుండాచేసి తానే 1.25 లక్షలకు కొన్నాడనే కథఉంది. ''రాయచోటిలో అందరూ లాండ్ గ్రాబర్స్'' అన్నది ఒక అనుభవజ్ఞుడైన పోలీసు అధికారి నిశ్చిత అభిప్రాయం. వై.యస్. కుటుంబం వేంపల్లె మండలం ఇడపలపాయ దగ్గర పేదల భూములు 200 ఎకరాలు ఒక ఎకరానికి కేవలం వందనుండి రెండు వందల రూపాయలిచ్చి

కొన్నారు. ప్రొద్దుటూరులో ఎం.వి.రమణారెడ్డి, అతని అనుచరులు వస్తురూపంలో ధన రూపంలో చేసే రౌడీ మామూళ్ళ వసూళ్ళు ఘనతకెక్కాయి. అతని ప్రత్యర్థి వరదరాజుల రెడ్డి మాటకొస్తే, తన అనుచరుల దొంగతనాలకు, దారిదోపిడిలకు అండగా నిలబడతాడనీ ఎం.ఎల్.ఏ. గా తనకున్న పరపతిని పోలీసుల దగ్గర ప్రయోగించి వారిని కాపాడతాడిని పేరు పొందాడు. పులివెందులలో రాజారెడ్డి ముఠావాళ్ళు కూడా దొంగతనాలకు పేరుపడ్డారు. అతని జీపు ఉపయోగించి కర్ణాటకలో దొంగతనం చేస్తూ అక్కడి పోలీసులకు ఒకసారి పట్టుబడ్డారు.

వ్యాపారస్తుల దగ్గర, కాంట్రాక్టర్ల దగ్గర కమీషన్లు రౌడీ మామూళ్ళు అందరూ వసూలు చేస్తారు. ప్రొద్దుటూరులో రమణారెడ్డి బంగారు వ్యాపారస్తుల దగ్గర బలవంతపు వసూళ్ళు క్రమం తప్పకుండా చేసేవాడు. తెలుగుగంగ ప్రాజెక్టు పనులు ప్రారంభమైన తర్వాత ఆ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ల దగ్గర కర్నూలులోను, కడపలోను స్థానిక పాలెగాళ్ళు పెద్ద మొత్తంలో రౌడీ మామూళ్ళు వసూలు చేసుకున్నారు. ప్రాజెక్టు నిధులలో 30 శాతం మా జేబులలోకే పోయింది అని ఈ పాలెగాళ్ళలో ఒకడు పౌర హక్కుల సంఘంతో స్వయంగా అన్నాడు. జిల్లాలో తెలుగుగంగ కాంట్రాక్టులు నెల్లూరు కాంట్రాక్టర్లకు ఇవ్వకూడదని కడప వాళ్ళకే ఇవ్వాలని 1984లో తాను ఎం.ఎల్.ఎ. గా ఉండగా ఆందోళనచేసి సాధించానని ఎం.వి.రమణారెడ్డి అంటాడు. కాంట్రాక్టర్లపైన కర్రపెత్తనం చేయడానికి ఇది పనికి వచ్చినట్లున్నది. కడప జిల్లాలో దీనివల్ల అక్రమంగా లాభం పొందినవారు ఎం.వి.రమణారెడ్డి, డి.యల్. రవీంద్రారెడ్డి, రఘురామిరెడ్డి. (అయితే ఈ విషయంలో ఆళ్ళగడ్డ ముఠాదారుల లాభాలతో పోలిస్తే తమ దౌర్జన్యం లెక్కలోకిరాదని వీళ్ళు పెదవి విరుస్తారు). ఒక్క తెలుగుగంగ కాంట్రాక్టేగాక విలువైన సివిల్ కాంట్రాక్టులేవైనా ఈ పాలెగాళ్ళ ఇష్టాయిష్టాల ప్రకారం జరగాల్సిందే. తామే కాంట్రాక్టు తీసుకోదలచుకుంటే వేరే ఎవ్వరూ పోటీకి పోవడానికి వీల్లేదు. పోటీకి పోతే వాళ్ళతో ఘర్షణకు దిగి బాంబుదాడులకు తుపాకి కాల్పులకు సిద్ధపడవలసిందే. కాంట్రాక్టు పొందితే వాళ్ళు అడిగినంత కమిషన్ ఇచ్చుకోవలసిందే. సర్దుబాటు చేసుకోకుండా, కమీషన్ ఇచ్చుకోకుండా ఒక పాలెగాడి రాజ్యంలో మరొకరు కాంట్రాక్టు తీసుకుంటే చాలా నష్టం చవి చూడవల్సి ఉంటుంది.

ఎర్రగుంట్ల, ముద్దనూరు ప్రక్క ప్రక్కన ఉన్న రెండు మండల కేంద్రాలు. మొదటిది కమలాపురం నియోజకవర్గంలోను రెండవది జమ్మలమడుగు నియోజకవర్గంలోను ఉన్నాయి. ఈ పరిసరప్రాంతాలలో సిమెంటు, విద్యుత్తుల ఉత్పత్తి జరుగుతుంది. మూడు సిమెంట్ ఫ్యాక్టరీలు ఒక విద్యుదుత్పత్తి కేంద్రం ఉన్నాయి. ఈ ఉత్పత్తి కేంద్రాల కాంట్రాక్టులు

మైసూరారెడ్డి, శివారెడ్డి, రమణారెడ్డిల పెత్తందారీ ఘర్షణల్లో భాగమయ్యాయి. మైసూరారెడ్డి స్వయంగా ఫాక్షనిస్టుకాకపోయినా అతని అనుచరులలో ఫాక్షనిస్టులున్నారు. అతని స్వగ్రామం నిడిజీవి ఎరగుంట్లకు, ముద్దనూరుకు మధ్యనఉంది. అతన్ని దత్తతతీసుకున్న మేనమామ సుబ్బిరెడ్డి కుటుంబం ఆ వూరిలో ఎదురులేని ఫ్యూడల్ పెత్తనం చెలాయించిన భూస్వాములు, సారా వ్యాపారులు, క్వారీ యజమానులు. వాళ్ళ అభిమతానికి వ్యతిరేకంగా ఓటువేసే హక్కు ఆ వూరిలో ప్రజలకు ఎప్పటినుండోలేదు. కమ్యూనిస్టుపార్టీ బలంగా ఉన్న రోజుల్లోసైతం నిడిజీవిలో ఆ పార్టీ జెండా ఎగురవేసే హక్కు ఎవరికీలేదు. తమభూముల మీదుగా సరుకు రవాణాచేసే ఇతర క్వారీ యజమానులనుండి వాళ్ళు బండికి ఇంత అని సుంకం వసూలు చేసేవారు. ఈ ఆధిపత్యానికి వారసుడైన మైసూరా రెడ్డి కొంతకాలం కమలాపురం ఎం.ఎల్.ఎ. గానూ మంత్రిగానూ ఉన్నాడు. ఈ అర్హతలకారణంగా ఎర్రగుంట్ల ముద్దనూరు ప్రాంతంలోని పారిశ్రామిక కేంద్రాలలోని కాంట్రాక్టులపైన గుత్తాధిపత్యం నెలకొల్పే సహజహక్కు తనకు ఉందని అనుకుంటాడు. ఇక శివారెడ్డి, రమణారెడ్డిల అర్హత గురించి కొత్తగా చెప్పనవసరంలేదు.

సిమెంట్ ఫ్యాక్టరీలలో లోడింగ్ కాంట్రాక్టు ప్రధానమైన కాంట్రాక్టు. రాయిని లారీలలోకిఎక్కించే ట్రక్ లోడింగ్ కాంట్రాక్టు, గూడ్సు రైలులోనికి ఎక్కించే వ్యాగన్‌లోడింగ్ కాంట్రాక్టు అని రెండు రకాలుంటాయి. ఇదికాక దినకూలీలను సమకూర్చే లేబరు కాంట్రాక్టు ఉంటుంది. ఈ కాంట్రాక్టుల విషయంలో కంపెనీ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఇక్కడున్న పరిశ్రమలకు లేదు. మైసూరారెడ్డి మనుషులకో, శివారెడ్డి మనుషులకో, రమణారెడ్డి మనుషులకో ఇచ్చుకోవాలి. వాళ్ళు పోటీపడితే బాంబుదాడులు, కొట్లాటలు జరుగుతాయి కాబట్టి పోటీ పెట్టకుండా ఎవరో ఒకరితో సర్దుబాటుచేసుకోవాలి. లేకపోతే వాళ్ళ రాజీల ప్రకారం తాము నడుచుకోవాలి. ఇది అన్ని కంపెనీలు నేర్చుకున్నాయి. ఇండియా సిమెంట్ లిమిటెడ్ (ఒకప్పటి కోరమాండల్ సిమెంట్ కంపెని) కాంట్రాక్టులను మైసూరారెడ్డి మనుషులు, శివారెడ్డి అనుచరుడైన కాటమయ్య పంచుకున్నారు. లేబరు కాంట్రాక్టు, వ్యాగన్‌లోడింగ్ కాంట్రాక్టు మైసూరారెడ్డి మనుషులవి. ట్రక్‌లోడింగ్ కాంట్రాక్టు కాటమయ్యది. సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సి.సి.ఐ.) లో లోడింగ్ కాంట్రాక్టులు ఎం.వి.రమణారెడ్డి మనుషులవే. టెక్స్‌మాకో ఫ్యాక్టరీ ఈ ప్రాంతంలోని మూడవ సిమెంట్ ఉత్పత్తి కేంద్రం. ఇది కోడూరు గ్రామ శివార్లలో ఉంది. ఈ ఫ్యాక్టరీ కాంట్రాక్టులు కోడూరు, పెద్దనపాడు గ్రామాల ఫాక్షనిస్టుల గుత్తాధిపత్యంలో ఉన్నాయి. మిగిలిన రెండూ ప్రైవేటు సంస్థలు కాగా సి.సి.ఐ. ప్రభుత్వరంగ సంస్థ. కాంట్రాక్టుల విషయమై పాలెగాళ్ళతో సర్దుబాటు

చేసుకోవడం ప్రభుత్వరంగ సంస్థకు సులభంకాదు. ఐ.సి.యల్., టెక్స్‌మాకో టెండర్లు పిలవడమే మానేశాయి. వీటిలో మొదటి కంపెనీ ఒకసారి టెండర్లు పిలిచి పొరపాటు గ్రహించి, నాలుక కరచుకొని షెడ్యూలు తెప్పించుకున్న వారందరికీ రీఫండ్ ఇచ్చేసింది. సి.సి.ఐ. కి ఇదంత సులభంకాదు. చట్టాలు, నియమాలు, అసెంబ్లీలో ప్రశ్నలు అడ్డంవస్తాయి. అందువల్ల సి.సి.ఐ. యాజమాన్యం 1987లో ప్రభుత్వంనుండి టెండర్లు పిలవకుండా కాంట్రాక్టులు ఇచ్చే అధికారం కల్పించే జి.వొ. తెచ్చుకుంది.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే ఈ మూడు కంపెనీలలోని సకల యూనియన్ల అధ్యక్షులు కూడా ఈ పాలెగాళ్ళే. మైసూరారెడ్డి, రమణారెడ్డి, రవీంద్రారెడ్డి, కాటమయ్య, వరదరాజులరెడ్డి చెరికొన్ని యూనియన్లకు అధ్యక్షులు. వీళ్ళను కాదని వేరే ఎవ్వరికి కాంట్రాక్టు ఇవ్వడం యాజమాన్యాలకు సాధ్యంకానట్లే, వీళ్ళందరినీ కాదని స్వతంత్రంగా యూనియన్ పెట్టుకోవడం కార్మికులకు కూడా సాధ్యంకాదు. కంపెనీలో మీదినుండి క్రిందిదాకా ఇటువంటి ఆధిపత్యం నెలకొని ఉండడం అటు ఉత్పత్తికీ ఇటు కార్మికుల హక్కులకు కూడా మంచిది కాదని వేరే చెప్పనవసరంలేదు. అందువల్ల ఈ ప్రాంతంలో సిమెంట్ ఫ్యాక్టరీలు ఇంకా నెలకొల్పడానికి అవకాశం ఉన్నప్పటికీ ఈ పాలెగాళ్ళ ప్రాబల్యంవల్ల ఎవరూ ముందుకు రావడంలేదని అనుభవజ్ఞులు అంటారు. పులివెందుల గురించి ఒక వై.యస్. అభిమాని సైతం ఈ విధంగా అంటాడు. 'ఒక కంకర మిషన్ పెట్టుకున్నా వాళ్ళు తీసుకొమ్మన్న వాళ్ళను పనిలోకి తీసుకోవాలి, వాళ్ళు సప్లైచేయమన్న వాళ్ళకు కంకర సప్లై చేయాలి ఈ వాతావరణం కడప జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ఒక ఆటంకం అయిందని వేరే చెప్పవవసరంలేదు.

అయితే ఈనాణేనికి ఒంకొక ముఖం కూడా ఉంది. ఇక్కడ ఫ్యాక్టరీలు పెట్టినవాళ్ళు ఎన్ని అక్రమాలు చేసినా ఎవరో ఒక ముఠానాయకుడిని మంచి చేసుకుంటే ప్రభుత్వం కళ్ళు, ప్రజలకళ్ళు గప్పి తప్పించుకోవచ్చు. ప్రొద్దుటూరులోని ఆంధ్రాకాటన్ మిల్లులో ఎం.వి.ఆర్. ప్రారంభించిన కార్మిక సంఘం గురించి చెప్పాం. కాలక్రమంలో (1986 లో) ఆ కంపెనీ మూత పడింది. యజమానులు నష్టాలు వస్తున్నాయని చెప్పి లాకౌటుచేసి బాకీలన్ని ఎగ్గొట్టి వెళ్ళిపోయారు. ఎం.వి. రమణారెడ్డి నుండి ఎటువంటి ప్రతిఘటనారాలేదు. అంతకుముందు నుండి వాళ్ళు అమ్మకాల ధర తక్కువచూపించి, కొనుగోలు ఖర్చు ఎక్కువ చూపించి కంపెనీని ముంచారు. అందులో ఎం.వి.ఆర్ కు కొంతవాటాముట్టింది. కార్మికుల జీతాలనుండి ప్రావిడెంట్ ఫండ్ కోసం సేకరించిన మొత్తాన్ని అకౌంట్‌లో జమచేయకుండా ఎం.వి.ఆర్. కు ఎన్నికల ఖర్చుకోసం ఇచ్చారు. కంపెనీలో కార్మిక నాయకుడేకాక నియోజక వర్గంలో హింసాత్మక ఆధిపత్యం చెలాయించే పెత్తందారు కూడా అయిన రమణారెడ్డిని మంచి చేసుకుని

తన అక్రమార్జనలో కొంతపాటా అతనికి ముట్టచెప్పడంవల్ల కంపెనీని సిక్‌చేసి మూసేసి పోవడం యాజమాన్యానికి సులభమయింది. ఆ తరువాత ఎం.వి.రమణారెడ్డి ఫ్యాక్టరీ స్థిరాస్తినీ యంత్రపరికరాలనూ ఒక్కొక్కటిగా అమ్ముకున్నాడు.

ముఠా కొట్లాటలు, ముఠా తత్వం కొత్త పరిశ్రమల స్థాపనకూ పారిశ్రామిక వ్యాప్తికీ ఆటంకం కావడమేకాక ప్రభుత్వ పథకాల అమలుకు ప్రభుత్వశాఖలు చేపట్టే అభివృద్ధి పనులకు కూడా ఆటంకంగా పరిణమించాయి.

సాగునీటి కరువు ఉన్నచోట ఒక నాయకుడు ఒక ప్రాజెక్టు గురించి ఆందోళన చేస్తే వేరొకడు కావాలనే మరొక ప్రాజెక్టుకోసం చేస్తాడు. ఈ తగాదాను ఆసరాచేసుకుని ప్రభుత్వం దేనినీ మంజూరుచేయదు. ఒకడు ఎం.ఎల్.ఎ. గా ఉండగా వేరొకడు ప్రభుత్వపనులు కాంట్రాక్టు తీసుకుంటే ఇతనికి పని సకాలంలో పూర్తిచేయడానికి అతను సహకరించడు, పని పూర్తిచేస్తే అతనికి పేరు వస్తుందని ఇతను సకాలంలో పూర్తిచేయడు.

రాయచోటి ఆర్.టి.సి. బస్టాండు నిర్మాణ ప్రహసనం ఒకమంచి ఉదాహరణ. రాయచోటి కడప జిల్లాలో ఒక ప్రధాన తాలూకా కేంద్రం. అక్కడ బస్సులు నిలిచే బహిరంగప్రదేశంఉంది. అన్ని తాలూకా కేంద్రాలలోను ఇటువంటి పాత బస్టాండ్లస్థానంలో ఆధునిక సౌకర్యాలుగల కొత్త బస్టాండ్లు వచ్చాయి. రాయచోటిలోనూ ఆ పథకం మంజూరైంది. కాని ఏండ్ల తరబడి అమలుకాకుండా ఉండిపోయింది. ఊరిలో క్రొత్త బస్టాండు ఎక్కడ నిర్మించాలనే విషయంలో అభిప్రాయభేదాలురాగా పాలకొండ రాయుడు ఒక వైపు నాగిరెడ్డి ఇంకొక వైపు నిలబడి సాగదీశారు. నాగిరెడ్డి ఎం.ఎల్.ఎ. కాగా బస్టాండు కాంట్రాక్టు పాలకొండరాయుడిది. కాబట్టి నిర్ణీత గడువు ముగిసేదాకా పని జరుగలేదు. ఎం.ఎల్.ఎ. (నాగిరెడ్డి, అతని తర్వాత నారాయణరెడ్డి) వై.యస్. మనిషి కాబట్టి ట్రాన్సుపోర్టు మినిస్టర్‌గా ఉన్న మైసూరారెడ్డి బస్టాండు నిర్మాణం తొందరగా ముగింపజేయాలని ఆసక్తి చూపించలేదు.

తమ రాజకీయ పురోగమనానికి ముఠాకక్షలను ప్రాతిపదిక చేసుకున్న క్రమంలో ఈ పాలెగాళ్ళంతా సమాజంలో కులపరమైన విభజనలను వైషమ్యాలను పెంచారు. పాలకొండరాయుడు, చెంగల్రాయులు ఒక ప్రక్క, వై.యస్. అనుచరులైన రెడ్డి కులస్తులు మరొక ప్రక్క నిలబడడంతో కోడూరు, రాజంపేట, రాయచోటి ప్రాంతాలలో బలిజలకు, రెడ్లకు కులవైషమ్యం పెరిగింది. జిల్లా అంతటా వివిధ కులాలకు చెందిన ముఖ్యులను ముఠాదారులు తమవైపు ఆకర్షించి తమ ముఠాలలో వారికి చోటు కల్పించిన క్రమంలో సమాజంలో విభిన్న కులాల మధ్య అంతరాలు, విద్వేషాలు పెరిగాయి. రెడ్డి కులంలో శాఖల

మధ్య విభేదాలు కూడా ముఠానాయకుల కొట్లాటలకు సాధనాలయ్యాయి. ఆ క్రమంలో శాఖా విభేదాలు పెరిగాయి. ప్రొద్దుటూరు ముఠా కొట్లాటల్లో వరదరాజులు రెడ్డిది పెడకంటి శాఖ కాగా రమణారెడ్డిది పాకనాటి శాఖ. అంతకుముందు రమణారెడ్డి ఘర్షణ పెట్టుకున్న చంద్ర ఓబుల్ రెడ్డి కూడా పాకనాటిరెడ్డే. పాకనాటిరెడ్లకు నాయకుడెవరు అనేదే వారిఘర్షణకు మూలం అనే అభిప్రాయం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని పెడకంటి రెడ్లను సమీకరించడంకోసం రాజశేఖర రెడ్డి రమణారెడ్డికి వ్యతిరేకంగా వరద రాజులురెడ్డిని ప్రోత్సహించాడని అంటారు.

సమాజంపైన సాయుధప్రాబల్యం నెలకొల్పిన ఈ పాలెగాళ్ల పాలన అన్ని రకాల సంప్రదాయక అణచివేతనూ పదిలంగా కాపాడుతుంది. ఈ పెత్తందార్ల ప్రాపంచిక దృక్పథం పూర్తిగా సంప్రదాయకమైనది. కులతత్వం, అగ్రకుల అభిజాత్యం, మగపెత్తనం, పితృస్వామ్యభావజాలం, భూస్వామ్య దురహంకారం, ఈ సంస్కృతి ప్రధాన లక్షణాలు. వీళ్ల ఆధిపత్యం సమాజంలో సంప్రదాయక విలువలను, అణచివేతను భద్రంగా రక్షిస్తుంది, పెంచుతుంది. వీళ్లు చేసే పంచాయతులలో ఒక్కొక్కసారి ఉద్దేశ్యపూర్వకంగా అన్యాయం చేయడం ఒకెత్తయితే, వీళ్ల బుద్ధికి న్యాయంఅని తోచే పరిష్కారం సంప్రదాయక ఆధిపత్య దృక్పథానికి అనుగుణంగా ఉండడం ఇంకొక ఎత్తు. దీనివల్ల అధికంగా నష్టపోయేది స్త్రీలు. మన సమాజంలో పెద్ద మనుషుల దగ్గరికి చేరే పంచాయతులలో అధికభాగం భార్యాభర్తల సంబంధాలకు, ఆస్తిపంపకాలకు, వివాహేతర లైంగిక సమస్యలకు సంబందించినవే ఉంటాయి. వీటిని సంప్రదాయక దృక్పథంతో పరిష్కరిస్తే ఎక్కువగా నష్టపోయేది స్త్రీలే. ఇది ఎక్కడయినా సమస్యేగానీ, ఇతరప్రాంతాలలో భూస్వామ్యశక్తులను కాదని సమస్యలు పరిష్కరించుకునే అవకాశం కొంతమేరకు ఉంటుంది. ఇక్కడి ముఠా సంస్కృతిలో ఒకసారి సమస్య ఒక ముఠానాయకుడి దగ్గరకు చేరితే అతన్ని కాదని పరిష్కరించుకోవడం చాలా కష్టం. వివాదంలో ఒక పక్షం కాకపోతే మరొక పక్షం పమస్యను ఏదో ఒక ముఠానాయకుడి దగ్గరకు ఎలాగోలా తీసుకుపోతారు కాబట్టి అధికభాగం సమస్యలు ముఠానాయకుల సాయుధ పెత్తనం క్రింద సంప్రదాయక దృక్పథంతోనే పరిష్కారం అవుతాయి. కులంకట్టడి చెడకుండ, కులందొంతరలు చెక్కు చెదరకుండ, భార్యపైన భర్త పెత్తనం దెబ్బ తినకుండ, కుటుంబంలో స్త్రీ ధర్మానికి కళంకం అంటకుండ తప్పొప్పులు నిర్వహించి 'న్యాయనిర్ణయం' చేస్తారు. భర్తపెట్టే హింసలు భరించలేక పుట్టింటికొచ్చిన అమ్మాయిలను, ఏ పాలెగాడో పాలెగాడి అనుచరుడో పంచాయితీ నిర్వహించి బలవంతంగా వెనక్కిపంపించి కాటికి చేర్పించిన ఘటనలు కోకొల్లలు.

సాంఘికంగా బలహీనులయిన వారిపైన దాడులు కూడ చాలా జరుగుతుంటాయి. వాటికి ముఠాల అండ దొరుకుతుంది. తమకు ప్రాబల్యం ఉన్న ప్రాంతంలో స్త్రీలను బలాత్కారంగా లొంగదీసుకోవడం కొందరు ముఠాదారులకూ వారి అనుచరులకూ అలవాటు. ఆ స్త్రీలు బయటికొచ్చి చెప్పుకునే పరిస్థితిలో ఉండరు కాబట్టి ఇవి వదంతులుగానే ఉండిపోతాయి. అంతమాత్రం చేత ఇవి అసత్యాలు కావు.

దళిత కులాలపైన రెడ్డి కులస్తుల దాడులు ఈ పాలెగాళ్ల పాలనలో నిరాటంకంగాసాగుతాయి. ఇక్కడ ఒక్క ఉదాహరణ మాత్రం ఇస్తాము. దువ్వూరు మండలంలోని మాచనపల్లికి చెందిన చోకం సుబ్బారెడ్డి ప్రొద్దుటూరు ఎం.ఎల్.ఏ. వరదరాజులు రెడ్డి అనుచరుడు. 1992 జూన్ 14నాడు సుబ్బారెడ్డి, అతని కుమారులు వెంకటేశ్వర్లు అనే వడ్డెర కులస్తుడిని గ్రామంలోనే పట్టపగలు హత్య చేసారు. అతనిని తరిమికొట్టి తీవ్రంగా గాయపరచి చితిపేర్చి నిప్పుపెట్టారు. అతను ఓపిక తెచ్చుకొని లేచి పారిపోగా ట్రాక్టర్‌తో ఢీకొట్టి క్రిందపడేసి స్పిరిట్‌పోసి సజీవంగా దహనం చేసారు. అతని అస్తికలు కుందు నదిలో పారేసారు. మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు ఇవ్వకుండ ఉండడం కోసం హంతకులు ఆమెను కిడ్నాప్ చేసి తీసుకుపోయి ఎం.ఎల్.ఏ. వరదరాజులు రెడ్డి స్వగ్రామమయిన కామనూరులో ఎం.ఎల్.ఏ. ఇంట్లోనే రెండురోజులు దాచిపెట్టారు. తనభర్త చనిపోలేదనీ, ఊరూరూ తిరిగి చీరలు అమ్ముకోవడం అతని వృత్తి కాబట్టి ఆపనిమీద పోయాడనీ చెప్పడానికి ఆమెను ఒప్పించారు. ఆ తరువాత వరదరాజులు రెడ్డికి సన్నిహితుడు, న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు, యూనియన్ లీడర్ అయిన లింగారెడ్డి ఆమెను ప్రొద్దుటూరు డి.ఎస్.పి. దగ్గరికి తీసుకుపోయి ఈ కథ ఆమె చేతనే చెప్పించాడు.

ఈ పాలెగాళ్లు చేసే పంచాయతులలో అన్యాయం జరిగినవాళ్లు చెప్పుకునే దిక్కులేక నష్టాన్ని దిగమింగి బ్రతికే దుర్గతికి ఒక ఉదాహరణ ప్రొద్దుటూరుకు చెందిన టీచర్ చెంచురెడ్డి కథ. చెంచురెడ్డి అయిదుగురు అన్నదమ్ములు అక్కచెల్లెళ్లలో ఒకడు. 1957లోనే వీళ్ల పెద్దన్న ఓబుల్‌రెడ్డి ఆస్తిపంపకం చేసుకొని తనవాటా తీసుకున్నాడు. ఆ తరువాత అతను వివాహరీత్యా కోవూరి కొండారెడ్డి అనే ధనవంతుడికి బంధువయ్యాడు. అతనికి పుట్టిన కొడుకు నరసింహారెడ్డి ఎం.ఎల్.ఏ. వరదరాజులురెడ్డి సోదరిని పెండ్లి చేసుకున్నాడు. అతను చనిపోయిన తర్వాత అతని భార్యా కొడుకులు బలవంతులతో తమకున్న బంధుత్వాన్ని వాడుకొని చెంచురెడ్డి నిర్వహణలో ఉన్న మిగిలిన ఆస్తి కాజేయడానికి పూనుకున్నారు. చెంచురెడ్డి వాళ్ల దాడికి భయపడి వాళ్లు సూచించిన మధ్యవర్తులతోనే పంచాయితీకి ఒప్పుకున్నాడు. ఈ మధ్యవర్తుల్లో ఒకడు మైదుకూరు పెత్తందారు డి.ఎల్.రవీంద్రారెడ్డి. వాళ్లు చెంచురెడ్డి

తదితరులకు వారి తల్లిగారి నుండి సంక్రమించిన ఆస్తినీ, స్వార్జితమైన ఆస్తినీ కూడ నరసింహారెడ్డికి రాయించి హుటాహుటిన హక్కు విడుదల పత్రం రిజిస్టర్ కూడ చేయించేసారు. అసలు విషయం ఏమిటంటే నరసింహారెడ్డి రవీంద్రరెడ్డికి బాకీ ఉన్నాడు. ఈ ఆస్తి అతనికి ఇప్పిస్తే తన బాకీ వసూలు చేసుకోవచ్చునని రవీంద్రారెడ్డి ఆలోచన. అంతపనీచేసి ఆయన తన బాకీ వసూలు చేసుకొని వెళ్లిపోయాడు. ఆ సంవత్సరం (1989) చివరిలో జరిగిన ఎన్నికల్లో మైదుకూరు ఎం.ఎల్.ఏ. గా గెలిచి రాష్ట్రప్రభుత్వంలో రెవెన్యూ మంత్రి అయ్యాడు. ఆస్తి పోగొట్టుకున్న చెంచురెడ్డి, అతని తోడబుట్టిన స్త్రీలు ఆనాటినుండీ ఈనాటిదాకా న్యాయంకోసం అందరినీ అభ్యర్థించి నోరునొచ్చి మూగవారయ్యారు.

బాధితులు ఈ పెత్తందార్ల పరిష్కారాన్ని కాదని ప్రభుత్వ యంత్రాంగం దగ్గరికీ పోలీసుల దగ్గరికీ పోవచ్చుకదా అంటారేమో. దానివల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. ఆ యంత్రాంగానికి ఈ పాలెగాళ్ల వ్యవస్థలో స్వేచ్ఛలేదు. అధికార్లనే ముఠానాయకులు తన్నిపోయినా అడిగే దిక్కులేదు. పైన చెప్పిన చెంచురెడ్డి అప్పటిజిల్లా ఎస్.పి. అరవిందరావు దగ్గరికి పోయి తనకు న్యాయం చేయమని అడిగితే, 'మీ ఎం.ఎల్.ఏ. జోక్యం చేసుకోకుండ ఉంటే నేనేమయినా చేయగలను' అన్నాడంట మళ్లీ అరవిందరావుకు ఫాక్షనిస్టులను ధిక్కరించిన ఎస్.పి. గా గుర్తింపు ఉంది.

అధికారయంత్రాంగం నియమబద్ధంగా పనిచేయకపోతే ప్రజలకు న్యాయసమ్మతంగా దక్కవలసిన హక్కులు దక్కవు. న్యాయానికి రక్షణ ఉండదు. కానీ ప్రభుత్వ అధికార్లకు ఆదేశాలు జారీచేసి తమ అభీష్టాన్ని అమలు చేయించుకోవడం, అమలుచేయని అధికారిని వేధించడం, బెదిరించడం, దాడిచేసి కొట్టడం, బదిలీ చేయించడం, ముఠా నాయకులకు వెన్నతో పెట్టిన విద్య. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా జమ్మలమడుగు ప్రాంతంలో శివారెడ్డి ప్రభుత్వ అధికారులను శాసించేవాడు. 'మీకు జీతం ఇచ్చేది మా ప్రభుత్వం కాబట్టి నేను చెప్పినట్టు మీరు చేయాలి' అనేది అతని తర్కం. ఇది పాలెగాడి తర్కమే తప్ప ప్రజాస్వామ్య తర్కం కాదు. ప్రొద్దుటూరులో ఒక దశాబ్ద కాలం ఎం.ఎల్.ఏ. గా ఉన్న వరదరాజులు రెడ్డికి కూడ అధికారులను వేధించి తన ఆజ్ఞానుసారము పనిచేయించుకుంటాడన్న పేరు ఉంది. ఒకసారి ప్రొద్దుటూరు మునిసిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నికలో వరదరాజులు రెడ్డి కౌన్సిలర్లు కాని వాళ్లను తీసుకొచ్చి కూర్చోపెట్టి కౌన్సిలర్లుగా చలామణిచేసి, ఆర్.డి.వో. ను 'బయటకు ఎట్లా పోతావో చూస్తాను' అని బెదిరించి ఎన్నిక జరిపించాడు. ఇక వై.ఎస్. రాజశేఖర రెడ్డి మాట ఒక్క పులివెందులలోనే కాక జిల్లా అంతటా ప్రభుత్వ సిబ్బందికి శిరోధార్యం.

ముఠాకొట్లాటలు గ్రామస్థాయికి పరిమితం అయిన రోజులలో పోలీసులు పాక్షనిస్టులకు భయపడేవారు కాదనీ ధైర్యంగా తమడ్యూటీ చేసే వారనీ, ముఠాఘర్షణలు రాజకీయాలలోకి ప్రవేశించి జిల్లా రాజకీయాలను శాసించే స్థితికి చేరుకున్న క్రమంలో పోలీసులకు స్వతంత్రించి పనిచేసే స్వేచ్ఛ కరువయిందని ఒక రిటైర్డ్ పోలీస్ అధికారి అంటాడు. ఏం చర్య తీసుకుంటే ఏం కొంప మునుగుతుందోనని భయపడుతూ పనిచేసే దుస్థితి పోలీసులకు దాపురించిందంటాడు. ఆయన గతకాలపు ఉదాహరణలు రెండిస్తాడు. 1950కి పూర్వం ఖాదరాబాద్ పోలీస్ స్టేషన్‌పైన ఒక గ్రామ 'రెడ్డి' తన గుంపును తీసుకొచ్చి దాడిచేయగా అక్కడున్న కానిస్టేబుల్ కాల్పులు జరిపి ముగ్గురిని చంపాడు. కమలాపురం తాలూకా ముని గంగిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో, సంఘర్షించుకుంటున్న ముఠాలను చెదరకొట్టడానికి ఒక ఎస్.ఐ., ఒక కానిస్టేబుల్ కాల్పులు జరిపి నలుగురిని చంపారు. ఈ రోజు అటువంటి సాహసం పోలీసులెవ్వరూ చేయరు. 1984లో జమ్మలమడుగులో శివారెడ్డి పోలీస్‌స్టేషన్ పైన దాడిచేసి, అరెస్టయివున్న తనవాళ్లను విడిపించుకొనిపోయి డి.ఎస్.పి. రాజరత్నం నాయుడు నివాసంపైన బాంబులు వేసి మరీ పోయాడు. పోలీసులు ఏమీ చేయలేక పోయారు. జమ్మల మడుగులో ఒకసారి జిల్లా ఎస్.పి. తో సహా పెద్దపోలీసు బందోబస్తు ఉండగానే ఇరువర్గాలూ బాంబులతో, తుపాకులతో యుద్ధం చేసుకున్నారు. ప్రొద్దుటూరులో వరదరాజులురెడ్డి మనుషులు కోఆపరేటివ్ బ్యాంకు సిబ్బందిని దోచుకొని సూట్‌కేసుతో సహా పట్టుపడ్డారు. అయితే వరదరాజులు రెడ్డి ప్రొద్దుటూరు ఎ.ఎస్.పి. అలోక్ ప్రభాకర్ మీద ఒత్తిడి తెచ్చి కేసునమోదు కాకుండ చేసి సూట్‌కేసు కూడ తీసుకుపోయారు.

1994 జూలై రాత్రి పులివెందుల తాలూకాలోని సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో ఇటువంటి మరొక వింత జరిగింది. ఆ రాత్రి సింహాద్రిపురం ఎస్.ఐ. అయిన ప్రకాశ్ బాబు అనే యువకుడు ముద్దనూరు నుండి తన స్టేషన్‌కు తిరిగి వస్తుండగా, రోడ్డుప్రక్కన జీపు ఆపి తుపాకి పట్టుకొని చట్టవిరుద్ధంగా వేట ఆడుతున్న కొంతమంది కనిపించారు. ఎస్.ఐ.వాళ్లందరినీ స్టేషన్‌కు రమ్మన్నాడు. తాము వై.ఎస్. రాజశేఖరరెడ్డి కూమారుడయిన జగన్మోహనరెడ్డి స్నేహితులమని వాళ్ల చెప్పినా ఎస్.ఐ. ఖాతరు చేయలేదు. అయితే వారిలో ఒకడు తనకు వేట తుపాకీ ఉపయోగించే లైసెన్స్ ఉందనీ అది పులివెందులలో ఉందనీ చెప్పగా, ఎస్.ఐ. అతనికి పులివెందులకుపోయి లైసెన్స్ తీసికొచ్చి చూపించే అవకాశం ఇచ్చాడు. అతనుపోయి జగన్మోహనరెడ్డికి ఫిర్యాదు చేసాడు. రాజశేఖరరెడ్డి కొడుకునే ఖాతరు చేయడా అని చెప్పి జగన్మోహన్‌రెడ్డి అయిదారు జీపులలో బయలుదేరి సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌పైన దండెత్తాడు. ఎస్.ఐ. ప్రకాశ్ బాబును పట్టుకొని పోలీస్ స్టేషన్‌లోపలే కొట్టాడు. ఎస్.ఐ. ఈ

దాడికి బెంబేలెత్తిపోయి లాకప్‌లో దూరి గడియ పెట్టుకున్నాడని వినికిడి (ఈ ఆఖరిముక్క మాత్రం నిజం కాదని పోలీసులు అంటారు).

అయితే పోలీసులు పూర్తిగా నిస్సహాయులనుకుంటే పొరబాటవుతుంది. ముఠానాయకులకు విధేయంగా ఉంటే తమకు కూడ చాలా ప్రయోజనాలుంటాయని పోలీసులు అర్థం చేసుకున్నారు. వాళ్లను సంప్రదించి కేసులుపెట్టడం, వాళ్ల పురమాయింపు మేరకు సాక్ష్యాలు తయారుచేయడం, వాళ్లు వద్దన్న కేసులు మూసేయడం నేర్చుకున్నారు. రాజభక్తి ప్రదర్శనలో ఒకరితో ఒకరు పోటీపడి లాభాలు పొందుతున్నారు.

ఒక్క పోలీసు వ్యవస్థనేకాక నేరవిచారణ వ్యవస్థను ఆద్యంతం ఫాక్షనిస్టులు వక్రీకరించారు. ఏ కేసూ పోలీస్ స్టేషన్‌కు వాస్తవికంగా రిపోర్టుకాదు. జరిగిన హత్య కూడ జరిగినట్టు రిపోర్టు కాదు. సంఘటన జరిగిన క్షణం నుండి రెండు వైపులా న్యాయవాదులు రంగంలోకి దిగుతారు. న్యాయవాదుల సలహామేరకే పోలీస్ కంప్లెయింట్ తయారవుతుంది. ఎవరెవరిని ఇరికిస్తే ప్రయోజనకరంగా ఉంటుందో వాళ్లందరినీ కేసులో ఇరికిస్తారు. దాడిలో గాయపడి మరణశయ్యమీద ఉన్న తమ వర్గం వారితో అబద్ధపు మరణ వాంగ్మూలాలు ఇప్పిస్తారు. (కొద్దిసేపటిలో చనిపోబోయేవాళ్లు ఉద్దేశ్యపూర్వకంగా ఇచ్చే ఈ అబద్ధపు మరణవాంగ్మూలాలు బ్రిటిష్ అధికారులకు ఆ రోజులలోనే చాలా విస్మయం కలిగించాయి). కోర్టులో జరిగే నేరవిచారణ న్యాయం చేసే ప్రక్రియ కాదు. ప్రతీకారం తీర్చుకోవడానికి, లేకపోతే రాజీపడడానికి అవసరమయిన విరామఘట్టం మాత్రమే. తరచుగా ముద్దాయిలలో అందరికి హతుని పక్షంవారు హతమార్చిన తరువాతనే, ఎవడో ఒక నాయకుడి సహాయంతో ఇద్దరూ రాజీపడి కోర్టులో 'హోస్టైల్' అవుతుంటారు. ముఠాలను పోషించే నాయకులు చేయవలసిన ముఖ్యమైన సేవలలో ఇదొకటి.

హంతకులు బలవంతులు, హతులు బలహీనులు అయితే అసలుకేసే ఉండకపోవచ్చు. కేసున్నా హతుడి తరపున సాక్ష్యం ఇవ్వడానికి ఎవరూ ముందుకురారు. అసలు న్యాయవ్యవస్థ, నేరవిచారణ వ్యవస్థ, తమ విధిని నిర్వర్తించవు. మైసూరారెడ్డి హోంమంత్రిగా ఉండగా 1992 ఫిబ్రవరిలో కడపలో ఎస్.సి. గంగిరెడ్డి అనే సీనియర్ న్యాయవాది హత్య జరిగింది. గంగిరెడ్డికి చెందిన ఒక బిల్డింగ్‌లో మైసూరారెడ్డి బావమరిది అయిన గోపాలరెడ్డి ఒక కాలేజీ నడుపుతున్నాడు. బిల్డింగ్ యజమాని అయిన గంగిరెడ్డికీ కిరాయికి తీసుకున్న గోపాలరెడ్డికీ ఏదో ఘర్షణ ఉండిందనీ దాని ఫలితంగానే గంగిరెడ్డిని గోపాలరెడ్డి చంపించాడనీ కడపలో జనం అనుకుంటున్నారు. అయితే మైసూరారెడ్డి ప్రోద్బలంవల్ల పోలీసులు అటువంటి అనుమానాన్ని

దరికి రానివ్వలేదు. ఆనాటినుండీ ఈనాటి దాకా ఆ కేసులో విచారణలేదు, చార్జిషీటు లేదు. హోంమంత్రిగా ఉండగా మైసూరారెడ్డి తన అధికారాన్ని జమ్మలమడుగు ప్రాంతంలో శివారెడ్డి వర్గాన్ని అణచడానికి చాలా దుర్వినియోగం చేసుకున్నాడు. ఏ కేసు ఎవరి మీద పెట్టాలి, ఎవరిని అరెస్టుచేయాలి అనే ఆదేశాలు హోంమంత్రి స్వయంగా స్థానిక పోలీసులకు ఫోన్ మీద ఇచ్చేవాడని చెప్పుకుంటారు. అందుకే శివారెడ్డిని చంపింది దేవగుడి వాళ్లయినా నింద కొంతమేరకు మైసూరారెడ్డి మీదికి పోయింది. అతను హోంమంత్రిగా ఉండగా తుపాకి లైసెన్స్‌లు చాలా విచ్చలవిడిగా ఇచ్చాడని కూడ చూసాము.

పులివెందుల ఎరుకలవాళ్లు మొదట డి.ఎన్.రెడ్డికీ తరువాత వై.ఎస్. రాజారెడ్డికీ మందీ మార్బలంగా ఉపయోగపడిన, విషయాన్ని లోగడ చెప్పాము. వాళ్ల దొంగతనాలలో కూడ ఈ రెండు కుటుంబాలకూ కొంత ప్రమేయం ఉందని చెప్పాము. అయితే ఎరుకల వాళ్లంటే సవర్ణ హిందువులలో సాధారణంగా ఉండే వ్యతిరేక భావంతోబాటు, వాళ్లలో కొందరు దొంగతనాలు చేస్తారనీ, కొందరు అధిక వడ్డీలకు అప్పులిచ్చి డబ్బు సంపాదించుకున్నారనీ, దొంగసారా తయారుచేసి అమ్ముతారనీ వాళ్లపట్ల పులివెందులలో కొంత నిరసన కూడ ఉంది. (నిజానికి వాళ్ల చేత దొంగతనాలు మాన్పించడానికి దొంగసారా కాసి అమ్మే వృత్తిని ప్రోత్సహించింది వై.యస్. వాళ్లే). ఈ నిరసనను కూడ తన పలుకుబడి పెంచుకోవడానికి రాజారెడ్డి వాడుకున్నాడు. అందరూ భయపడే ఎరుకల వాళ్లను అణచడం ఒక 'హీరో' చర్య. 1960లలో రాజారెడ్డి చంపించిన ఊసన్న గురించి పైన చెప్పాము. 1990 ఫిబ్రవరి నెలలో రాజారెడ్డి పెద్దగుంపును వెంటబెట్టుకొని పులివెందులలోని ఎరుకలవాళ్ల ఇళ్ల మీద దాడిచేసి డైనమైట్లు పెట్టి వాళ్ల ఇళ్లు పేల్చేసి, బాంబులువేసి, ఏడుగంటల పాటు విధ్వంసకాండకూ దహనకాండకూ పాల్పడ్డాడు. 100 ఇళ్లకుపైగా కాలి, పేలి ధ్వంసం అయ్యాయి. పోలీసులు ఉండికూడా ఏమీ చేయలేదు. ఈ దౌర్జన్యం గురించి కొంత ఆందోళన జరుగగా రాజారెడ్డిని కూడ ముద్దాయిగా చేర్చి కేసు పెట్టారు. అయితే కోర్టులో రాజారెడ్డిని చూపించి దాడి చేయించింది ఇతనేనా అని బాధితులను అడిగితే 'ఈయన ఎవరో మేము ఎప్పుడూ చూడలేదు' అనే సమాధానం చెప్పారు!

# ముగింపు

ముఠా కక్షల సంస్కృతి జిల్లా రాజకీయ సంస్కృతిగా మారి ప్రజల ఉనికిని శాసించడం కడప జిల్లాలో ప్రజల జీవితాలకే కాక ప్రజాతంత్ర చైతన్యానికి కూడ చాలా నష్టం చేసింది. సమస్యల పరిష్కారం కోసం సూత్రబద్ధంగా ఉద్యమించే పరిస్థితి, న్యాయంకోసం ధైర్యంగా నిలబడే పరిస్థితి, ప్రజల జీవితాలు బాగుపడడానికి అత్యవసరం. కానీ ఇక్కడి ముఠా సంస్కృతి అన్నిటినీ మింగేసింది. న్యాయంకోసం ఒక ఉద్యమం మొలకెత్తితే అది ముఠా ప్రయోజనాలలో చిక్కుకుపోతుంది. ముఠా కక్షల వలయంలో ఇరుక్కుపోతుంది. ప్రజాస్వామిక స్పందనకూ ప్రజాతంత్ర ఉద్యమాలకూ ప్రతిబంధకమైన వాతావరణం ఏర్పడింది. అప్పుడెప్పుడో 1950లకు పూర్వం కమ్యూనిస్టుపార్టీకి కడప జిల్లా గ్రామీణ ప్రాంతాలలో కొంత పట్టు ఉండిందని చెప్తారు. ఉద్యమం బలంగా లేకున్నా కమ్యూనిస్టులకు ప్రజాదరణ బాగా ఉండిందని పాతతరం కమ్యూనిస్టు నాయకులు అంటారు. కమ్యూనిస్టు పార్టీని నిషేధించిన తరువాత కమ్యూనిస్టుల కోసం వేటాడుతూ పోలీసులు గ్రామాలకు వచ్చినప్పుడు ప్రజలు ప్రతిఘటించారనీ, కమలాపురం, నియోజకవర్గంలోని రాజాపాలెంలోను, జమ్మల మడుగు నియోజక వర్గంలోని పెద్దపసుపుల లోనూ పోలీసు కాల్పులు జరిగి రాజాపాలెంలో ముగ్గురు, పెద్దపసుపులలో ఒకరు చనిపోయారని జ్ఞాపకం చేసుకుంటారు.

ఆ తరువాత మాత్రం చెప్పుకోదగ్గ ప్రజాఉద్యమమేదీ జిల్లాలో రాలేదు. దీనికి ఒకే ఒక మినహాయింపు 1984 లో మొదలయిన రాయలసీమ ఉద్యమం. రాయలసీమ వెనుకబాటు తనానికీ రాయలసీమ పట్ల రాష్ట్ర పాలకులు అనుసరిస్తున్న వివక్షతా ధోరణికీ వ్యతిరేకంగా, కడప జిల్లా కేంద్రంగా ఒక ఉద్యమం మొదలయింది. రమణా రెడ్డి, రాజశేఖరరెడ్డి, మైసూరారెడ్డి, రాజగోపాలరెడ్డి ఆ ఉద్యమానికి ముఖ్యనాయకులుగా ముందుకొచ్చారు. 1984–86 కాలంలో ఈ ఉద్యమం ఉధృతంగానే నడిచింది. కానీ నాయకుల ప్రతిష్ఠలకూ అహంభావానికీ రాజకీయ స్వార్థానికీ బలి అయింది. నాయకులు ఈ విధంగా ద్రోహంచేసిన ఉద్యమాలు చరిత్రలో ఎన్నో ఉన్నాయి. కానీ వాళ్లను కాదని ఉద్యమస్ఫూర్తిని కొనసాగించగల ప్రజాతంత్ర చైతన్యం నిర్మాణయుతంగా ముందుకు రాగలిగితే ఉద్యమం ఆ ద్రోహాన్ని అధిగమించి పురోగమించగలదు. కానీ రాయలసీమ ఉద్యమం నాయకులతో పుట్టి

నాయకులతోనే మునిగింది. మళ్లీ మళ్లీ నాయకుల ప్రయోజనాల కోసం రాయలసీమ శబ్దప్రయోగం జరుగుతూనే ఉంటుంది. కానీ ఒక విశాలమయిన ప్రజా ఉద్యమంగా అది తన ఉనికిని సాధించుకో లేకపోయింది.

రాయలసీమ వెనుకబాటు తనమొక్కటే కాదు. ఏ అన్యాయానికి వ్యతిరేకంగానూ బలమయిన ఉద్యమం రాలేకపోతూఉంది. ప్రతిస్పందన పుట్టిన క్షణంనుండి వ్యక్తుల పెత్తనానికీ పోటీకీ ముఠా సంస్కృతికీ బలి అయిపోతుంది. ఎంతోమంది ప్రజల ప్రాణాలు తీసిన దురన్యాయాలు సహితం కనీస నిరసనోద్యమాన్ని ఎదుర్కోకుండ సాగిపోతున్నాయి. ముఠా దౌర్జన్యాలు, ముఠాతత్వం, పెత్తందారీ ముఠా సంస్కృతి, ప్రజాతంత్ర చైతన్యాన్ని అంతగా దెబ్బతీసాయి.

కల్తీ సారాయి మరణాలు పెద్దసంఖ్యలో జరిగిన మూడు సంఘటనలలో రెండు కడప జిల్లాలోనే సంభవించాయి. 1991లో కొండాపురంలో 15 మంది, 1993 లో మైదుకూరులో 24 మంది కల్తీ సారా కాటుకు చనిపోయారు. మొదటిది మద్యనిషేధానికి ముందు, రెండవది తరువాత. కొండాపురంలో కల్తీసారాయి అమ్మింది స్థానిక సారా కాంట్రాక్టర్ రవీంద్రనాథరెడ్డి. ఇతను పులివెందుల తాలూకాలోని ఫాక్షన్ గ్రామాలలో ఒకటయిన కసునూరుకు చెందిన ముఠానాయకుడు. ఆ రోజూ ఈ రోజూ వై.ఎస్. రాజశేఖరరెడ్డి అనుచరుడు. చనిపోయిన వారందరూ దళిత, వెనుకబడిన కులాలకు చెందిన వారే. ఇంత ఘోరమైన హత్యాకాండకు నిరసనగా కొన్ని ప్రకటనలే తప్ప ఆందోళన ఏదీ జరగలేదు. ప్రభుత్వం న్యాయ విచారణ జరిపించిందికానీ పౌరహక్కుల సంఘం నివేదిక తప్ప వేరే సాక్ష్యమేదీ నమోదు కాకుండ కాంట్రాక్టరు చూసుకోగలిగాడు. 'మాకు రక్షణ ఇస్తే సాక్ష్యం చేస్తాం' అని కొందరు అన్నారంట. కానీ రక్షణ ఇచ్చేవాడెవడు!

మైదుకూరులో 24 ప్రాణాలు తీసిన కల్తీసారాయి అమ్మింది డి.ఎల్.రవీంద్రారెడ్డి అనుచరుడైన కుళ్లాయిశెట్టి అనే బ్రాంది వ్యాపారి. (ఆ సమయంలో రవీంద్రారెడ్డి రాష్ట్రప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి). అతని బ్రాంది షాపులో చట్టవిరుద్ధంగా విక్రయించిన నాటుసారాయి అతనికి సరఫరా చేసింది ప్రొద్దుటూరు ఎం.ఎల్.ఏ. వరదరాజులురెడ్డి అనుచరులయిన మాచనపల్లికి చెందిన చాకం సుబ్బారెడ్డి కుటుంబీకులు. (వడ్డెర వెంకటేశ్వర్లు

హంతకులుగా వీళ్లను ఇప్పటికే మీకు పరిచయం చేసాము). ఈ హత్యాకాండ గురించి కూడ ప్రజాందోళన ఏమీ జరుగలేదు కానీ న్యాయవిచారణలో కొంత సాక్ష్యం నమోదయింది. క్రిమినల్ కేసు నడుస్తూఉంది. కానీ హంతకుల పోషకులయిన నాయకుల ప్రతిష్ఠకు ఎంతమాత్రం దెబ్బ తగలలేదు.

ప్రొద్దుటూరు మండలంలోని మాలెపాడు గ్రామంలో ఈ సంవత్సరం (1995) ఆగస్ట్, సెప్టెంబర్, అక్టోబర్ నెలలలో 30 మందికిపైగా కాలుష్య సంబంధమైన తీవ్ర మలేరియా జ్వరంతో చనిపోయారు. ఒకే ఒక గ్రామంలో 30 మంది ఈ విధంగా చనిపోతే వేరే ఎక్కడయినా పెద్ద ఆందోళన జరిగి ఉండేది. కానీ ఈ పాలెగాళ్ల రాజ్యంలో అటువంటిదేమీ లేదు. ఈ కాలుష్యానికి కారణం ముద్దనూరు సమీపంలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నుండి వెలువడిన మురుగునీరు. అదే ప్రాజెక్టులో కడప జిల్లా పాలెగాళ్లెవరికయినా వారు కోరుకున్న కాంట్రాక్టు దొరకకపోతే వాళ్ల బీభత్సం సృష్టించగలరు. బాంబులు కురిపించి తమ అవసరం సాధించుకోగలరు. కానీ మాలెపాడు దుర్మరణాల గురించి ఏ ఒక్క నాయకుడు కనీసం ఒక ఆందోళనకు పిలుపు ఇవ్వలేదు. అందరూ గ్రామాన్ని 'సందర్శించి' వెళ్లి పోయారు. ఆ గ్రామమే ఒక ఫాక్షన్ గ్రామం. పెత్తనం కోసం హత్యలు చేసి జైలుకు పోయినవాళ్లు ఆ ఊరిలో ఉన్నారు. అయినా పౌరహక్కుల సంఘం ఒకపూట నిర్వహించిన ధర్నా తప్ప వేరే ఆందోళనేది జరుగలేదు.

పాలెగాళ్ల పెత్తనం, ముఠాతత్వం కల్పించిన ఈ స్తబ్దత నుండి బయటపడకపోతే కడపజిల్లాకు, రాయలసీమకు, సమస్యలనుండి విముక్తి లేదు. దానికోసం కావలసిన ప్రజాతంత్ర చైతన్యం పెంచుకోవడానికి ముందుకు రావలసిందిగా జిల్లా ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నాం. పాలెగాళ్ల పెత్తనం క్రింద అణగారిపడి ఉండకుండ ధైర్యంగా ఎదుర్కొందాం. ముఠాతత్వాన్ని ఛేదించి ప్రజాతంత్ర చైతన్య వికాసానికి ఆహ్వానంపలుకుదాం. ఈ కృషిలో జిల్లా ప్రజానీకానికి పౌరహక్కుల సంఘం అన్ని విధాల సహాయ సహాకారాలు అందిస్తుంది. ఐక్యంగా నిలబడి ప్రజాస్వామ్య హక్కులనూ ప్రజాతంత్ర జీవనవిధానాన్నీ కాపాడుకుందాం.

—:o0o:—